ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తిరుపతి
: fb.com/vaartha Digital
Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-9-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 217 పేజీలు: 10+4 వెల: 6.50

**మరింత ఉగ్రరూపంతో ఎల్‌నినో**
ప్రపంచవాతావరణ సంస్థ అంచనా
5లో

**భారత్ కంపెనీతో రూ.769 కోట్ల ఆయుధ డీల్**
ఎస్తోనియా రణక్షమంత్రి రాజీనామా



# నిశ్శబ్ద కల్లోలం!



- వేగంగా కరుగుతున్న హిమానీ నదాలు
- భారత్‌కు పెనుముప్పు ఏర్పడే అవకాశం
- ఓ వంక అతివృష్టి, మరో వంక అనావృష్టి
- అప్రమత్తం కాకుంటే తీవ్ర పరిణామాలు
- ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరిక

**జెనీవా, సెప్టెంబరు 4:** భూమి నిశ్శబ్దంగా రగిలిపోతోంది. ప్రకృతి తన సహనాన్ని కోల్పోతూ మానవాళికి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇందుకు తాజాగా జరిగిన నేపాల్-టిబెట్ విపత్తే ఉదాహరణ. పారిశ్రామిక విప్లవానికి ముందు రోజులతో పోలిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరగడం వల్లే ఇలాంటి విపత్తులకు కారణమని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది. అయితే, ఇది ఇంతటితో ఆగదని, ముమ్ముందు మరిన్ని విపత్తులను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరించింది. అన్నిటికంటే ముఖ్యంగా, మిగిలిన దేశాలతో పోల్చితే భారతదేశం ఎదుర్కోబోయే విపత్తులకు సంబంధించిన సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం యుఎన్ఇపి 'లిమిటింగ్ ఓవర్‌షూట్స్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది ఇందులో అనేక సంచలన విషయాలు దాగి ఉన్నాయి. >>2

## 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 8వ కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు గత సదస్సు నిర్ణయాల అమలుపై సమీక్షించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీ లక్ష్యాలపై కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణఆంధ్ర-2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా సిఎం చంద్రబాబు >>2

## గ'ఘన' విజయం



- జిఎస్ఎల్‌వీఎఫ్-17 సూపర్ సక్సెస్
- కక్షలోకి ఇఒఎస్ 05 ఉపగ్రహం
- ఈ యేడాదిలో ఆరు ప్రయోగాలు: ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడి
- ఈ విజయం దేశానికి గర్వకారణం: ప్రధాని నరేంద్రమోడీ
- సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేశ్ అభినందనలు

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గగనతనంలో ఇస్రో మరో ఘన విజయాన్ని సాధించింది. జిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ద్వారా ఇఒఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశించిన కక్షలోకి ప్రవేశపెట్టి తన సత్తా చాటింది. గత కొంతకాలంగా ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో ఎదురవుతున్న అవాంతరాలను అధిగమించి అత్యంత ప్రతిష్టాత్మకమైన కీలక ప్రయోగాన్ని సక్సెస్ చేసి ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత దేశ కీర్తి పతాకాను ఎగురువేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి శుక్రవారం వేకువ జామున పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ చీకట్లను చీల్చుకుంటూ నిప్పులు చెరుగుతూ నింగికేగిసింది. బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్ డౌన్ 27 గంటల 30 నిమిషాల పాటు కొనసాగి, భారత కాలమాన ప్రకారం రెండు గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ఇఒఎస్ 05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని జియో సింక్రోనెస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన రాకెట్ గమన 19 నిమిషాల సమయాన్ని ఆశించిన రీతిలో పూర్తి చేసింది. 51.70 మీటర్ల పొడవు, 2,367 టన్నుల బరువు గల ఈ రాకెట్ మొదటి దశలో నాలుగు ద్రవ ఇంధన స్ట్రాప్‌న్ బూస్టర్ల సాయంతో నింగికెగిసి 40 టన్నుల ద్రవ ఇంధనంతో మొత్తం 160 టన్నుల ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 151.2 సెకండ్లలో పూర్తి చేసింది. 420.5 రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహానికి అమర్చిన హిట్ షీట్స్ మొదటి దశ రెండో >>2



శుక్రవారం సతీష్‌ధావన్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్

# విద్యుదుత్పత్తి ఆపండి



తెలంగాణ ప్రభుత్వానికి కెఆర్ఎంబి ఆదేశం

- త్రిసభ్య కమిటీ భేటీలో కుదరని ఏకాభిప్రాయం
- 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలి: ఎపి
- 50శాతం చొప్పున చెరిసగం పంచాలి: తెలంగాణ
- వాడివేడిగా సమావేశం... నాల్గో వారానికి వాయిదా
- శ్రీశైలం రిజర్వాయర్‌లో తగినంత నీళ్లు లేవు.. పొదుపుగా వాడాలి
- ఇరు రాష్ట్రాలకు బోర్డు సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రీశైలం రిజర్వాయర్‌లో జల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి తాగునీటికి మాత్రమే వాటిని వినియోగించేందుకు పొదుపు చేయాలని కెఆర్ఎంబి తెలంగాణ ప్రభుత్వంను ఆదేశించింది. కృష్ణా నది యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ శుక్రవారం సమావేశం నీటి పంపకాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. సెప్టెంబర్ నాలుగో వారంలో మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సిలు తాగునీటి పంపకాలపై వాడివేడిగా చర్చను సుదీర్ఘంగా జరిపారు. వెలిగొండ, పోతిరెడ్డిపాడు తదితర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జల విద్యుత్ ఉత్పత్తిచేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ వెంటనే పోతిరెడ్డి పాడు, నీటి వాటా విషయం తెరపైకి తెచ్చింది. దీనితో ఆంధ్ర, తెలంగాణ అధికారులు వాదోపవాదాలు చేసుకోవడంతో ఏకాభిప్రాయం కుదరలేదు. రెండు రాష్ట్రాలు ఎవరి వాదనలు వారు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి ఇఎన్‌సి రమేష్‌బాబు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇఎన్‌సి నరసింహా మూర్తి హాజరైనారు. తెలంగాణ ప్రభుత్వం అవసరం లేకున్నా కూడా తక్కువగా ఉన్న నీటిని >>2



## గోదావరి కాలుష్యమంతా ఆంధ్రా పేపర్స్‌దే



- యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నారు
- పుష్కరకాలంగా పన్నులు కట్టడం లేదేంటి?
- పన్ను చెల్లించమంటే కోర్టులకెళ్లి కాలయాపన?
- తప్పుని సరిదిద్దుకునే అవకాశమిచ్చినా స్పందన లేదు
- ఉప ముఖ్యమంత్రి పవన్ ఆగ్రహం
- తక్షణమే ఆంధ్రా పేపర్స్‌పై చర్యలు తీసుకోండి
- కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఆదేశం

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజమండ్రి గోదావరి కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌దే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన ఆరోపణలు చేసారు. ఈ విషయంలో ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌దే పద్దతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ మేరకు డి.సిఎంఒ పవన్ కల్యాణ్ పేరిట ఒక ప్రకటన విడుదల చేసింది. రాజమహేంద్రవరం ఆంధ్రా పేపర్ లిమిటెడ్ పన్ను ఎగవేతకు దాదాపు పుష్కర కాలం పూర్తి కావస్తోందని డి.సిఎం ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆంధ్రా పేపర్ లిమిటెడ్' వారు యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లు తున్నారు. పన్నులు మాత్రం ఉద్దేశపూర్వకంగా ఎగ్గొడుతున్నారు. 2016తర్వాత కాతేరు గ్రామపంచాయతీకి గానీ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు గానీ ఒక్క రూపాయి >>2



## ఆ స్థల వివాదం తేల్చండి

- గోవా గవర్నర్ భూ వివాదంపై సీరియస్
- వారం రోజుల్లో అన్ని వివరాలివ్వండి
- అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

**విజయనగరం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు స్థలం వివాదంపై విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విజయనగరం మున్సిపల్ పరిధిలోని మహారాజుపేట సౌత్ వార్డులో టౌన్ >>2

- ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయాల కళారూపాలు
- 770 మంది కళాకారులకు శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ
- శిక్షణతో పాటు టూల్ కిట్లు అందజేస్తాం: మంత్రి సవిత
- ఆదాయం, ఉపాధే లక్ష్యంగా



## హస్త కళాకారులకు శిక్షణ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ >>2



పోలీస్ స్పోర్ట్స్ అకాడెమీ ఏర్పాటు లోగోను ఆవిష్కరిస్తున్న డిజిపి హరీష్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు

3లో

## పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడెమీ

- స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం విట్‌తో ఎంఒయు
- పోలీసు క్రీడా సంబరాల సభలో డిజిపి వెల్లడి

## పుర'పోర్టు'కు సిద్ధం

- వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల
- ఇప్పటి వరకు 11 అభ్యంతరాలు స్వీకరణ
- 13న డీలిమిటేషన్ వార్డుల ప్రకటన
- 14న తుది జాబితా గెజిట్‌లో ప్రచురణ
- పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ
- 2011 జనాభా లెక్కల ఆధారంగానే స్పష్టీకరణ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనకు పురపాలక శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. నేడే ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలిచ్చింది. ఈనెల 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు స్వీకరించి, 13న డీలిమిటేషన్ వార్డులను ప్రకటించి, 14న ఎపి గెజిట్‌లో ప్రచురించనున్నారు. జివిఎంసి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లకు ఆదేశాలందాయి. రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రక్రియ ద్వారా జనాభా పెంపుదల ఉంటుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలను పంపాల్సిందిగా కార్పొరేషన్లకు పురపాలకశాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై గురువారం రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, పిటిషన్లను డిస్మిస్ చేసింది. ఆ తర్వాత పురపాలకశాఖ తన కార్యాచరణను వేగవంతం చేసింది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపాల్సిందిగా కార్పొరేషన్లకు పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదనలపై రేపటి నుంచి ఈనెల 11 వరకు 7 రోజుల పాటు అభ్యంతరాలు, సూచనల స్వీకరించనున్నట్లు




పురపాలకశాఖ పేర్కొంది. వీటి పరిశీలన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి వచ్చే తుది ప్రతిపాదనలను ఈనెల 12న పురపాలక శాఖ డైరెక్టరేట్‌కు సమర్పిస్తారు. ఈనెల 13న డీలిమిటేషన్ వార్డుల ప్రకటనకు డైరెక్టర్ పరిశీలన తర్వాత ఆమోదం తెలపనున్నారు. ఈనెల 14న ఎపి గెజిట్‌లో వార్డుల డీలిమిటేషన్ ప్రకటన వెలువడనుంది. 2011జనాభా లెక్కల ఆధారంగా వార్డుల నిర్ణయముంటుంది. ఈమేరకు జీవీఎంసీ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు కార్పొరేషన్లకు పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మున్సిపల్ డైరెక్టరేట్ ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని, హైకోర్టు సూచనలను కూడా ఈ ప్రక్రియలో పాటించాలని వివరించింది.



శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన చిత్రం

# హస్త కళాకారులకు శిక్షణ

>> సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతి గాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గురుశిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురుశిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

**200మందికి శిక్షణతోపాటు పనిముట్లు:** డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురుచెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకువెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గిరాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవ్డ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

**కళాకారుల ఆదాయం పెంపే లక్ష్యం:** ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

# నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలతో సిఎం చంద్రబాబు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో భేటీ కానున్నారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటుతో పాటు పీఆర్సీ, డిఎ బకాయిలు తదితర సమస్యలపై చర్చించనున్నారు. గురువారం జెఏసి నేతలు ఎ.విద్యాసాగర్, డివి రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సిఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఆందోళనలకు సంబంధించిన అంశాలను విద్యాసాగర్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సిఎం ఈ సందర్భంగా వారికి చెప్పారు. పరిష్కారంపై చర్చిస్తున్నాం. ఎందుకు తొందర పడుతున్నారని చంద్రబాబు జెఏసి నేతలను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందని, ఒక్కొక్కటిగా చేస్తున్నామని చెప్పినట్లు సమాచారం. చర్చలు జరుగుతున్న సమయంలో ఒక్క పట్టలేకపోవటాన్ని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము కూడా చర్చలను ఆహ్వానిస్తున్నామని జెఏసి నాయకులు చెప్పారు. ముఖ్యమంత్రి స్థాయిలో చర్చలు జరగాలని కోరుకుంటున్నామన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

## కనులపండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం నాడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. రెండు విడతలుగా ఆర్జిత సేవ మరియు ఉచిత వ్రతాల నిర్వహణ జరిగాయి. 600 మందికి పైగా మహిళలకు ఉచిత అవకాశంపూజా సామగ్రి, తీర్థప్రసాదాలు దేవస్థానం వారు అందించారు. ఉచిత దర్శన ఏర్పాట్లపై భక్తుల హర్షం వ్యక్తం చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున మహా మండపంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు మొదటి విడత ఆర్జిత సేవ రూపంలో, అనంతరం ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు రెండవ విడత ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. వ్రతంలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే ఉచితంగా సమకూర్చింది. వ్రతం ముగిసిన అనంతరం పసుపుకుంకుమలు, రవికె వస్త్రం, గాజులు, శ్రీ అమ్మవారి ప్రసాదాలను అందజేయడంతో పాటు ప్రత్యేక క్యూ లైన్ ద్వారా శ్రీ దుర్గమ్మ ఉచిత దర్శన భాగ్యాన్ని కల్పించారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ సతీమణి అంజలి సామాన్య మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఇఓ వి.కె. శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మహామండపంలో నెలకొని వున్న వరలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో శ్రీ వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ ధనిక, పేద అనే తేడా లేకుండా భక్తులందరికీ అమ్మవారి దివ్య సేవలో భాగస్వామ్యం కల్పించాలనే సమున్నత లక్ష్యంతో మొదటి విడత ఆర్జిత సేవగా, రెండో విడతలో 600 మందికి పైగా మహిళలకు ఉచితంగా సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించామని తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ ధర్మ ప్రచారానికి, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి"అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు వి.శ్రీధర్ శర్మ, ఫెస్టివల్ సహాయ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె. గంగాధర్, పర్యవేక్షకులు హేమ దుర్గాంబ , సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మకు స్వర్ణాభరణాలు:** శ్రీ కనకదుర్గమ్మ వారికి స్వర్ణాభరణాలను విజయవాడకి చెందిన భక్తురాలు గుంటుపల్లి శ్రీ ప్రణవి శుక్రవారం శ్రీ అమ్మవారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం సుమారు 22.800 గ్రాముల బంగారు ఆభరణాలను చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు. బంగారు బొట్టు (నవరత్నాలు, డైమండ్స్ పొదిగినది), బంగారు నత్తు (డైమండ్స్, ఎరుపు పచ్చ రాళ్లు పొదిగినది), బంగారు బు లాకి (డైమండ్స్, ఎరుపు పచ్చ రాళ్లు, ముత్యం పొదిగినది). అనంతరం దాతకు శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు మరియు శేషవస్త్రాలను బహుకరించారు.

**ఇంద్రకీలాద్రిపై ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఆశీర్వచన మండపంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్న రాజగోపురం వద్ద శాస్త్రోక్తంగా గోపూజను ఇఓ వికె శీనా నాయక్ నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు,పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ స్థానాచార్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు బి. శంకర శాండిల్య, డిఇఓ కిషోర్ కుమార్, ఎఇఓలు ఎన్. రమేష్ బాబు, డా కె. గంగాధర్ పాలకమండలి సభ్యులు పి.రాఘవరాజు, ఎ శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు, తదితరులు పాల్గొన్నారు.



# నిశ్శబ్ద కల్లోలం

>> భారతదేశ జనాభాలో దాదాపు 80శాతానికి పైగా ప్రజలు విపరీతమైన ఎండలు, అనూహ్య వరదలు, కరువులు, తుఫానుల వంటి వాతావరణ ఆధారిత విపత్తులు పొంచి ఉన్న జిల్లాల్లోనే నివసిస్తున్నారు. 2026 నాటి తాజా పరిశోధనల ప్రకారం, 1981 నుంచి 2020 మధ్యకాలంలో భారతదేశ సగటు వేసవి గరిష్ఠ ఉష్ణోగ్రత సుమారు ఒక డిగ్రీ సెంటిగ్రేడ్ మేర పెరిగింది. హీట్‌వేవ్‌ల సంఖ్య, వాటి తీవ్రత, అవి కొనసాగే సమయం విపరీతంగా పెరిగిపోయాయి. మానవ శరీరం తనంతట తానుగా చల్లబరుచుకోలేని అత్యంత ప్రమాదకరమైన ఉక్కపోత పరిస్థితి ఇప్పుడు దేశమంతటా వ్యాపిస్తోందని మరో నివేదిక వెల్లడించింది. ఇది కేవలం ఎండకాలానికే పరిమితం కాకుండా, వర్షాకాలంలోనూ మానవ సామర్థ్యాన్ని, ఆరోగ్యాన్ని నిర్దాక్షిణ్యంగా దెబ్బ తీస్తోంది. ఉష్ణోగ్రత పెరుగుదల నేరుగా ఆహార, నీటి భద్రతలను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల పెరుగుదల కారణంగా సంభవించే వాతావరణ మార్పులు ఎల్‌నినో ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని ఇటీవలి పరిశోధనలు స్పష్టం చేశాయి. ఎల్ నినో ప్రభావం భారత రుతుపవనాలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి వర్షపాతాన్ని అస్తవ్యస్తం చేయడం ద్వారా కరువు ముప్పును మరింత పెంచుతోంది. మరోవైపు దేశ జీవనదులైన సింధు, గంగా, బ్రహ్మపుత్ర వంటి నదుల మనుగడ హిందూకుష్ హిమాలయాలపై ఆధారపడి ఉంది.

అయితే, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మోంటైన్ డెవలప్‌మెంట్ 2026 ప్రారంభంలో విడుదల చేసిన డేటా అత్యంత భయానకమైన వాస్తవాన్ని వెల్లడించింది. 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు కరిగిపోయే వేగం రెట్టింపు అయింది. ఈ ఆకస్మిక కరుగుదల నదీ లోయల్లో ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి దారితీయడమే కాక, భవిష్యత్తులో కోట్ల మంది ప్రజలను తీవ్రనీటి ఎద్దడిలోకి నెట్టే ప్రమాదం ఉంది. ఈ విపత్తుల వెనుక అభివృద్ధి చెందిన దేశాల అన్యాయం స్పష్టంగా దాగి ఉంది. ఇటీవల పొరుగు దేశమైన నేపాల్‌లో వాతావరణ విలయాల కారణంగా వెయ్యిమందికి పైగా అమాయకుల ప్రాణాలు కోల్పోవడమే దీనికి నిదర్శనం. ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో నేపాల్ వంటి దేశాల పాత్ర నామమాత్రమే. కానీ, అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు దశాబ్దాలుగా సాగించిన పారిశ్రామిక విధ్వంసానికి మూల్యం మాత్రం ఏ పాపం ఎరుగని గ్లోబల్ సౌత్ దేశాలే చెల్లించాల్సి వస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు ఉద్గారాల తగ్గించడంతో పాటు నష్టపరిహారం, వాతావరణ ఆర్థిక సహాయం తప్పనిసరిగా చేయాలని బ్రెజిల్‌లో జరిగిన సిఒపి 30 సదస్సులో భారత్ డిమాండ్ చేసింది.

ఈ నేపథ్యంలో, ఈ యేడాది నవంబర్‌లో టర్కీలో జరగనున్న సిఒపి31 సదస్సు కీలకంగా మారింది. ప్రకృతి విసురుతున్న ఈ సవాలును తీరిగ్గా కూర్చుని సరిదిద్దుకునేంత సమయం లేదు. ఒకటిన్నర డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగితేనే, ఈస్థాయిలో ప్రభావం ఉంటుందని అర్థమైనప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. ఉష్ణోగ్రత పెరుగుదలలో నివారించగలిగే ప్రతి చిన్న అంకె కూడా భవిష్యత్తులో వేలాది ప్రాణాలను, కోట్ల ఎకరాల పంటలను,

# గోదావరి కాలుష్యమంతా ఆంధ్రా పేపర్స్‌దే

>> పన్ను కూడా చెల్లించలేదన్న విషయం మీకు గుర్తుందా? ప్రభుత్వంతో సంబంధం లేకుండా మీకు మీరే పన్ను మినహాయింపు ఇచ్చేసుకున్నారా? ఇది ఎలా సాధ్యం? రూ.21.34 కోట్ల వరకు మీరు స్థానిక సంస్థలకు పన్నులు చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించమని నోటీసులు ఇచ్చిన ప్రతిసారీ కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తూ మీ బాధ్యత నుంచి తప్పించుకు తిరుగుతున్నార్లు అని మండిపడ్డారు. "రాజమహేంద్రవరం నగర కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్ నుంచే వస్తుందని అధికారిక గణాంకాలు సైతం చెబుతున్నాయి. రాజమహేంద్రవరం నగరం మొత్తం దాదాపు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే, అందులో సుమారు 35 మిలియన్ లీటర్లు మీరు ఉత్పత్తి చేస్తున్నారు. మీరు విడుదల చేస్తున్న వ్యర్థాల్లో పరిమితికి మించి కాలుష్య కారకాలు ఉన్నట్టు నిర్ధారణ కూడా అయ్యింది. మీరు వ్యర్థాలు విడుదల చేసే లగూన్స్ దగ్గర సేకరించిన నమూనాలను పరీక్షించగా, లీటర్ నీటికి 36 మిల్లీగ్రాముల బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బిఒడి) ఉంది. ఇది నిర్ణీత ప్రమాణాల కంటే 20 శాతం అధికం. ఫాస్ఫేట్ 5.3 మిల్లీగ్రాములు 6 శాతం అధికంగా ఉంది. సల్ఫైడ్స్ 3.4 మిల్లీగ్రాములు ఉన్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలతో పోలిస్తే.. ఇది 70 శాతం అధికం. మీరు విడుదల చేసే కాలుష్యం కారణంగా నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గి జలచరాల మనుగడకు ఇబ్బంది కలుగుతుంది. గోదావరి నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోంది. దుర్గంధాలు వెదజల్లుతూ, నీటి నాణ్యత తగ్గి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ, భవిష్యత్ మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంద్లి అని డి.సిఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. "భూగర్భ జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి పర్యటనలో పలు సూచనలు చేశాను. వాటిని కూడా మీరు పాటించలేదు.

మీ ఉల్లంఘనలకు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు లోబడి కఠిన చర్యలు తీసుకోవచ్చు. పరిశ్రమలో కార్యకలాపాలు నిలుపుదల చేయొచ్చు. పెనాల్టీలు విధించవచ్చు. కంపెనీని సీజ్ చేయొచ్చు. ఏకంగా లైసెన్స్ రద్దు చేయొచ్చు. అయినప్పటికీ పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందస్తు హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చి.. తప్పుని సరిదిద్దుకునే అవకాశం ఇచ్చింది. గడచిన మూడు నెలల కాలంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మీ ప్రతినిధులతో పలు మార్లు చర్చించి, పరిష్కార మార్గాలు సూచించారు. అయితే మీ నుంచి స్పందన పూర్తిగా కొరవడింద్లి అని డి.సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్‌కి సమన్స్ జారీ చేసి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్‌తో పాటు ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిళ్లు ఇటువంటి ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. "స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల్లు థీమ్‌తో మన గోదావరి నదిని కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణ వేత్తలు, పౌర సమాజం నుంచి మద్దతు కోరుతున్నామని పేర్కొన్నారు.ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతాంశంగా ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు.

# విద్యుదుత్పత్తి ఆపండి



శుక్రవారం కెఆర్ఎంబి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న నరసింహా మూర్తి

>> విద్యుత్ ఉత్పత్తికి వాడటం తగదని ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి నరసింహామూర్తి అభ్యంతరం వ్యక్తంచేశారు. తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డి పాడునుంచి ఆంధ్రప్రదేశ్ నిబంధనలకు విరుద్ధంగా నీటిని బేసిన్ దాటిపోయేలా తరలిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఉందని ఉన్న నీటిని 50శాతంచొప్పున చెరిసగం పంచుకోవాలని తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు కెఆర్ఎంబి ముందు ప్రతిపాదన పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున నరసింహామూర్తి మాట్లాడుతూ 66;34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కృష్ణా నదిలోని రిజర్వాయర్లలో 142 టిఎంసిలు ఉన్నాయని ఇఎన్‌సి రమేష్ బాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సిమాత్రం ఖరాఖండిగా 66:34శాతం వాటా ప్రకారం 97 టిఎంసిలు విడదల చేయాలని కోరారు.

సభ్యుడు నరసింహామూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశం ఏకాభిప్రాయం కుదరక అసంతప్తితో ముగిసిందని వ్యాఖ్యానించారు. కృష్ణా నదిలో లభ్యమయేయ్య నీరు 66:34 నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టిఎంసిలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టిఎంసిలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని అన్నారు. తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు. రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు. తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డితోపాటు వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకొని పోతున్నారని మొత్తం తెలంగాణకు 200 టిఎంసిలు, ఎపికి 100 టిఎంసిలు ఇవ్వాలని కోరారు. ఇదిఇలా ఉంటే విద్యుత్ ఉత్పత్తికి కృష్ణా నదినీటిని వాడొద్దని కెఆర్ఎంబి తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని 11వ షెడ్యూల్ లో 2, 3 పేరాలను అనుసరించి నీటి వినియోగం ఉండాలనీ తెలంగాణను కెఆర్ఎంబి ఆదేశించింది. సాగు నీరు, త్రాగునీరు, విద్యుత్ ఉత్పత్తి వంటి ప్రాధాన్యత అంశాలు విపత్తు పరిస్థితులు వస్తే, త్రాగు నీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ కెఆర్ఎంబి తెలిపింది. తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి నీటిని వినియోగించడం వెంటనే నిలిపి వేయాలని కెఆర్ఎంబి హెచ్చరించింది. త్రాగు నీటి అవసరాలకే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నీటిని వినియోగించాలి. తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి శ్రీశైలం నీటిని వినియోగించడం పై అభ్యంతరం వ్యక్తం చేసింది.


కేరళలో మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు అందుకుంటున్న మంత్రి నారా లోకేశ్

# అమృతపురి ఆశ్రమంలో మంత్రి లోకేశ్

## మాతా అమృతానందమయి దేవితో భేటీ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కేరళం రాష్ట్రం కొల్లం జిల్లాలోని ప్రసిద్ధ అమృతపురి ఆశ్రమాన్ని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సందర్శించారు. ముందుగా అమృతపురి ఆశ్రమానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలోని కాళీ దేవాలయాన్ని, కలరిని మంత్రి సందర్శించారు. అనంతరం మాతా అమృతానందమయి దేవితో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు పొందారు. ఆధ్యాత్మిక, తాత్వికరంగాల్లో మంత్రి ఆసక్తి కలిగి ఉండటం పట్ల అమృతానందమయి దేవి సంతోషం వ్యక్తం చేసారు. విశ్వవిద్యాలయాల వ్యవస్థాపన, నిర్వహణ విషయంలో ఆయన అందిస్తున్న సహకారానికి మంత్రిని అభ్యర్థించారు. అమరావతి అంతర్జాతీయంగా ఖ్యాతిని పొందుతుందని తెలిపారు. అనంతరం అమృత విశ్వవిద్యాపీఠం క్యాంపస్‌ను, అమృత ఆయుర్వేద కళాశాలను మంత్రి సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు ఆశ్రమంలో గడిపారు.

# గ'ఘన'విజయం

>>దశకు మధ్యలోనే శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం విడిపోయాయి. 40 టన్నుల ద్రవైందన సహాయంతో రెండో దశను 293.08సెకండ్లలో అధికమించింది. స్వదేశీ సాంకేతికతో రూపొందించిన 15 టన్నుల క్రయోజనిక్ సహాయంతో 1106.60 సెకండ్లలో మూడవ దశను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన 19 నిమిషాల గమన సమయంలో 28934 ఎత్తులోనీ జియో ట్రాన్స్ ఫర్ ఆర్బిట్‌లోకి చేరుకుంది.అనంతరం భూభాగంలోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ల వారు ఉపగ్రహాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని 36,000కిలోమీటర్ల ఎత్తులోని కక్షలోకి ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టారు. కక్షలోకిచేరిన ఇఓఎస్ 05ఉపగ్రహం మాస్టర్ కంట్రోల్ సెంటర్‌కు సంకేతాలు ఇవ్వడం ప్రారంభించింది.

**ఈ యేడాదిలో ఆరు ప్రయోగాలు:** జిఎస్ఎల్‌వి ఎఫ్ 17 విజయం చారిత్రాత్మకమైనదని, ఈ విజయంలో ఇస్రోలోని ప్రతి ఒక్కరి సమిష్టి కృషి ఉందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ అన్నారు. ప్రయోగ విజయానంతరం శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ద్వారా భారతదేశానికి అత్యంత ఉపయోగకరమైన ఇఓఎస్ 05 రాకెట్‌ను నిర్దేశించిన కక్షలోకి పంప గలిగామన్నారు. జిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ప్రథమంగా అధిక బరువు గల ఉపగ్రహాన్ని గగనతలంలోకి తీసుకువెళ్లిందని తెలిపారు. 36 వేల కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపగ్రహం చేరుకొని పనిచేయడం ప్రారంభించిందని, ఇస్రో ఆధ్వర్యంలో ఇంత ఎత్తులో ప్రవేశ పెట్టడం ప్రథమమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ ప్రయోగం విజయవంతం అయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేటు సెక్టార్‌కు సంబంధించి విక్రమ్ వన్ రాకెట్ విజయం సాధించిందని తెలిపారు. ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రోకు మంచి రోజులు వచ్చాయని, ఇదే విజయ పరంపరను కొనసాగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తల బృందం నిరంతరం శ్రమిస్తామని నారాయణన్ తెలిపారు. ఈ యేడాదిలో మరో ఆరు ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇందులో గగన్‌యాన్ సంబంధించి మానవ రహిత ఉపగ్రహం ప్రయోగం, ఎన్‌వి ఎస్03 నావిగేషన్ శాటిలైట్ ప్రయోగం ఉంటాయని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఈప్రయోగ విజయం ఇస్రో కుటుంబానికి స్ఫూర్తినిచ్చిందని ఆయన చెప్పారు. తమిళనాడులోని కులశేఖర పట్టణంలోని లాంచ్ ప్యాడ్‌లో ఇస్రో, ప్రైవేట్ సంస్థలకు చెందిన రాకెట్ ప్రయోగాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణం కీలక దశలో ఉందని నారాయణన్ తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తల బృందంతో కలిసి పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ నమూనాను చేత పట్టుకొని విజయోత్సవం జరుపుకున్నారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ముత్తు చెళియన్, ఐపిఆర్‌సి డైరెక్టర్ నారాయణ అప్పు, ఇస్రాక్ డైరెక్టర్ ఎంఆర్ రాఘవేంద్ర, మాస్టర్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ పంకజ్ దామోదర్ కిల్‌డార్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ డాక్టర్ రాజీవ్, యుఆర్ ఎస్సీ డైరెక్టర్ దినేష్ కుమార్ సింగ్, మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్, డాక్టర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

>> చర్చించనున్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఆరోగ్యం, విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్లతో సిఎం చంద్రబాబు చర్చించనున్నారు. పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడనున్నారు. జలధార కార్యక్రమం పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ల ఉత్తమ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రదర్శన, వివరణ ఇవ్వనున్నారు. రెండో రోజు ఈగవర్నెన్స్, ఆర్టీజీఎస్. పిజిఆర్ఎస్ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. భూ పరిపాలన, కేంద్ర పథకాల నిధుల వినియోగంపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరంలో క్షేత్రస్థాయి సమస్యలపై మాట్లాడనున్నారు. చివరి రోజు శాంతిభద్రతల సమీక్షతో పాటు ముగింపు ప్రసంగాన్ని సిఎం చంద్రబాబు చేయనున్నారు.

# ఆ స్థల వివాదం తేల్చండి

>> సర్వేనెంబర్ 569లో 4 ఎకరాల 74 సెంట్లలో ఎకరాస్థలంలో వైసిపి కార్యాలయాన్ని నిర్మించింది. ఈ వ్యవహారాన్ని అశోక్ గజపతి రాజు వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తన స్థలంలో అక్రమంగా వైసిపి కార్యాలయ నిర్మాణం చేపట్టారంటూ గతఏడాది విజయ నగరం కలెక్టర్‌కు ఆధారాలు సమర్పించారు.సదరు ఆధారాలను పరిశీలించిన కూటమి ప్రభు త్వం విచారణకుఆదేశించింది.అప్పటి ఎమ్మార్వో ప్రభాకర్‌రావుపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వారం రోజులలోపు ఆ వివరాలు అన్నీ ఇవ్వాలని జిల్లాఉన్నతాధికారులనుప్రభుత్వం ఆదేశించింది.

## నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 173 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాశాఖ గుర్తించి జాబితాను విడుదల చేసింది.వీరందరికి ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరికి అవార్డులు ప్రదానం చేయనుంది. విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వీరికి అవార్డులు అందజేస్తారు. పాఠశాల విద్యలో 79 మంది, ఇంటర్ విద్యలో 24మంది, సాంకేతిక విద్యలో 14 మంది, ఉన్నత విద్యలో 56 మందిని ఉత్తమ టీచర్లుగా ప్రభుత్వంఎంపికచేసింది. వీరికి ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి అందజేస్తారు.

## వారం - వర్జ్యం

05-09-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.నవమి రా.9.53,న.మృగశిర రా.9.30
వ.తె.5.20 - ఉ.6.49
దు.తె.5.54 - ఉ.7.32
రాహు.ఉ.9.00-ఉ.10.30
శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** ఇంటా బయటా ఎదురైన ఒత్తిడులు తొలగుతాయి. గృహనిర్మాణ ఆలోచనల్లో తొందరపాటు వద్దు.అదనపు బాధ్యతలు.

**వృషభం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. వివాహానికి అనుకూలమైన కాలం.

**మిథునం :** వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. జీవితభాగస్వామినుండి వస్తు, వస్త్రలాభాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం.

**కర్కాటకం :** ఋణాలు కొంతవరకు తీరుస్తారు. వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**సింహం :** నూతన ఉత్సాహంతో కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో ఆదరణ పెరుగుతుంది.

**కన్య :** ఆర్థిక ఇబ్బందులు అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. శ్రమ ఫలిస్తుంది.

**తుల :** సోదరుల నుండి ఆస్తి, లాభం పొందుతారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** భూ వివాదాలు పరిష్కరించుకొంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

**మకరం :** వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది.ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మీనం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

5-9pg3exHMNWJQERP:5-9pg3exHMNWJQERP.qxd 9/5/2026 12:02 AM Page 1



# చెరువులకు కొత్త కళ

## సాగునీటి సంరక్షణ.. పర్యావరణ పరిరక్షణ లక్ష్యం

- రూ.50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- 26 చెరువులకు పునరుజ్జీవం. భూగర్భ జలాల పెంపు
- ఆధునిక హంగులతో ఆహ్లాదకర కేంద్రాలుగా చెరువులు
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, పార్కులతో కొత్త రూపు



**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** సాగునీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రి చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన్ణ పథకం తోడవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. పవన్ కల్యాణ్ దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి.

### 105 చెరువులు... రూ.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం రూ.50 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 26 చెరువులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అనంతపురం, పల్నాడు, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఇప్పటికే చెరువుల అభివృద్ధి పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి.

### చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలు

చెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

### సాగు నీటితోపాటు భూగర్భ జలాలకు బలం

ఈ పనుల ద్వారా చెరువులు కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితం కాకుండా బహుళ ప్రయోజన కేంద్రాలుగా రూపుదిద్దుకోనున్నాయి. చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల సాగునీటి వనరులు బలోపేతం కావడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులకు సాగునీటి పరంగా ప్రయోజనం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలికంగా మెరుగైన ఫలితాలు అందనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ కార్యక్రమం దోహదపడనుంది.




చెరువుకట్టపై పిల్లల పార్కు, జిమ్

### నాణ్యతపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి

అభివృద్ధి పనుల వేగంతో పాటు వాటి నాణ్యతపై కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, ప్రతి పని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగుతున్నాయో లేదో పరిశీలిస్తున్నారు. పనులను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం, నాణ్యత రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సాగు నీరు, పర్యావరణం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దార్శనికత ఈ చెరువుల ఆధునీకరణ కార్యక్రమంలో ప్రతిబింబిస్తోంది.

# ప్రజల తలసరి ఆదాయం పెరిగితే పేదల సంపద వృద్ధి

## అన్నిరంగాల్లో రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వానికి కీలకం: సిఎం చంద్రబాబు



**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల తలసరి ఆదాయం పెరిగితే పేదల సంపద దానంతటదే వృద్ధి చెందుతుందని సిఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో ప్రజల ప్రస్తుతం తలసరి ఆదాయం రూ.3 లక్షలుగా ఉందని, 2047 నాటికి దానిని రూ.54 లక్షలకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. ఆ దిశలోనే ప్రభుత్వం కార్యచరణను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు తన అధికారిక 'ఎక్స్' ఖాతాల్లో పలు అంశాలు వెల్లడించారు. సంపద వృద్ధి చెందాలంటే ఆదాయం వృద్ధి కావాలన్నారు. ఇందుకు తగినట్లు ప్రభుత్వవిధానం ఉందన్నారు.ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు పిపిపి విధానాన్ని అమలులోకి తీసుకుని వచ్చామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని, ఆ రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై ప్రజావసరాలను విస్మరించిందన్నారు. బటన్లు నొక్కి రోడ్లకు గుంతలు పెట్టారన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తపన, అనుభవంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో దూసుకెళ్తోందని సిఎం అన్నారు. 45యేళ్లుగా వెనుకబడిన వర్గాలు టిడిపికి అండగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే ప్రజలు తమ సలహాలు, సూచనలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించానని, దానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తున్నామని, కొండలు, గుట్టలు తొలిచి మరీ నీటిని తరలిస్తామన్నారు. నదుల అనుసంధానంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఏమాత్రం రావని భరోసా ఇచ్చారు. వైఎస్సార్సీపీ పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. తాము ఏ మంచి పని చేసినా వైఎస్సార్సీపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మెగా డిఎస్సీ వేస్తుంటే దాన్ని అడ్డుకునేందుకు కోర్టులో ఏకంగా 350 కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, మీ పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో అవసరం లేదని తేల్చి చెప్పారు. ఆడబిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బంది పడకూడదని ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చామని సీఎం చెప్పారు. రాబోయే రోజుల్లో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళలకు కష్టం రాకూడదనే ఉద్దేశంతో దీపంపథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 33శాతం రిజర్వేషన్లు తెచ్చామన్నారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తానే తీసుకువచ్చానని, త్వరలో మహిళా డ్రైవర్లను కూడా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. 'సంజీవన్ని యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సిఎం చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గిరిజనుల ఆరోగ్యం వారి ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా వారు ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామన్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడటమే ప్రభుత్వానికి కీలకం అని సిఎం చంద్రబాబు వివరించారు.

# చెట్టుకు కారు ఢీ: అన్నదమ్ములు మృతి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం మండలం, లక్కవరం శివారు, ఓఎన్జిసి సైట్ దగ్గర్లో జరిగిన ప్రమాదం లో ఇరువురు అన్నదమ్ములు అక్కడిక్కడే అసువులు బాయగా తోటి కోడళ్ళు ఆసుపత్రి లో చికిత్స పొందు తున్నారు. లక్కవరం గ్రామానికి చెందిన, ముదునూరి రామభద్ర రాజు (రాంబాబు రాజు), అతని తమ్ముడు ముదునూరి వెంకట సుబ్బరాజు లు వారి భార్యలతో కలసి, బంధువుల ఇంటికి వెళ్లి భీమవరం నుండి తిరిగి లక్కవరం గ్రామం వారి కారులో వస్తుండగా, లక్కవరం ఓఎన్జిసి సైట్ దగ్గరకు వచ్చేసరికి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్లను బలంగా ఢీకొట్టారు. కారు పూర్తిగా డ్యామేజ్ అయ్యి, డ్రైవింగ్ చేస్తున్న ముదునూరి రామభద్ర రాజు, తమ్ముడైన ముదునూరు వెంకట సుబ్బరాజు అక్కడికక్కడే మృతి చెందారు. తోటికోడళ్ళు ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తులు ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


## నార్త్ కొరియాలో ప్రమాదం: బాపట్ల జిల్లా వాసి మృతి



**చీరాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** నార్త్‌కొరియాలో జరిగిన ఫ్యాక్టరీ ప్రమాదం లో బాపట్ల జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సందెపూడి సాల్మన్ రాజు (35) ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. సుమారు నెల రోజుల క్రితం ఆయన పనిచేస్తున్న ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు ఘటన చోటుచేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గత సోమవారం ప్రాణాలు విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాల్మన్‌రాజు మృతి వార్త తెలియడంతో చెరుకూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నట్లు సమాచారం.మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. శనివారం సాల్మన్ రాజు మృతదేహం చెరుకూరు గ్రామానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఇచ్ఛాపురంలో పోర్టు

- రెండు వేల ఎకరాల భూముల్లో నిర్మాణానికి ప్రతిపాదనలు
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి భూమిపూజ



**ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పోర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తీర ప్రాంతంలో ఉపభూముల్లో పోర్టు నిర్మాణ ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు, కోల్ ఇండియా సౌజన్యంతో సూడా ఆధ్వర్యంలో రూ.2.29కోట్లతో సురంగి రాజావారి మైదానంలో నిర్మిస్తున్న బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఇండోర్ స్టేడియం) నిర్మాణానికి భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఇక్కడి తీర ప్రాంతంలో 2 వేల ఎకరాల్లో పోర్టు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి కార్యాచరణ మొదలెట్టినట్టు తెలిపారు. పోర్టు నిర్మాణం ద్వారా పెద్ద ఎత్తున అనుబంధ పరిశ్రమలు, సంస్థలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణంలో మరో రైల్వే వంతెన నిర్మాణానికి కూడా సన్నాహాలు మొదలు పెట్టినట్టు ప్రకటించారు. అలైన్మెంట్ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రూపొందించనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజోపయోగ పనులకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అరాచకం, దౌర్జన్యం, దాడులతో కొనసాగిందని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రస్థాయిలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. గతంలోనూ ఇప్పుడూ చంద్రబాబు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజావారి మైదానంలో అన్ని వసతులతో బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందువరుసలో నిలబెడతామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రోడ్డు సదుపాయం లేని కంచిలి మండలంలో గిరిజన గ్రామాలకు రహదారులు వేసిన విషయాన్ని ప్రకటించారు.

ఇచ్ఛాపురం మున్సిపాల్టీని రైల్వేట్రాక్ రెండుగా విభజించటం వల్ల దశాబ్దాలుగా ఉన్న రాకపోకల సమస్యలు పరిష్కారంగా రెండు ఆర్ ఓబీలు శంకుస్థాపన చేశామన్నారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకం క్రింద రీమోడల్ చేస్తున్నామని, దీంతో పాటు కొత్త రైళ్ల హాల్ట్‌లు కూడా తీసుకొచ్చామన్నారు. రైల్వేజోన్ మార్పు చారిత్రాత్మకమైన నిర్ణయమని గతంలో పలాసా నుండి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 స్టేషన్లను ఈస్ట్ కోస్ట్ జోన్ ఖుర్దా డివిజన్‌లో ఉండటం వల్ల చిన్న పనికి కూడా భువనేశ్వర్ వెళ్లాల్సి వచ్చిందని కూటమి ప్రభుత్వం కృషితో విశాఖపట్నం జోన్ మంజూరై 7 స్టేషన్లు విశాఖ డివిజన్‌లో కలిపారన్నారు. ఇకపై రైల్వే సమస్యలపై నేరుగా డిఆర్ఎంకు కలిసే అవకాశం దొరికిందన్నారు. ఏళ్ల తరబడి రోడ్లు లేని ఇంటీరియల్ గ్రామాలకు కూడా రూ.6లక్షలతో బిటి రోడ్డు, రూ.45 లక్షలతో సిసి రోడ్డు పనులు చేపట్టామన్నారు. గత 5 ఏళ్లుగా నిలిచిపోయిన ఇచ్ఛాపురం కెవికె రూ.2.40కోట్లుతో శంకుస్థాపన చేశామని అన్నారు. ఇందులో 3 కోర్టులు బ్యాడ్మింటన్, జిమ్, అథ్లెటిక్ ట్రాక్, ఆకింగ్ ట్రాక్ ఉంటాయని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడల్లా క్రీడలకు పెద్దపేట వేసేవారని స్టేడియంలు నిర్మించి క్రీడాకారులను తయారు చేసి ఒలింపిక్ స్థాయిలో మెడల్స్ సాధించేలా బాట వేసారన్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీలోని 7 నియోజకవర్గాలలోనూ కేవీకేలు మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో స్టేడియంలు నిర్మించటమే విజన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం కే.రామారావు, సీనియర్ డిసిఎం పవన్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జనసేన నాయకులు దాసరి రాజు, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, జడ్‌ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస్ రౌలో, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎన్ కోటి, కాళ్ల దర్మారావు, కాళ్ల దిలీప్, లోపింటి పద్మనాభం, ఆశి లీలారాణి, జన్నెల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**రహదారులను ప్రారంభించిన కేంద్రమంత్రి:** కంచిలి మండలంలో ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ బాబుతో కలిసి పోలేరులో రూ.85 లక్షలతో పిఐయు నిధులతో తారు రోడ్లు ప్రారంభించారు. అలాగే కొండ పోలేరు గ్రామంలో రూ.75 లక్షలతో 750 మీటర్ల సిమెంట్ రహదారి ప్రారంభించారు. అనంతరం కొల్లూరు పంచాయతీ పరిధిలోగల గుండాం గ్రామంలో వైఎసఆర్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు మంత్రి సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పి ఆయా కుటుంబాలను, మంత్రి, విప్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రహదారులు పూర్తిగా పాడైపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి చిన్నాభిన్నంగా తయారైందని ప్రజలు ప్రయాణం సాగించాలంటే నరకయాతన అనుభవించారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో పరిపాలన సాగిస్తున్నారని అమరావతి పూర్తిస్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అలాగే పోలవరం ప్రాజెక్టు ఫేజ్ 2 నుండి గోదావరి జలాలను అనకాపల్లి వరకు అందించారని, రానున్న రోజుల్లో విశాఖపట్నం, విజయనగరం మీదుగా శ్రీకాకుళం జిల్లా వంశధార నదికి అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు తాగు సాగు నీరు అందించాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ దాసరి రాజు, కంచిలి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం:** అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కారణమంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి మండలం రాజపురంలో ఆర్.కృష్ణయ్య 20 లక్షలఎంపీ నిధులతో నిర్మించనున్న సామాజిక భవనానికి శంకుస్థాపనతో పాటు బైరిపురం గ్రామంలో బిఎసఎనఎల్ టవర్‌ను ఆయన స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సంయుక్తంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి రెండు కళ్ళు అంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడమీ

- పోలీసు క్రీడాకారులకు ప్రొఫెషనల్ శిక్షణ
- స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం విట్‌తో ఎంఒయు
- పోలీసు క్రీడా సంబరాల సభలో డిజిపి వెల్లడి




**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పోలీసు క్రీడాకారులను జాతీయస్థాయిలో తీర్చిదిద్దే లక్ష్యంతో 'ఏపి పోలీస్ స్పోర్ట్స్ అకాడమ్మీ ఏర్పాటు చేస్తున్నట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, ఆధునిక క్రీడా పరికరాలు, అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రొఫెషనల్ స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందులో భాగంగా విఐటి-ఎపి, అమరావతితో పోలీసుశాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎపి పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ లోగోను డిజిపి ఆవిష్కరించారు. మంగళగిరి ఎపిఎస్పీ 6వ బెటాలియన్‌లో శుక్రవారం జరిగిన తొలి ఎపి స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 ముగింపు కార్యక్రమంలో డిజిపి మాట్లాడారు. పోలీసుశాఖలో హోదాలు, పోస్టింగ్‌లు వేరైనా అందరూ ఒకే జట్టులోని సభ్యులేనని పేర్కొన్నారు. 'మనది ఎపి పోలీస్ టీమ్.. మనమంతా ఒకే కుటుంబం. సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగల్గం అని పిలుపునిచ్చారు. సమాజంతోపాటు నేరాల స్వరూపమూ వేగంగా మారుతోందని డిజిపి పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే కొత్త తరహా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీసులకు శారీరక, మానసిక దృఢత్వం అత్యంత అవసరమన్నారు. క్రీడలను ఉద్యోగ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర పోలీసు క్రీడాకారులు ఈ మీట్‌తోనే ఆగిపోకుండా ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభ చాటుతున్నారని, పోలీసుశాఖలోని మహిళా క్రీడాకారులు కూడా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా పూర్తి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ కమిటీ, విశ్వవిద్యాలయాలు, క్రీడా సంస్థలు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, స్పాన్సర్లను డిజిపి అభినందించారు. వచ్చే ఏడాది పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను మరింత విస్తృతంగా, మెరుగైన ప్రమాణాలతో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 15 రేంజ్‌ల నుంచి దాదాపు 1,900 మంది పోలీసు క్రీడాకారులు నాలుగు రోజులపాటు జరిగిన పోటీల్లో పాల్గొన్నారని డిజిపి తెలిపారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడం గర్వకారణ మన్నారు. పతకాలు సాధించిన వారిని అభినందిస్తూ.. విజయం సాధించని వారు నిరుత్సాహపడకుండా మరింత సాధనతో ముందుకు సాగాలని సూచించారు.

**విశాఖ రేంజ్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్:** నాలుగు రోజులపాటు హోరాహోరీగా సాగిన పోటీల్లో విశాఖ రేంజ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో ఐజిలు కె.వి.మోహన్‌రావు (స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్), ఆకే రవికృష్ణ (ఈగల్), బి.రాజకుమారి (వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ), సీహెచ్.శ్రీకాంత్ (టెక్నికల్ సర్వీసెస్ అండ్ ఆపరేషన్స్), సెంథిల్‌కుమార్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, డిఐజిలు అన్బురాజన్, వకుల్ జిందాల్‌తోపాటు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమెన్ ఎపిఎల్ షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 19న తొలి మ్యాచ్.. సెప్టెంబర్ 27న ఫైనల్
- మొత్తం 13 మ్యాచ్‌లు మంగళగిరి వేదికగా డే, నైట్ మ్యాచ్‌లు
- బ్రాండ్ అంబాసిడర్‌గా భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్




**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** మహిళల ఎ.పి. ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల షెడ్యూల్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఎ.సి.ఎ) శుక్రవారం విడుదల చేసింది. ప్రీమియర్ లీగ్ పోటీల వివరాలను ఎ.సి.ఎ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్ బాబు, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ దొడ్డపనేని కళ్యాణ్ కృష్ణ వెల్లడించారు. ఈ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్‌తో కలిపి మొత్తం 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. సెప్టెంబర్ 19న తొలి మ్యాచ్ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 27న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్‌కు ఏదైనా అంతరాయం కలిగితే ఒక రిజర్వ్ డే రోజున మ్యాచ్ నిర్వహిస్తారు. ఈప్రీమియర్ లీగ్‌లో నాలుగు జట్లు పోటీపడనున్నాయి. రాజధాని అమరావతిలో మంగళగిరి వేదికగా జరగనున్న ఈ పోటీల్లో డే, నైట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మహిళా క్రికెట్ అభిమానులు ప్రత్యక్షంగా మ్యాచ్‌లను వీక్షి ంచేలా మరోసారి ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. గతంలో లీగ్‌కు లభించిన ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఈసారి కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్రీడాకారిణులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు. మహిళా క్రికెట్ భారత మాజీ కెప్టెన్, ప్రముఖ క్రీడాకారిణి మిథాలీ రాజ్ ఈ ప్రీమియర్ లీగ్ పోటీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. మిథాలీ రాజ్ భాగస్వామ్యం ద్వారా మహిళా క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు నిర్వాహకులు కృషి

5-9pg4:5-9pg4.qxd 9/4/2026 11:59 PM Page 1



వార్త

క్రమశిక్షణ, సౌశీల్యం, అంతర్‌దృష్టి, మానవీయత, కరుణ మొదలైన గుణాలు లోపించిన నాయకుల చేతుల్లో రాజకీయాలు ఉండటం కంటే అసలు రాజకీయాలే లేకపోవడం ఎంతో మేలు.

న- రామ్ మనోహర్ లోహియా

# అవశేషమే విశేషం!

రైతు శరీరభాగాల్లో పురుగుమందుల అవశేషాలు కానవస్తున్నాయన్న అంశంపై ఇప్పుడు ఎల్లెడలా విస్తృత చర్చ నడుస్తోంది. తన పంట బాగుకు అధిక దిగుబడికి పంట పొలాల్లో పురుగు మందులు చల్లడం, తెగుళ్ల మందుల పిచికారీలు చేయని రైతు ఉండనే ఉండడు. పంట బాగా పండి తన పెరట్లో గాదులు నిండితే చాలునని రైతు సంతృప్తి పడతాడు. అందుకే వాళ్లు ఆరుగాలం, అహర్నిశలూ కష్టపడుతుంటారు. ప్రపంచరైతుల్లో సగం మంది శరీరంలో పురుగు మందుల అవశేషాలున్నాయన్న గణాంకాల కారణాలు ఏవైనా ప్రపంచానికే ఆహార భరోసానిస్తున్న రైతు శరీరమే విషజాలంగా మారితే అందుకు బాధ్యులెవరో అంత తేలికగా తేల్చి చెప్పే విషయం కానేకాదు. ఇలాంటి దురదృష్టకర ఉదంతాలు వెల్ల డైనప్పుడల్లా ప్రభుత్వాలు, రైతులు,పురుగుమందుల కంపెనీల్లోనూ సందిగ్ధతలు ఉదయిస్తాయి. కానీ మళ్లీ మళ్లీ షరామామూలే. ఇలాంటి ఉదంతాలు పునరావృతమవుతూనే ఉంటాయి. తన వ్యాపారం పెరుగుతుందని పురుగు మందుల తయారీ సంస్థ భావిస్తే రైతు మాత్రం మంచి దిగుబడే కోరుకుంటాడు. మధ్యేమార్గంగా ప్రభుత్వం ఆ ఇరుపక్షాల సంక్షేమం కోసం 'సాగు' ప్రణాళికలు రూపొందిస్తుంది. కానీ అవి వికటిస్తే రైతుగతి అధోగతే. హరిత విప్లవం పేరిట దేశంలో దిగుబడులు పెరిగాయి. ప్రపంచ దేశాల్లో ఆహార భద్రతకు మేమే అని చెప్పుకుంటున్నాము. కానీ రైతు ఆకాంక్షలు, పురుగుమందుల నుండి రైతుకు రక్షణ, సాగుకు సంరక్షణ వంటి అంశాలపై పూర్తిస్థాయి భద్రతా విధానాలను పాటించేలా అవగాహన కల్పించడంలో ప్రభుత్వం ఇంకా ఒక అడుగు వెనుకనే ఉంది. నిజానికి పంట విధానాలు ఎన్నున్నా పెస్టిసైడ్స్ వాడకంలో రైతు ఎక్కడో అక్కడ తప్పటడుగు వేస్తున్నాడని ప్రభుత్వాలు ఆరోపిస్తుంటాయి. వీటిలో ఎంత నిజం ఉన్నా లేకపోయినా రైతు ఆరోగ్యానికి చేటు తప్పడం లేదు. పురుగుమందుల వాడకంలో రైతును సరైనదారిలో పెట్టగల పథకాలేవీ ప్రభుత్వం వద్ద లేవు. శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతఅందుబాటులో ఉన్నా వాటిని సరైన దిశగా అమల్లో పెట్టే రైతాంగం లేదని అనుకోవడం కద్దు. పంటను కాపాడే మందు అయినా ఇప్పుడా పురుగు మందే రైతు ఆరోగ్యాన్ని దెబ్బతిస్తోంది. తాము వాడుతున్నది అసలు మందులా, నకిలీ మందులో జాడ తెలుసుకోలేక రైతు సందిగ్ధంలో పడిపోతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 93.4 కోట్ల మంది వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తుండగా వారిలో కనీసం సగం పైగా అంటే 40.2 కోట్ల నుంచి 43.3 కోట్ల మంది రైతుల వ్యవ సాయ కూలీల శరీరాల్లో పురుగు మందులకు సంబంధించిన విషపూరిత అవశేషాలను గుర్తించినట్లు 'పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ సంస్థ' తన నివేదికలో వెల్లడించింది. పురుగుల మందుల బారిన పడి యేటా ప్రపంచ వ్యాప్తంగా 11వేల మంది చనిపోతున్నారు. అందులో 60శాతంభారత్‌లోని రైతులు, వ్యవసాయ కూలీలే అని ఒక అంచనా. పశ్చిమ ఆఫ్రికాలోనిబుర్కినా ఫోసాలోని రైతాంగంలో 84 శాతం మంది రైతులు, కూలీల శరీరం లో విషకారకాలు బయటపడుతున్నాయి. రైతు పొలంలో చల్లే పురుగుమందుల్లో ప్రతి చుక్కవిషం, పిల్లలకు చేరుతోంది. ఆ పని వారి రక్తంలో, మూత్రంలో, స్వేదంలోనూ ఈ విషప్రభావం చేరిపోతోంది. ప్రధానంగా రైతు పురుగుమందుల వినియోగంలో అత్యాశకుపోయి వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదుకన్నా 3-4 రెట్లు ఎక్కువ మందు వాడుతున్నారు. ఒకమందు పనిచేయక పోతే మరో సంస్థ తయారీ మందును వాడేస్తున్నారు. ఎండో సల్ఫాన్, మోనోక్రోటోఫాస్, ఫోరేట్ వంటి అత్యంత విషపూరిత మందులను భారత్‌లో విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇన్నాళ్లకు ఎండో సల్ఫాన్ వినియోగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని హెచ్చరికలు జారీ చేసింది. రైతును ఆ మందు వాడకుండా ఆపేందుకు ఈ ప్రయత్నం చేశారు. అసలు తయారీనే ఆపించాలి. వీటి వినియోగంలో రైతును ఆశించే అవశేషాలు క్యాన్సర్, కిడ్నీ ఫెయిల్యూర్, నరాల బలహీనత, సంతానలోపం, చర్మవ్యాధులకు దారితీస్తాయి. పంజాబ్‌లో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక రైలు ఉన్నట్లుగానే, కేరళలో ఎండో సల్ఫాన్ బాధితులు ఎక్కువ మంది ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఇలా రైతు శరీరంలో విషం ఉంటే వారు పండించే ధాన్యంలో మనం తినే ఆహారంలో కూడా ఉన్నట్లే. విష అవశేషాల ప్రభావం తల్లిపాల ద్వారా బిడ్డకు, విత్తనం ద్వారా తర్వాత పంటకు చేరిపోతోంది. ఇప్పటికీ మార్కెట్‌లో 27 రకాల పురుగు మందులపై నిషేధం విధించాల్సి ఉందని రైతాంగం కోరుకుంటోంది. ఏవో కొన్ని కారణాల వలన కేంద్రప్రభుత్వం వాటి మీద దృష్టి పెట్టలేకపోతోంది. కనీసం సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ అవకాశం చూపితే రైతు ఒడ్డునపడతాడు. జీవన ఎరువులు, వేప ఆధారిత ఎరువులు, సమగ్ర సస్యరక్షణ విధానాలను రైతుకు చేరువచేస్తే తప్ప ఈ విషవలయంలోంచి బయటకురాలేదు. ఈ అవశేషాలు ప్రాణాంతకం అన్న విషయం గతంలో కొన్ని ఉదంతాల వలన తేటతెల్లం అయింది. గత మూడేళ్లలో మహారాష్ట్రలో 183 మంది రైతులు పురుగుమందు పీల్చడం వలన చనిపోయారు. 2017 ఆగస్టు, సెప్టెంబరు నెలలో 'యావత్మాల్'లో పత్తి పంటపై పిచికారీ చేసిన పురుగుమందులకు 21 మంది రైతులు, కూలీలు బలయ్యారు. 2024-26ల మధ్య రాజస్థాన్‌లో 535 మంది రైతులు ఈ పురుగుమందుల వాడకంతో మృతి చెందారు. ఇలా ప్రాణాంతక వ్యవసాయంగా మారితే రైతులు 'సాగు' రంగాన్ని వీడితే 'ఆహారభద్రత'కే గండి పడుతుంది.



రచయితల సంఖ్య పెరిగే కొద్దీ పాఠకులు సోమరులుగా మారడం సహజం.

గోల్డ్‌స్మిత్



ఒక కంటితో నిద్రపోతూ మరో కంటితో శత్రువులను కనిపెట్టి ఉండే ఎలుగుబంటిలా రాజు శత్రువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

శ్రీకృష్ణదేవరాయలు

# స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయొద్దు

**దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధిక శాతం పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసిన వారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరఫున మాట్లాడటానికి తమ సర్పంచ్ ఉన్నాడనే ధైర్యం ఆనాడు గ్రామ ప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులు లేక తలతాకట్టుపెట్టి అప్పో సప్పో చేసి గ్రామాభివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరించలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.**

దామెర్ల సాయిబాబ

కానుకలు, దక్షిణతాంబూలాలు, మొక్కులు అన్నీ సమర్పించుకున్న తర్వాత కూడా దైవం కోరిన వరాలు ఇవ్వకపోతే కోరికలు తీర్చకపోతే పోయావు తాము చెల్లించిన కానుకలు, దక్షిణలు తిరిగి ఇవ్వాలంటూ 'మాదన్నమాకీ రాజన్న దేవుడా' అంటూ భక్తులు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామిని వేడుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. భక్తులు సమర్పించిన కానుకలు తిరిగి వారికి చెల్లించడానికి ఆయన దగ్గర లక్ష్మి ఉండదు కనుక ఏదో వరం ఇచ్చి పంపుతారనేది భక్తుల విశ్వాసం. ప్రజాస్వామ్యవ్యవస్థకు మూలస్తంభాలైన స్థానిక సంస్థల ప్రతినిధుల పరిస్థితి అందుకు అద్దంపడుతుందేమోననిపిస్తున్నది. పంచాయతీలకు నిధులు, విధులు ఇస్తాం, చట్టాలు తెచ్చాం, గ్రామ సమస్యలను గుర్తించి స్థానికంగానే సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నాం అంటూ ఎంతో కాలంగా పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నారు. కానీ 'అయ్యా మాకేమీ కొత్త చట్టాలు చేసి అదనంగా నిధులు, అధికారాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ సవరణల ద్వారా కల్పించిన ముప్పై తొమ్మిది ప్రభుత్వ శాఖలను గ్రామస్థాయిలో తమకు అప్పగిస్తే అదే పదివేలని వారు ఎంతోకాలంగా వేడుకుంటున్నారు. చట్టంలో ఉంది కనుక ఇవ్వమని చెప్పలేరు,అలాని ఇవ్వరు. దశాబ్దాల తరబడి నాన్చుతూనే ఉన్నారు. ఇప్పటికీ చట్టంలో కల్పించిన సగం అధికారాలు కూడా వారికి ఇవ్వలేదు. ఇచ్చినా కొద్దిపాటి శాఖల్లోకూడా అనేక ఆంక్షలు, అధికారుల జోక్యాన్ని పెంచారు.అంతేకాదు ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారనే ఆరోపణలను కొట్టివేయలేం. సర్పంచులకు గౌరవమర్యాదలకు ఎలాంటి లోటు ఉండదని అంటూనే ఇంకొకపక్క విద్యాకమిటీలు, వనరక్షణ కమిటీలు, నీటి సంఘాలంటూ స్థానిక సంస్థలకు సమాంతరంగా వ్యవస్థలను ఏర్పాటు చేసి సర్పంచు పదవులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఎన్నోసంక్షేమ కార్యక్రమాలను, చివరకు లబ్ధిదారుల గుర్తింపులు కూడా జరిగిపోతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు ఆరంభమైంది కాకపోయినా రెండు,మూడు దశాబ్దాలుగా ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను బల హీనపరిచే కార్యక్రమం జరుగుతున్నది. చివరకు చీపురుకట్ట కొనడానికి కూడా స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోకపక్క ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఆదాయం అంతంత మాత్రమేఉంది. ఆస్తిపన్ను తప్ప మరోపెద్ద ఆదాయవనరు లేకుండాపోయింది. ఇకగ్రామంలో ఏ అభివృద్ధి చేయాలన్నా అటు కేంద్ర ప్రభుత్వం వైపు, ఇటు రాష్ట్ర ప్రభుత్వంవైపు చేయి చాచే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏకోణంలో చూసినా పంచాయతీ రాజ్ వ్యవస్థను అంతోఇంతో నిర్వీర్యం చేయాలని అందరూ ప్రయత్నం చేసినవారే. తమ అధికారాలకు, ప్రాబల్యానికి దెబ్బ తగులుతుందనే భయమే ఇందుకు కారణమని చెప్పొచ్చు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే రాజకీయ ప్రవేశం చేసి ఉన్నతస్థాయికి చేరిన కొందరు నాయకులుకూడాపంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం అత్యంత బాధాకరం. దేశంలో కానీ, రాష్ట్రాల్లోకానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధికశాతం పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసినవారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి

## ఒక్క మాట

అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరఫున మాట్లాడటానికి తమ సర్పంచ్‌ఉన్నా డనే ధైర్యం ఆనాడు గ్రామప్రజల్లో అపారంగా ఉండేది.ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులులేక తలతాకట్టు పెట్టి అప్పోసప్పో చేసి గ్రామా భివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరిం చలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లులకోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. భారతదేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడికంటే ముందు నుంచి గ్రామాలు, గ్రామ వ్యవస్థ అమలులో ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది. ఆనాడు కూడా గ్రామసభలుండేవి. వాటి నిర్ణయాలకు ఆనాటిరాజరిక వ్యవస్థ ఎంతోప్రాముఖ్యత ఇచ్చిం ది. ప్రాచీన కాలం నుండే గ్రామవ్యవస్థ ఏదో ఒకరూపంలో మనదేశంలో కొనసాగుతూ వచ్చింది. 1882లో ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. స్వాతంత్ర్య నంతరం 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికలోనే కేంద్ర ప్రభుత్వం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ప్రారంభించింది. దాదాపు వంద గ్రామాలకు సుమారు లక్ష జనాభాతో ఒకయూనిట్‌ను ఏర్పాటు చేసి సామాజికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కొంతకాలం కొనసాగిన పిదప అవి ఏ మేరకు లక్ష్యసాధనలో గ్రామ ప్రజలకు ఉపయోగపడ్డాయి? ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు మార్పులు అవసరమా? అవసరమైతే ఎలాంటి మార్పులు చేయాలి? తదితర అంశాలపై అధ్యయ నం చేసేందుకు 1957లో ఒక కమిటీని వేశారు. బల్వంత రాయ్ మెహతా అధ్యక్షతన ఈ బృందం దేశంలోని అనేక ప్రాంతాలు పర్యటించి సమగ్రంగా పరిశీలించి 1958లో ఒక నివేదిక సమర్పించింది. గ్రామాభివృద్ధికి నిర్ణయాలు తీసుకునే అధికారం, స్వేచ్ఛస్థానిక సంస్థలకే ఉండాలని,అవి మూడంచెల విధానంలో ఉంటే బాగుంటుందని తదితర స్పష్టమైన సూచనలు చేసింది. ఆ సూచనల మేరకే దేశంలో మొదట రాజస్థాన్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. 1964లో గ్రామపంచాయతీ చట్టం తీసుకువచ్చారు.ఎంపి పాయ్‌కమిటీ నివేదికను అనుసరించి 447 బ్లాకులను, 321కు కుదింపు చేశారు. 1985లో సమితులను రద్దు చేసి అంతకుముందు అశోక్ మెహతా కమిటీ చేసిన సూచనలమేరకు 1986లో మండల్ ప్రజాపరిషత్,జిల్లా ప్రజాపరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నోమార్పులు చేర్పులు చేశారు. దేశవ్యాప్తంగా ఒకే తరహా పంచాయతీ రాజ్ వ్యవస్థ అమలులో ఉండాలనే ఉద్దేశ్యంతో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించిం ది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 మే 30వ తేదీ నుండి ఈశాసనం అమలులోకి వచ్చింది. ఈ చట్టప్రకారమే రాష్ట్రంలో ఐదంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. జెడ్‌పిటిసి, ఎంపి టిసిలని కొత్త పదవులు సృష్టించారు. కనీసం కూర్చోడానికి కుర్చీకూడా లేకుండా, అధికారాలు లేకుండా ఆ పదవులు ఎందుకు సృష్టించారో ఇప్పటికీ అర్థంకాదు. ఎన్ని మార్పులు చేసినా,మరెన్ని కూర్పులుచేసినా, అధికార వికేంద్రీకరణ మాత్రం మొదటి నుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్త పడుతూనే వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 2018 ఏప్రిల్ నుంచి కొత్తచట్టాన్ని తీసుకువచ్చింది. ఈచట్టప్రకారం మరి కొన్ని అధికారాలతో పాటు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలకు అవకాశాలు ఇచ్చింది.మొన్న తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు కొలువు తీరారు.ఆంధ్రప్రదేశ్‌లో త్వర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయి. అనేక సమస్యలు వారి ముందు దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి పేరుకుపోయిఉన్నాయి. ప్రగతికిమూలం కావాల్సిన పల్లెలు సమ స్యల నిలయాలుగా ఉన్నాయి. ప్రతి గ్రామం ఏదోరక మైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. స్థానిక సంస్థలను భాగ స్వామ్యం చేయకపోడంతో లబ్ధిదారుల గుర్తింపులో కూడా అనేక అవకతవకలు జరుగుతున్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీ పరిధిలోకి తీసు కురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగం కల్పించిన అధికారాలు, స్థానిక సంస్థలకు ఇవ్వడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న రాష్ట్రాల నేతలు స్థానిక సంస్థలకు మాత్రం అధి కారాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ●

# ప్రజావాక్కు



### గురువులను గౌరవిద్దాం

నేటి విద్యార్థుల్లో కొందరికి గురువులంటే భయం, భక్తి, గౌరవం తగ్గిపోతున్నాయి. తరగతి గదుల్లోనే గురువులపై కామెంట్లు చేస్తూ,వెకిలిచేష్టలు చేయడంబాధాకరం. గురువులు తప్పును సరిదిద్దేందుకు మందలిస్తే,కొందరు విద్యార్థులు దారుణంగా ప్రవర్తిస్తూ బెదిరించే స్థాయికి వెళ్తున్నారు.తమ జీవితానికి మార్గదర్శనం చేసే గురువుల పట్ల కనీస గౌరవం లేకుండా ప్రవర్తించడం సరికాదు.గురువు చెప్పే మాటలు మన భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి మార్గదర్శకత్వమని విద్యార్థులు గుర్తించాలి. గురువులను గౌరవించడం అంటే విద్యను, జ్ఞానాన్ని, మన భవిష్యత్తునుగౌరవించడమే. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. పిల్లలు తప్పులు చేయకుండా తల్లిదండ్రులు కూడా వారి ప్రవర్తనను గమనిస్తూ చూడాలి. గురువు విలువను గుర్తించి గౌరవించ డం ప్రతి విద్యార్థి బాధ్యత.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పరిశోధకులను నియమించుకోవాలి

తెలంగాణా రాష్ట్రంలో గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నూతన సంస్కరణలో భాగంగా పరిపాలనా పరమైన పరిశోధనలు అవసరం. ప్రతిమంత్రిత్వ శాఖ పరిధిలో ఆయా కార్యాలయాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులలో ఉన్నత విద్యలను అభ్యసించి వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన ఉద్యోగుల వివరాలు సేకరించాలి. వారిద్వారా ఆయా శాఖలలో పని విధానం, నిధులు, సౌకర్యాలు, సమస్యలు, పరిష్కరించడం కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సహాయకులుగా పనిచేయడానికి సలహాలు సూచనలు ఇవ్వడానికి వారిని నియమించుకోవాలి. ఆయా శాఖల అభివృద్ధికి గాను వీరి సేవలను వినియోగించుకోవాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### మట్టి విగ్రహాలను పూజిద్దాం

రాబోయే గణపతి ఉత్సవాల్లో భాగంగాకేవలం మట్టి విగ్రహాలను మాత్రమే పూజించి పర్యావరణాన్ని కాపాడుకునే ప్రయత్నం చేద్దాం.మారుతున్న కాలానుగుణంగా రకరకాల రంగురంగుల వినాయక విగ్రహాలను పర్యావరణ పరిరక్షణకు ఇబ్బంది కలగడమే కాకుండా చెరువుల్లో నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితంతో పాటు వాటిని త్రాగే పాడిపశువులు,సకల జీవరాశులు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### అయినా! ట్రంప్ మారడు

అమెరికా వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ పరిశ్రమలను కాపాడటమనే ప్రధాన ఉద్దేశ్యంతో అంతర్జాతీయ వాణిజ్యంలో ఇతర దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే వస్తువులపై విధించే కస్టమ్స్ సుంకాలను ఎడాపడా వేసారు. ఇంతకు ముందున్న అమెరికా అధ్యక్షులెవరికీ లేని దుందుడుకుతనం ట్రంపుది.రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు కొనసాగించడంపై ట్రంప్‌ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తూ,భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ సర్కార్ అదనపు టారిఫ్‌లు, సుంకాల పెంపునిర్ణయాలు ప్రకటించింది. అంతేకాదు జనరిక్ ఔషధాలపై కూడా ట్రంప్ టారిఫ్ విధించారు. ఈకొత్త టారిఫ్‌ల విధానాలపై అమెరికాలోని పలు రాష్ట్రాలు కోర్టును కూడా ఆశ్రయించాయి. కోర్టుల్లో పలు కీలక వ్యతిరేక తీర్పులు (ఎదురుదెబ్బలు) తగిలాయి. ఐనా! ట్రంప్ మారడం లేదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### రైతులకు పశువులను అందించాలి

వర్షాభావ పరిస్థితులను ఎదురుకునేందుకు పశువులను రుణాలపై అందించాలి అని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరం. అది గ్రామీణా ఉపాధి కల్పనా కార్యక్రమం ద్వారా కావొచ్చు, లేక ముద్ర పథకం ద్వారా కావొచ్చు. సెర్ప్ సంస్థ పెద్దన్న పాత్ర పోషించి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా డెయిరీని ఏర్పాటు చేసి విజయ డెయిరీ ద్వారా పాల కొనుగోలు కూడా చేపట్టడం గొప్ప అవకాశం. గత ప్రభుత్వం గొర్రెలు దిగుమతి ఆపడానికి గొర్రెల పంపిణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గొర్రెల సంఖ్యలో దేశంలో రెండో స్థానంలో నిలిపితే ఇప్పటి ఈ ప్రభుత్వం పాల దిగుమతిని ఆపుటకు తద్వారా పాల ఉత్పత్తి సాధించుటకు కృషి చేస్తున్నది. అయితే ఉపాధి హామీ లేదా వీబీ జీరామ్ జీ ద్వారా ఈ ప్రాజెక్ట్స్ కూడా చేపడితే పథకం సంపూర్ణ ఫలితాలు అందిస్తుంది.

- భారత అవినాష్, జనగామ

### ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించాలి

భారత్ చుట్టూ ఉన్న భౌగోళిక, భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే దేశ రక్షణసన్నద్ధతలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు లేదు. సరిహద్దుల్లో శాంతి కొనసాగాలని భారత్ కోరుకుంటున్నప్పటికీ, ఎలాంటి అనూహ్య పరిస్థితినైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. శాంతిని కోరుకోవడం బలహీనత కాదు,శాంతిని కాపాడగల సైనిక సామర్థ్యమే నిజమైన నిరోధక శక్తి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భరోసా ఏది?

డా. మోటె చిరంజీవి

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పథకంపై ప్రభుత్వ చిత్తశుద్ధి అవసరం.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అత్యంత కీలకం. ఆర్థిక స్థోమత లేక చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితిలో ఉన్న అనేక మంది విద్యార్థులకు ఈ పథకం ఒక ఆశాకిరణంగా నిలిచింది. అయితే రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, బకాయిలు పేరుకుపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు విద్యాసంస్థల యాజమాన్యాల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. విద్య అనేది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు ఇంజినీరింగ్, వైద్య, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, వృత్తివిద్య వంటికోర్సులు అభ్యసించేందుకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందితేనే విద్యార్థులు ఆర్థిక ఒత్తిడి లేకుండా తమ చదువును కొనసాగించగలరు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతే దాని ప్రభావం విద్యార్థులపైనే కాకుండా కళాశాలల నిర్వహణపైనా పడుతుంది. బోధనా సిబ్బంది జీతాలు, మౌలిక వసతుల నిర్వహణ, విద్యాప్రమాణాల కొనసాగింపు వంటి అంశాలు ఆర్థిక సమస్యలకు గురయ్యే అవకాశం ఉంటుంది. చివరికి దీనిప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపైపడటంఆందోళనకరం. 2019-20 రూ.27 కోట్లు, 2020-21 రూ.151 కోట్లు, 2021-22 రూ.762 కోట్లు,2022-23 రూ.1,432 కోట్లు, 2023-24 రూ.1,147 కోట్లు, 2024-25 రూ.24 కోట్లు పెండింగ్ టోకెన్ల మొత్తం రూ.3,543 కోట్లు వున్నాయి. తెలంగాణలో ప్రొఫెషనల్, నాన్‌ప్రొఫెషనల్ కోర్సులకు కలిపి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్ల వార్షిక కేటాయింపు చేస్తోంది. 2025-26 నాటికి బకాయిలు భారీగా పెరిగి, 2024-25 వరకు మొత్తం బకాయిలు సుమారు రూ.9,000 కోట్ల వరకు ఉన్నాయని ప్రైవేట్ కళాశాలల సమాఖ్యలు పేర్కొన్నాయి. ప్రభుత్వాలు పథకాలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటికి అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలి. ముఖ్యంగా విద్యార్థుల చదువుతో ముడిపడిన పథకాల విషయంలో ఆలస్యం మరింత తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా పారదర్శకమైన, నిరంతర చెల్లింపు వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉంది. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. పెండింగ్ బకాయిలను దశలవారీగా కాకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతోపాటు, భవిష్య త్తులో బకాయిలు పేరుకుపోకుండా బడ్జెట్‌లో తగిన కేటా యింపులు చేయాలి.పేదరికం కారణంగా ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. నిధుల విడుదలలో జాప్యం లేకుండా, విద్యార్థుల భవిష్య త్తుకు భరోసా కల్పించే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయడమే సమాజ శ్రేయస్సుకు సరైన మార్గం. ●

# ఆచార్య దేవోభవ! అదే మన స్ఫూర్తిప్రదాత



శ్రీమతి ద్రౌపదీ ముర్ము

తలరాతను మార్చేది ఉపాధ్యాయులే. కోట్లాది మంది విద్యార్థుల జీవితాల్లో విజ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, స్ఫూర్తి నింపి సుసంపన్నం చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతీయులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తన జన్మ దినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని భారతదేశానికి రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆకాక్షి ఒచిన విషయం అందరికీ తెలిసిందే. ఆయన అంతర్జాతీయంగా ఖ్యాతి గాంచిన మేధావి. ప్రఖ్యాత రచయిత. గొప్ప రాజనీతిజ్ఞుడు. అయినప్పటికీ ఉపాధ్యాయునిగా తానుపోషించిన పాత్రనే అన్నింటి కంటే మిన్నగా భావించారు. అత్యంత ఆదరణ పొందిన రాష్ట్రపతుల్లో ఒకరైన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంకు ఒక సందర్భంలో మిమ్మల్ని శాస్త్రవేత్తగా గుర్తుంచుకోవాలా? రాష్ట్రపతిగాగుర్తుంచుకోవాలా? అనే ప్రశ్న ఎదురయింది. తనను ఓ ఉపాధ్యాయుడిగా గుర్తుంచుకోవాలనిడాక్టర్ కలాం సమాధానమిచ్చారు. సామర్థ్యం, నైతిక విలువలే ఉపాధ్యాయులను పూజనీయులుగా మారుస్తాయి. అలాంటి వారినే విద్యార్థులు దైవంగా భావిస్తారు. వారినే ఆదర్శంగా తీసుకుంటారు. విద్యార్థులపై కోపం ప్రదర్శించకూడదని, సహనంతో ఉండాలని ప్రాచీన గ్రంథాలు సూచిస్తున్నాయి. 'ఆచార్యదేవో భవ' అనే కాలాతీత సందేశాన్ని దాదాపు మూడు సహస్రాబ్దాల క్రితం నాటి తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లి అందిస్తోంది.ఎంతోమంది వివేకవంతులైన, ప్రేమ నిండిన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని పొందడం నాకు కలిగిన గొప్ప అదృష్టం. కొన్నిసందర్భాల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాత సైతం తమ గృహాల్లోనే వారు మాకు పాఠాలు చెప్పేవారు. మమ్మల్ని ఎంతోజాగ్రత్తగా చూసుకొనేవారు. ఏడో తరగతి తర్వాత పైచదువుల కోసం మా ఊరు నుంచి బయటకు వెళ్లిన మొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత భువనేశ్వర్‌లో చదువుతున్నప్పుడూ నా ఉపాధ్యాయుల నుంచి అపారమైన ప్రేమను, ప్రోత్సాహాన్ని పొందగలగడం నాకు దక్కిన భాగ్యం. నా ఉపాధ్యాయుల గురించి ఎంతో వినయంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే వారి కథ... ప్రేమ, అంకితభావంఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థిలోఅపరిమితమైన సామర్థ్యాన్ని, స్ఫూర్తిని మేల్కొల్పగలరు అనే గొప్ప సత్యాన్ని తెలియజేస్తుంది. మంచి ఉపాధ్యాయున్ని తీర్చిదిద్దే సూక్ష్మం ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతీసంప్రదాయాల ద్వారా మనకు లభించింది. అది నేటి కాలానికి సైతం వర్తిస్తుంది.శతాబ్దాల క్రితం, మహాకవి కాళిదాసు తన మాళవికాగ్నిమిత్రం నాటకంలో, అపారమైన జ్ఞానాన్ని ఉండటంతో పాటు, దానిని ఇతరులకు అందించగల సామర్థ్యం ఉన్నవారే మంచి ఉపాధ్యాయుడు అని రాశారు. విద్యార్థుల్లో స్వతంత్ర్య ఆలోచనను ప్రోత్సహించడం,వారిలో ఆసక్తిని రేకెత్తించడం, తర్కాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించడం, నిర్ణయ సామర్థ్యానికి పదును పెట్టడం, వారు సాధికారత సాధించిన వ్యక్తులుగా ఎదగడానికి సాయ పడటం ఇవే బోధనకు ఉన్న అత్యంత ఉపయోగకరమైన, ప్రతిఫలాన్ని అందించే ఉపయుక్తకర అంశాలు. బోధన అంటే మానవాళిని తీర్చిదిద్దే పవిత్రమైన కార్యం.భవిష్యత్తు తరాలకు ప్రకాశవంతమైన మార్గాన్నిఅందించే ఉన్నతమైన బాధ్యత. బోధనకు సంబంధించిన నా జ్ఞాపకాలు నాకు ప్రత్యేకమైన సంతృప్తిని ఇస్తాయి. నేను ఒడిశాలోని రాయరంగ్‌పూర్‌లో ఉన్న శ్రీ అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలలో చిన్నారులకు బోధించాను. వివిధ పాఠ్యాంశాలను బోధించడంతో పాటు... సంగీత ప్రదర్శనలకు, క్రీడలకు, నాటకాలకు వారిని సిద్ధం చేయడంలో పూర్తిగా నిమగ్నమై ఉండేదాన్ని. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలకోసం మా సన్నాహాలను, ఆ సమయంలో పిల్లల ఆనందోత్సాహాలను గుర్తు చేసుకుంటే ఈనాటికీ నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. విద్యార్థులను అందమైన ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్లడంలో గొప్ప సంతృప్తిని, అర్థాన్ని కనుగొన్నాను. పాఠశాల విద్యపూర్తయి ఏళ్లు గడిచినా...ఇప్పటికీ నా విద్యార్థులు వారి కుటుంబ కార్యక్రమాలకు నన్ను ఆహ్వానిస్తుంటారు. నా విద్యార్థుల్లో చాలా మంది పేర్లు నాకు స్పష్టంగా గుర్తున్నాయి. వాటితో పాటు మేం వారిని పిలిచిన మారు పేర్లు కూడా గుర్తున్నాయి. నా విద్యార్థుల నుంచి నేను కూడా చాలా నేర్చుకున్నాను. బాలల నుంచి తక్షణమేస్పందించే గుణాన్ని, ఆసక్తిని ఉపాధ్యాయులు నేర్చుకుంటారని నేను విశ్వసిస్తాను. రాష్ట్రపతిగా రెండో సంవత్సరాన్ని నేను పూర్తి చేసుకున్నప్పుడు రాష్ట్రపతి భవన్ ఆవరణలోని పాఠశాల విద్యార్థులతో సమయం గడిపాను. అప్పుడు వారికి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించాను. నేను ఎల్లప్పుడూ విద్యార్థులను కలవడానికి, వారి ఆలోచనలను, అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ఆసక్తి చూపుతాను. వారు పంచుకునే విషయాలు నాకు గుర్తుండిపోతాయి. సుమారు పదకొండేళ్ల క్రితం, నేను మా ఊరిలోఒక గురుకుల పాఠశాలను స్థాపించాను. ఆ పాఠశాలలో పేద విద్యార్థులు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు చదువుకుంటారు. వారిని కలుసుకొనేందుకు అప్పుడప్పుడూ ఆ పాఠశాలను సందర్శిస్తుంటాను. ఈ ఏడాది జూన్ 20న నా పుట్టినరోజు సందర్భంగా ఆబాలలతో సమయం గడపడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సైతం నాతో పాటు పాఠశాలను సందర్శించి వారిలో స్ఫూర్తి నింపారు. ప్రధానిని కలుసుకున్న అసాధారణ అనుభవం వారికి చిరకాలంస్ఫూర్తినిచ్చేదిగా నిలిచిపోయింది. విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులకుమాత్రమే పరిమితం కాదు. తమ ప్రవర్తన, విజయాల ద్వారా బాలలకు ఆదర్శంగా నిలిచేవారు కూడా నేర్చుకోవడానికి, స్ఫూర్తికి విలువైన వనరుగా ఉంటారు. తమ పిల్లలను చదువుకోవడానికి పంపించేటప్పుడు ఉపాధ్యాయులపై అత్యంత విశ్వాసాన్ని తల్లిదండ్రులు, సంరక్షులు ఉంచుతారు. విద్యార్థులను తమ సొంత పిల్లలా చూసుకుంటారని, వారి భద్రత, అభివృద్ధి విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకుంటారనివారు నమ్ముతారు. తమపై ఉంచిన ఈ పవిత్రమైన నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి ఉపాధ్యాయుని ధర్మం. ఉపాధ్యాయుని వైఖరి, ప్రవర్తన, నడవడిక బాలల్లో భయాందోళనలను కలిగించకూడదు, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదు. లేదా వారిలో ఎలాంటి న్యూనతా భావం పెరిగేలా చేయకూడదు.విద్యార్థులను తమ లాంటి ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దేలా ఉత్తమ ఉపాధ్యాయులు దోహదపడతారు. తమ విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యత ఉపాధ్యాయులదే.తమ ఆలోచనల్లో, చేతల్లో నైతికతను పాటిస్తూ,సంపదను, కీర్తిని సాధించే విద్యార్థులే ఉపాధ్యాయుని విజయానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తారు. సామాజిక సమ్మిళితత్వమే కేంద్రంగా ఎదగాలనే లక్ష్యం దిశగా భారత్ స్థిరంగా ప్రయాణిస్తోంది. పర్యావరణాన్ని, సకల జీవరాశులను పరిరక్షి ంచే, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సుకోసం కృషి చేసే, దేశమే ప్రథమం అనేస్ఫూర్తితో ముందుకు సాగే విద్యార్థులనుఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని నేనుకోరుకుంటున్నాను. భారత్ అగ్రగామిగా నిలవాలని


5-9Pg5:5-9Pg5.qxd 9/5/2026 12:06 AM Page 1



# మరింత ఉగ్రరూపంతో ఎల్‌నినో

## - ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా - 2027 ఫిబ్రవరి వరకూ కొనసాగే అవకాశం - ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలు అధికంగా నమోదు : డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో

**జెనీవా, సెప్టెంబర్ 4:** ఎల్ నినో వాతావరణ దృగ్విషయం 2027 వరకు మరింత తీవ్రతరం కానుందని, ఇది ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైనదిగా మారవచ్చని, తద్వారా వచ్చే ఏడాది తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రమాదాన్ని పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తెలిపింది. అసాధారణంగా వేడెక్కిన పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతల కారణంగా, ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం దాదాపు 100శాతం ఉందని తమ అంచనాలు చూపిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి వాతావరణ సంస్థ తెలిపింది. ఇంతటి నిశ్చయతను వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి అని డబ్ల్యుఎంఒ పేర్కొంది. "ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, ఇది అత్యంత బలమైనదిగా మారవచ్చు. అంటే, అక్షరాలా ఊహించని స్థాయిలో ఉంటుంది" అని డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో జెనీవాలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎల్ నినో అంటే బలహీన పడుతున్న వాణిజ్య పవనాల వల్ల తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కాలానుగుణంగా పెరగడం. ఇది ప్రతి రెండు నుండి ఏడు సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. 12 నెలల వరకు కొనసాగుతూ, లాటిన్ అమెరికా అంతటా తీవ్రమైన వర్షాలకు, కరువులకు కారణమవుతుంది. చాలా బలమైన ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిని గణనీయంగా మార్చగలదు. కరువులు, తుఫానుల వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తుంది. వేడెక్కుతున్న సముద్రం: ఇది సహజంగా సంభవించే దృగ్విషయమే అయినా శిలాజ ఇంధనాల వల్ల కలిగే వాతావరణ మార్పుతో దీనికి ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ, వేడెక్కుతున్న సముద్రపు ఉష్ణోగ్రతల వల్ల ఇది తీవ్రతరం కావచ్చు. "ఎల్ నినో మన కళ్ల ముందే భారీ స్థాయికి చేరుకుంటోంది. దీంతో సముద్ర జలాలు వేడెక్కుతున్నాయి" అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. 1950 నుండి నమోదైన గణాంకాల ప్రకారం, గతంలో నమోదైన నాలుగు ఎల్ నినో ఘటనలలో కంటే, ప్రస్తుత ఎల్ నినో సమయంలో, పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ (3.6 డిగ్రీల ఫారెన్‌హీట్) కంటే ఎక్కువగా ఉన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తెలిపింది. ఈ ఘటన ఇప్పటికే ఉష్ణ మండల ప్రాంతాల్లోని వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం చూపింది, దీనివల్ల మధ్య అమెరికాలోని 'డ్రై కారిడార్' ప్రాంతంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. ప్రపంచ ఉష్ణోగ్రతలలో పెరుగుదల: ఈ యేడాది చివరి నాటికి ఇది గరిష్ట స్థాయికి చేరుకుంటుందని డబ్ల్యుఎంఒ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే దీని ప్రభావాలు 2027 వరకు కొనసాగుతాయని, వచ్చే యేడాది ప్రపంచ ఉష్ణోగ్రతలు మరింత పెరిగేలా చేస్తాయని డబ్ల్యుఎంఒ అధికారులు పేర్కొన్నారు. "సాధారణంగా ఎల్ నినో ఘటన తర్వాత ప్రపంచ ఉష్ణోగ్రతలలో ఒక తాత్కాలిక పెరుగుదల కనిపిస్తుంది" అని డబ్ల్యుఎంఒ వాతావరణ అంచనా సేవల విభాగం అధిపతి విల్‌ఫ్రాన్ మోఫౌమా ఒకియా విలేకరులతో అన్నారు. ఇప్పటివరకు అత్యంత వేడిగా నమోదైన 2024 సంవత్సరాన్ని ప్రస్తావిస్తూ, "2027 రికార్డు స్థాయిలో అత్యంత వేడి సంవత్సరంగా మారే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.




## పెనువిషాదాన్ని మిగిల్చిన నేపాల్ భారీ వరదలు!

# 17వేల మంది చిన్నారులపై విపత్తు ప్రభావం

**ఖాట్మండు, సెప్టెంబరు 4:** నేపాల్‌లో సంభవించిన ఘోర వరద విపత్తు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ జల ప్రళయంలో వందలాది మంది చిన్నారులు సహా వేలాది మంది గల్లంతయ్యారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో గల్లంతైన వారిని, ముఖ్యంగా పిల్లలను గుర్తించడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. వారి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. గతనెల 26న నేపాల్‌చైనా (టిబెట్) సరిహద్దులోని హిమాలయాల్లో భారీ హిమానీనదం కూలిపోవడంతో త్రిశూలి నదికి వరదలు పోటెత్తాయి. ఈ ఆకస్మిక వరదల ధాటికి చైనానేపాల్ సరిహద్దులోని గైరాంగ్ చెక్‌పాయింట్ సహా పలు పట్టణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 1,200 దాటింది. నేపాల్, టిబెట్ కలిపి గల్లంతైన వారి సంఖ్య 5,000 వరకూ ఉంటుందని అంచనా. గల్లంతైన వారిలో భారతీయులు, అమెరికన్లతో పాటు పలువురు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ విపత్తులో చిన్నారులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. యూనిసెఫ్ ప్రకారం, సుమారు 17,000 మంది పిల్లలకు తక్షణ మానవతా సహాయం అవసరం. వరదల కారణంగా 18 పాఠశాలలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 20 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 230 నుంచి 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గల్లంతయ్యారు. కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. యూనిసెఫ్ బృందాలు వారిని గుర్తించి, కుటుంబ సభ్యులతో కలిపేందుకు, మానసిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి. గల్లంతైన వారిని కనుగొనడంలో తెగిపోయిన నెట్‌వర్క్‌లు అతిపెద్ద సవాలుగా మారాయి.

టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చాలా ప్రాంతాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కేవలం హెలికాప్టర్ల ద్వారా మాత్రమే సహాయక బృందాలు అక్కడికి చేరుకోగలుగుతున్నాయి. దీంతో సహాయక చర్యలు, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. డీఎన్‌ఏ నమూనాలు సేకరించి మృతులను గుర్తించేందుకు నేపాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఐక్యరాజ్యసమితి, రెడ్‌క్రాస్ వంటి అంతర్జాతీయ సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

# భారత్, బెల్జియంల మధ్య పది ఒప్పందాలు

## రక్షణ సంబంధాలు మరింత బలోపేతం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్‌లో పర్యటిస్తున్న బెల్జియం ప్రధాని బార్ట్ డివెవర్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. భారత్‌తో రక్షణ సంబంధాలను బెల్జియం మరింత బలోపేతం చేసుకుంది. పాకిస్థాన్‌తో సైనిక పరికరాలు, రక్షణ సాంకేతికతకు సంబంధించిన సహకారం చేపట్టబోమని భారత్‌కు హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. రక్షణ, భద్రతా వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ఢిల్లీలో ప్రధాని మోడీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ సమావేశమయ్యారు. మరోవైపు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బెల్జియం రక్షణ, విదేశీ వాణిజ్య మంత్రి థియో ఫ్రాంకెన్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. భారత్‌బెల్జియం సంయుక్త ప్రకటనలో గానీ రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో గానీ పాకిస్థాన్ ప్రస్తావన లేదు. బెల్జియం రక్షణ ఎగుమతులపై ఏదైనా నిర్దిష్ట దేశానికి సంబంధించిన ఆంక్షలను కూడా బహిరంగంగా ప్రకటించలేదు. ఈ హామీ ఎంతకాలం అమల్లో ఉంటుంది. ఎలా అమలు చేస్తారనే దానిపై కూడా అధికారిక వివరాలు వెల్లడికాలేదు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే భారత్ పోరాటానికి బెల్జియం మద్దతు ప్రకటించినట్లు సంయుక్త ప్రకటన తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 2025 ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడిని బెల్జియం ఖండించింది. ఉగ్రవాదులు, వారికి నిధులు అందించే వ్యక్తులు, సంస్థలు, వారికి ఆశ్రయం కల్పించే వ్యవస్థలపై చర్యలు తీసుకోవాలని ఇరు దేశాలు పిలుపునిచ్చాయి. ఇందుకోసం ఐక్యరాజ్యసమితి, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ వంటి అంతర్జాతీయ వేదికల ద్వారా కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఉగ్రవాద నిరోధక అంశాలపై సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించాలని అంగీకరించాయి.

గతంలో బెల్జియం పాకిస్థాన్‌కు సైనిక విమానాలను సరఫరా చేసింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం 2021లో బెల్జియం ఏడు సి130బీ రవాణా విమానాలను పాకిస్థాన్‌కు విక్రయించింది. 2003లో పాకిస్థాన్ బెల్జియం నుంచి ఎఫ్16 యుద్ధ విమానాలను కూడా కొనుగోలు చేయాలని ప్రయత్నించింది. అయితే అమెరికాలో తయారైన ఈ విమానాలను బదిలీ చేయడానికి వాషింగ్టన్ అనుమతి అవసరం కావడంతో ఆ ప్రతిపాదిత ఒప్పందం ముందుకు సాగలేదు. 2021-25 మధ్యకాలంలో పాకిస్థాన్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ప్రధాన ఆయుధాల దిగుమతిదారుగా ఉంది. ఆ కాలంలో పాకిస్థాన్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో 80 శాతం చైనా నుంచి వచ్చాయి. తుర్కియే 7 శాతం, నెదర్లాండ్స్ 4.6 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# సిఎం విజయ్ కాన్వాయ్‌లోకి చొరబడిన భార్యాభర్తలు!

**చెన్నై, సెప్టెంబరు 4:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కాన్వాయ్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మార్చిలో శివగంగై జిల్లాలో పోలీసుల కస్టడీలో మృతి చెందిన 26 ఏళ్ల యువకుడి తల్లిదండ్రులు సీఎం కాన్వాయ్‌కు అడ్డుగా దూసుకెళ్లారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ వారు బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. చెన్నైలోని సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిరసన చేస్తున్న మృతుడి తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ కాన్వాయ్ వస్తుండగా స్థానికులు ఫెన్సింగ్ వెనుక నిలబడి ఉన్నట్లు వీడియోలో కనిపించింది. ఇంతలో ఓ మహిళ, ఓ పురుషుడు ఒక్కసారిగా ఫెన్సింగ్ దాటి భద్రతా వలయాన్ని ఛేదిస్తూ కాన్వాయ్ వైపు పరుగెత్తారు. మహిళను పోలీసులు వెంటనే పట్టుకోగా పురుషుడు మాత్రం సీఎం కాన్వాయ్‌కు మరింత దగ్గరగా వెళ్లగలిగాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే కాన్వాయ్‌ను నిలిపివేశారు. శివగంగై జిల్లాకు చెందిన 26 ఏళ్ల దళిత యువకుడు పోలీసుల కస్టడీలో ఉండగా అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం చికిత్స కోసం మదురైలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విచారణ సమయంలో పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేశారని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు ఏఎన్ఐ గతంలో నివేదించింది. మృతుడిని ఆకాష్ డెనిసన్‌గా గుర్తించారు. చిన్నపాటి దాడి కేసులో అనుమానితుడిగా మనమదురై పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కుమారుడి మృతిపై అతడి తండ్రి కన్నన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల విచారణ సమయంలో తన కుమారుడిపై తీవ్రంగా దాడి చేశారని, కులం పేరుతో దూషించారని ఆరోపించారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ కన్నన్, ఆయన భార్య తమ బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి విజయ్ కాన్వాయ్ సమీపంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది.




## స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం

**శ్రీనగర్, సెప్టెంబరు 4:** శ్రీనగర్ విమానాశ్రయంలో ఇండిగో విమానం పార్కింగ్ చేస్తుండగా వీఎడీజీఎస్ పోల్‌ను తాకింది. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. ఎవరికీ గాయాలు కాలేదని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముంబై నుంచి శ్రీనగర్ వచ్చిన ఇండిగో విమానం 6ఈ 225 ఉదయం 9.02 గంటలకు బే నంబర్ 6లో పార్కింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది.

## అవినీతి కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడి కుమారుడు నామల్ రాజపక్స అరెస్ట్

**కొలంబో, సెప్టెంబరు 4:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స కుమారుడు, ఎంపీ నమల్ రాజపక్సను దేశ ప్రధాన అవినీతి నిరోధక సంస్థ శుక్రవారం అరెస్ట్ చేసింది. 2013లో జరిగిన ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంలో అవినీతి ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బ్రైబరీ అండ్ కరప్షన్ ఆరోపణల దర్యాప్తు కమిషన్ ప్రకారం ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంపై విచారణకు హాజరు కావాలని 40 ఏళ్ల నామల్ రాజపక్సకు సమన్లు జారీ చేశారు. విచారణ అనంతరం ఆయనను అరెస్ట్ చేసినట్లు కమిషన్ అధికారి తెలిపారు. అనంతరం ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. అయితే నామల్ రాజపక్సపై ఏయే అభియోగాలు నమోదు చేశారన్నది వెంటనే స్పష్టంగా తెలియరాలేదు. ఆయన న్యాయవాది నిశాంత దయానంద అరెస్ట్‌ను ధ్రువీకరించారు.

వివాదాస్పదంగా మారిన 2.3 బిలియన్ డాలర్ల ఎయిర్‌బస్ ఒప్పందానికి సంబంధించి ఈ అరెస్ట్ జరిగినట్లు తెలిపారు. 2016లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ కేసులో సిఐఎబిఒసి ఇప్పటికే మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సను కూడా మే నెలలో ప్రశ్నించింది. విమానాల కొనుగోలు వ్యవహారంలో ఆయన లంచాలు స్వీకరించారన్న ఆరోపణలపై అధికారులు విచారించారు. ఎయిర్‌బస్ విమానాల కొనుగోలులో చెల్లించిన మొత్తంలో కొంత భాగాన్ని శ్రీలంకకు చెందిన ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు లంచాల రూపంలో అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రస్తుతం అవినీతి నిరోధక సంస్థ దర్యాప్తు కొనసాగిస్తోంది. రాజపక్స కుటుంబం తమపై వచ్చిన లంచం, అవినీతి ఆరోపణలను ఖండించింది. తమపై వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని పేర్కొంది.




## నవంబరు 10న భారత్‌లో సోనియా ఆత్మకథ విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** సోనియా గాంధీ రాసిన బిలాంగింగ్-ఏ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకానికి భారత్‌లో కొత్త ప్రచురణకర్త ఖరారైంది. హార్పర్‌కాలిన్స్ ఇండియా ఈ పుస్తకాన్ని ప్రచురించనుంది. 2026 నవంబర్ 10న భారత్‌లో పుస్తకం విడుదల కానుంది. ఈ విషయాన్ని హార్పర్‌కాలిన్స్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. అత్యంత ఆసక్తి రేపుతున్న రాజకీయ జ్ఞాపకాల పుస్తకాల్లో ఇదొకటని తెలిపింది. ప్రేమ, గుర్తింపు, బాధ్యత, అనుబంధం వంటి అంశాల చుట్టూ సోనియా గాంధీ వ్యక్తిగత జీవితాన్ని ఇందులో వివరించినట్లు పేర్కొంది. ఇటీవల సోనియా గాంధీ పుస్తకానికి పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకర్త కాదని ప్రకటించింది. పుస్తకంలోని కొన్ని అంశాలపై రచయితతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని సంస్థ తెలిపింది. అయితే సంపాదకీయ మార్పులకు సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురణ నుంచి తప్పుకున్నారన్న వార్తలను పెంగ్విన్ ఖండించింది. బాహ్య ఒత్తిడి కారణం కాదని స్పష్టం చేసింది. బిలాంగింగ్ పుస్తకాన్ని అమెరికాకు చెందిన ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ నవంబర్ 10న విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించింది. భారత్‌లో మాత్రం ప్రచురణ బాధ్యతలు ఇప్పుడు హార్పర్‌కాలిన్స్ ఇండియాకు దక్కాయి. ఈ పుస్తకంలో సోనియా గాంధీ తన ఆరు దశాబ్దాల అనుభవాలను ప్రస్తావించారు. 1984లో అత్త ఇందిరా గాంధీ హత్యతో తన జీవితం ఎలా మారిందో వివరించారు. 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎదురైన పరిస్థితులనూ పంచుకున్నారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన తీరాన్ని పుస్తకంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం కొనసాగిన సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా తిరస్కరించారు.

2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన పరిణామాలనూ ఆమె తన పుస్తకంలో ప్రస్తావించారు.

## కొలెస్ట్రాల్ తగ్గించేందుకు జన్యుచికిత్స పరీక్షలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) ఎక్కువైతే గుండె జబ్బులు, గుండెపోటు, స్ట్రోక్ ముప్పు పెరుగుతుంది. సాధారణంగా ఆహారంలో మార్పులు, మందులతో దీన్ని నియంత్రిస్తారు. ఇప్పుడు ఒక్కసారి మాత్రమే ఇచ్చే జన్యు చికిత్సతో ఎల్‌డీఎల్‌ను సగానికి పైగా తగ్గించే అవకాశం ఉందని తొలి మానవ పరీక్ష వెల్లడించింది. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న ఈ చికిత్సకు సీటీఎక్స్310 అని పేరు పెట్టారు. క్రిస్పర్ జన్యు సవరణ సాంకేతికతతో కాలేయ కణాల్లోని ఏఎన్‌జీపీటీఎల్3 ప్రొటీన్ ఉత్పత్తిని తగ్గించడం దీని లక్ష్యం. ఈ ప్రొటీన్ తక్కువగా ఉంటే రక్తంలోని కొవ్వులను శరీరం మెరుగ్గా నియంత్రించగలదు. తొలి దశ పరీక్షలో తీవ్రమైన కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ సమస్యలున్న 15 మందికి సీటీఎక్స్310ను నరాల ద్వారా అందించారు. చికిత్స కోసం క్రిస్పర్ సూచనలను మోసుకెళ్లే నానోకణాలను ఉపయోగించారు. వారిలో ఒకరు చికిత్స తర్వాత 179 రోజులకు మరణించారు. ఆ మరణానికి సీటీఎక్స్310 కారణం కాదని పరిశోధకులు నిర్ధారించారు. మిగిలిన 14 మందిలో ఏడాది తర్వాత కూడా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు తగ్గినట్లే ఉన్నాయి. తీవ్రమైన కొత్త దుష్ప్రభావాలు కనిపించలేదు. అత్యధిక మోతాదు పొందిన నలుగురిలో ఏఎన్‌జీపీటీఎల్3 స్థాయిలు సగటున 78.6 శాతం తగ్గాయి. వారి ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 52.5 శాతం, ట్రైగ్లిజరైడ్లు 47.8 శాతం తగ్గాయి. అయితే ఇది చాలా చిన్న స్థాయిలో జరిగిన తొలి మానవ పరీక్ష మాత్రమే. ఎక్కువ మందిపై, ఎక్కువ కాలం పరిశోధనలు జరగాల్సి ఉంది. జన్యు సవరణలో కొన్ని ప్రమాదాలు ఉండే అవకాశం కూడా ఉంది.

## భారత్ కంపెనీతో

# రూ. 769 కోట్ల ఆయుధ డీల్..

## ఎస్తోనియా రక్షణ మంత్రి రాజీనామా



**టల్లిన్, సెప్టెంబరు 4:** ఆయుధాల ఒప్పందం విషయంలో బయటపడిన అవకతవకలు ఎస్తోనియా రక్షణ మంత్రి పదవికి ఎసరు తెచ్చాయి. రూ. 768.50 కోట్లతో ఫిరంగి మందుగుండు సామగ్రి కొనుగోలుకు సంబంధించిన తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో హాన్నో పెవ్కుర్ రాజీనామా చేశారు. ఈ డీల్‌కు సంబంధించి ఆడిట్‌లో తేలిన అక్రమాల ఆధారంగా నేర విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో హాన్నో నైతిక బాధ్యత వహిస్తూ రక్షణమంత్రి పదవి నుంచి వైదొలిగారు. ఈ వివాదంలో భారత్‌కు చెందిన ఓ కంపెనీ కేంద్ర బిందువుగా మారడం గమనార్హం. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో మందుగుండు సామగ్రి కొరత ఏర్పడింది. కీవ్ కోసం వాటిని సమీకరించేందుకు మరో ఐరోపా దేశం ఎస్తోనియా.. ఇటలీకి చెందిన డేటాసెల్ ఎస్ఆర్ఎల్ కంపెనీతో 2024లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటాసెల్ కంపెనీని అదే యేడాది ఆరంభంలో భారత్‌కు చెందిన నెకో డిఫెన్స్ కొనుగోలు చేసింది. ఈ మొత్తం ఒప్పందం విలువ 70 మిలియన్ల యూరోలు. ఐరోపా యూనియన్‌కు చెందిన యూరోపియన్ పీస్ ఫెసిలిటీ నుంచి వచ్చిన డబ్బును ఎస్తోనియా ఈ కంపెనీకి దశల వారీగా ముందుగానే చెల్లించింది. కొన్ని నెలల్లోనే ఈ ఆర్టిలరీ షెల్స్ ఉక్రెయిన్‌కు చేరుకుంటాయని అంతా భావించారు. కానీ, ఆయుధ సరఫరాలు పదేపదే ఆలస్యమయ్యాయి. 2025లో కొన్ని షెల్స్ డెలివరీ అందినా.. అవి పూర్తిగా లోపాలతో ఉన్నాయని ఎస్తోనియా ఆరోపించింది. దీంతో వాటిని ఉక్రెయిన్‌కు పంపించలేదని తెలిపింది. తాను చెల్లించిన డబ్బు తిరిగి పొందేందుకు ఎస్తోనియా ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, ఈ ఆరోపణలను డేటాసెల్ తిప్పికొట్టింది. తాము చాలావరకు డెలివరీలు అందించామని, ఒప్పందం గడువు ముగియడానికి ముందే 59 మిలియన్ యూరోల విలువైన మందుగుండు సామగ్రిని సరఫరా చేశామని వెల్లడించింది. అలాగే నాణ్యతా సమస్యల కారణంగానే ఒప్పందం రద్దు చేసుకున్నారన్న వాదనలను ఖండించింది. ఈ వ్యవహారం నేపథ్యంలో ఎస్తోనియాపై డేటాసెల్ కంపెనీ దావా వేసింది. ఈ నేపథ్యంలోనే ఎస్తోనియా రక్షణ నిధుల నిర్వహణ, సైనిక కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ చేపట్టగా అవకతవకలు బయటపడ్డాయి. దీనిపై విమర్శలు రావడంతో రక్షణ మంత్రి రాజీనామా చేశారు. ఈ డీల్‌కు చెల్లించిన డబ్బులు ఐరోపా యూనియన్‌కు తిరిగిరాకపోతే.. ఎస్తోనియా తన సొంత బడ్జెట్ నుంచి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఎస్తోనియా దేశం ఐరోపా యూనియన్, నాటో కూటమిలో భాగం. దీనికి రష్యాతో సరిహద్దు ఉంది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ దేశంలో కూడా భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తాయి. అలాగే ఉక్రెయిన్‌కు ఎస్తోనియా కీలక మద్దతుదారుగా ఉంది.

# రామభక్తుల దీవెనలే నాకు ముఖ్యం

## అయోధ్య రామమందిరం కొత్త సిఇఒ జితేంద్ర



**అయోధ్య, సెప్టెంబరు 4:** అయోధ్య రామాలయం సీఈవోగా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులైన విషయం తెలిసిందే. అయితే రామభక్తుల మద్దతు, దీవెనలు తమకు ముఖ్యమని ఆయన అన్నారు. రామ ట్రస్టు వ్యూహాలు త్వరలో ఆచరణలోకి రానున్నట్లు ఆయన చెప్పారు. ట్రస్టు సభ్యులతో మీటింగ్ నిర్వహించిన తర్వాత ఇవాళ జితేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడారు. భక్తుల విశ్వాసం, దీవెనలు తమ పట్ల ఉండాలని ఆశిస్తున్నట్లు మిశ్రా తెలిపారు. రామభక్తుల ఆశీస్సులు తమకు ముఖ్యమన్నారు. మీ దీనవలు, నమ్మకంతోనే మేం ముందుకు వెళ్తామని, నాకు కొంత సమయం ఇవ్వండి అంటూ మిశ్రా అన్నారు. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మిశ్రాను తొలి సీఈవోగా నియమించిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య రామాలయ వ్యవహార శైలిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల్లో తమ వ్యూహాలు అమలులోకి రానున్నట్లు ఆయన చెప్పారు. వివిధ బృందాల సహాకారంతో ఆయోధ్య ఆలయంలో చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కీలకమైన నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తామన్నారు.

# సంక్షిప్త వార్తలు

## ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి ప్రధాని మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 4:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని నా స్నేహితురాలు అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు.

## కరాచీకి వెళ్తున్న రష్యానౌకపై డ్రోన్ దాడి




**మాస్కో, సెప్టెంబరు 4:** రష్యా నుంచి 23 మంది భారతీయులతో బయల్దేరిన ఓ నౌకపై డ్రోన్ దాడి జరిగింది. నోవోరోస్సిస్క్ నుంచి పాకిస్థాన్ నగరం కరాచీకి ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలో సిబ్బందికి వసతి కల్పించే ప్రాంతాన్ని డ్రోన్ ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేశారు. బుధవారం జరిగిన ఈ ప్రమాదం గురించి ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌యుఎస్‌యుఐ) ఎక్స్ వేదికగా వెల్లడించింది. నౌక సమీపంలో మరో డ్రోన్‌ను గుర్తించినట్లు తెలిపింది. ఈ ఘటన సమయంలో నౌకలో 23 మంది భారత నావికులు ఉన్నారని ఎఫ్‌యుఎస్‌యుఐ వెల్లడించింది.

## బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి

**కోల్‌కత్తా, సెప్టెంబరు 4:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

## ముగ్గురు పిల్లలతో మహిళా వెయిట్ లిఫ్టర్ ఆత్మహత్య



**ముంబయి, సెప్టెంబరు 4:** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో తీవ్ర విషాదకర సంఘటన చోటు చేసుకుంది. జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో సహా చారిత్రాత్మక నల్‌దుర్గ్ కోటపై నుండి దాదాపు 100 అడుగుల లోతైన లోయలోకి దూకేశారు. ఈ ఘటనలో అశ్విని మరియు ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె రెండున్నరేళ్ల కవల కుమార్తెలలో క్రాంతి అనే చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఈ ఘోర ప్రమాదం నుంచి మరో కుమార్తె వీరా తీవ్ర గాయాలతో బయటపడింది.

## ముడిచమురు చోరీకి యత్నం.. 37 మంది మృతి

**అబుజా, సెప్టెంబరు 4:** నైజీరియాలో పెను విషాదం చోటుచేసుకుంది. పైప్‌లైన్ నుంచి ముడిచమురును దొంగిలించేందుకు ప్రయత్నించిన 37 మంది విష వాయువులు పీల్చి మృతి చెందినట్లు సమాచారం. ఈ మృతుల సంఖ్యను అధికారులు ఇంకా ధ్రువీకరించ లేదు. రివర్స్ రాష్ట్రంలోని ఒక్రికా ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానిక పర్యావరణ సంస్థ తెలిపింది. అయితే ఎంతమంది చనిపోయారనే విషయాన్ని వెల్లడించలేదు. ఘటనపై దర్యాప్తు కొన సాగుతోందని రివర్స్ రాష్ట్ర పోలీసు ప్రతినిధి బ్లెస్సింగ్ కబోర్లో అగాబే తెలిపారు.

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మూడుసార్లు గుండెపోటు

**బీజింగ్, సెప్టెంబరు 4:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్యంపై కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆగస్టు నెలాఖరులో ఆయన కిర్గిజ్‌స్థాన్‌కు వెళ్లిన సమయంలో, విమానం నుంచి దిగుతూ భార్య పెంగ్ లియువాన్ చేతిని పట్టుకుని నెమ్మదిగా మెట్లు దిగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరు ఆయన ముఖం ఉబ్బినట్లు కనిపించిందని, నడకలోనూ ఇబ్బంది ఉన్నట్లు భావించారు. ఆయన ఆరోగ్యంపై టిబెట్, తైవాన్, ప్రవాస చైనీస్ వర్గాల్లో చర్చ మొదలైంది.

## భక్తజన సంద్రంగా కాణిపాకం ఆలయం



భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయ క్యూలైన్లు.

**కాణిపాకం, సెప్టెంబరు 4 , ప్రభాతవార్త:** వరుస సెలవులతో సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ దర్శనార్థం అశేషంగా తరలివచ్చిన భక్తులతో శుక్రవారం కాణిపాకం ఆలయం భక్త జనసంద్రంగా మారింది.సాధారణంగా వారంతపు రోజులు శని, ఆదివారాల్లో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శుక్ర. శని, ఆదివారాలు,వరుస సెలవు రోజులు, వారంతపు రోజులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల మాడా వీధుల్లో బారులు తీరి నిలబడ్డారు. అలాగే ఆలయ మాడా వీధులు, పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

## శివయ్య సేవలో సినీనటి నమిత




స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందిస్తున్న దృశ్యం

**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం సినీనటి నమిత కుటుంబసభ్యులతో కలసి పూజలు జరిపించుకున్నారు. ఆమె ఆలయానికి రాగా ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆమె ఆలయంలో నిర్వహించే ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా సహస్రలింగేశ్వరాలయం వద్ద ప్రత్యేక విఐపి పూజా టిక్కెట్టుతో పూజలు జరిపారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. పూజలు, దర్శనం తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఎఇఓ లోకేష్‌బాబు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును పిఆర్‌ఓ కార్యాలయానికి చెందిన రవి, రాజశేఖర్‌లు పర్యవేక్షించారు.

## తిరుమల సమాచారం

## తిరుమలేశునికి నాదమే నీరాజనం



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని వేకువజామున మేల్కొలిపే నాదం... సేద తీర్చే స్వరాలు...సుప్రభాతం నుండి ఏకాంతసేవ వరకు శ్రీవారి సేవలో మేళవాయిద్యాల విశిష్ట సంప్రదాయం సంతరించుకుంది.అడవి జంతువుల ధ్వనుల నుండి ఆలయ మేళవాయిద్యాల వరకు ఆ దేవదేవుని సేవలో తరతరాలుగా కొనసాగుతున్న మేళవాయిద్య సంప్రదాయం. శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమైనవి వేదం, నాదం, వాద్య నివేదనలు. వీటిలో నాదానికి విశేష ప్రాధాన్యం ఉంది. భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించే సంగీతాన్ని, కీర్తనలను స్వామివారు ఆలకిస్తారన్నది పండితుల విశ్వాసం. అందుకే తిరుమలలో నాదం కేవలం సంగీతం కాదు, అది స్వామివారికి సమర్పించే ఒక విశిష్టమైన కైంకర్యం. తాళ్లపాక అన్నమయ్య, పురందరదాసు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వంటి వాగ్గేయకారులు తమ సంకీర్తనలతో, ఆళ్వారులు తమ పాశురాలతో శ్రీవారిని ప్రసన్నం చేసుకున్నారు. తరువాత కాలంలో దేశం గర్వించదగ్గ సంగీత విద్వాంసులు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి మహనీయులు కూడా స్వామివారికి నాదనీరాజనం సమర్పించారు. శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణం. శ్రవణం అంటే వినడం అని అర్థం. భక్తులు సమర్పించే భక్తిగీతాలను, వేదఘోషను, వాద్య నాదాలను స్వామివారు ఆలకిస్తారనే భావనకు ఇది మరింత ప్రత్యేకతను ఇస్తుంది. పురాణాల ప్రకారం పూర్వకాలంలో శేషాచలం అడవుల్లోని వృషభం, ఏనుగు వంటి జంతువులు తమ అరుపులతో స్వామివారిని కొలిచేవని చెబుతారు. ఆ సంప్రదాయానికి ప్రతీకగా, అలాంటి శబ్దాలను ఉత్పత్తి చేసే వాద్యపరికరాలు తరువాత కాలంలో శ్రీవారి ఆలయంలో వినియోగంలోకి వచ్చాయి. వీటిలో వృషభానికి సంబంధించిన గౌరుగోలు, ఏనుగు ధ్వనిని పోలిన త్రిచిన్నం/త్రిశూల్‌నాల్ వంటి వాద్యపరికరాలు ఉన్నాయి. ఇలా ప్రకృతిలోని సహజ ధ్వనుల నుంచి ఆలయ కైంకర్యాల్లో భాగమైన మేళవాయిద్యాల వరకు ఒక విశిష్టమైన నాద సంప్రదాయం తిరుమలలో కొనసాగుతూ వస్తోంది... సుప్రభాతం నుంచి ఏకాంతసేవ వరకు నాదమే కైంకర్యం.. శ్రీవారి రోజువారీ పూజా కైంకర్యాల్లో నాదానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. తెల్లవారుజామున సుప్రభాతం ద్వారా స్వామివారిని మేల్కొలుపుతారు. స్వామివారు మేల్కొనే వేళ నుంచి వివిధ సేవలు, నైవేద్యాలు, ఊరేగింపులు, ఉత్సవాలు, చివరికి ఏకాంతసేవలో సేదతీరే వరకు నాదస్వరం, డోలు తదితర వాద్యాల నాదం శ్రీవారి ఆలయ నిత్యకైంకర్యాల్లో భాగంగా ఉంటుంది. శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాతం నుండి రాత్రి ఏకాంతసేవ వరకు మొత్తం 19 రకాల సంప్రదాయ వాద్యపరికరాలను వినియోగిస్తారు. వీటిలో డోలు, ముక్కువీణ, తిరిచినాళ్లు, గౌరుగోలు, సన్నడోలు, శృతి తదితర వాద్యాలు ఉన్నాయి.

## "గురుస్వామి" అంటూ పలకరిస్తున్నారు
## "ఇరుముడి"బ్లాక్‌బస్టర్ కావడం సంతోషం

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** "ఇరుముడి"చిత్రం బ్లాక్ బస్టర్ కావడం చాలా సంతోషంగా ఉందని సినీనటుడు సాయికుమార్ అన్నారు. ఈ చిత్రం తరువాత అందరూ తనను గురుస్వామి అంటూ పలకరిస్తున్నారని ఆప్యాయంగా తెలిపారు. మనవడి పుట్టువెంట్రుకలు తీయించేందుకు కుటుంబంతో కలసి శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చిన నటుడు సాయికుమార్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇంకా నటుడు ఆది మాట్లాడుతూ తొలిసారిగా 'ఈగోరాజా"తమిళ చిత్రంలో నటిస్తున్నట్లు తెలిపారు.

# ఆడపడుచులకు డిప్యూటీ సీఎం పవన్ 'శ్రావణ కానుక'

- పురుహూతికా అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ పంపిణీ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీ పురుహూతికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను శ్రావణ మాస కానుకగా పంపిణీ చేశారు. వ్రతంలో పాల్గొనేందుకు తెల్లవారుజామున నుంచే మహిళలు ఆలయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణాలు మహిళలతో కిక్కిరిసిపోయాయి. ప్రభుత్వం తరఫున పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి శివరామ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎస్. టి.వి రాజేశ్వర రావు, పిఠాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస్, ఏర్పాట్లను పర్యవేక్షించారు

**పట్టువస్త్రాలు సమర్పణతో ప్రారంభం:** వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ వ్రతాలలో పాల్గొన్న భక్తులు పులకరించగా చూపరులను వేదపండితుల సైతం భక్తిశ్రద్ధలతో పరవశించారు. మంత్రోచ్ఛరణల మధ్య వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి వ్రత పూజలను నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో కూర్చుని పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మీ దేవికి పసుపు, కుంకుమ, పుష్పాలతో పూజలు చేసి సుఖ సంతోషాలు కలగాలని ప్రార్థించారు.

**పవన్ ఆత్మీయతకు నిదర్శనంగా:** పిఠాపురం ఆడపడుచులతో తనకున్న అనుబంధాన్ని పవన్ కళ్యాణ్ మరోసారి రుజువు చేసుకున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని సుమారు 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను అందించడం ద్వారా వారిపై తనకున్న ఆప్యాయతను చాటుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు క్రమపద్ధతిలో కానుకలను పంపిణీ చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. సంప్రదాయ బద్ధంగా పూజలు శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతానికి విశిష్టత ఉండటంతో మహిళలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల తో కార్యక్రమం కొనసాగింది. పూజా కార్యక్రమం పూర్తయిన అనంతరం మహిళలకు ప్రసాదాలను అందించారు. ఆలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఒదూరి కిషోర్ కార్యక్రమ ఏర్పాట్లను వారు

# అపర భగీరథుడు చంద్రబాబు

**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** ఆంధ్రా పాలిట అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎంపి సిఎం రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నాడు రాష్ట్రాన్ని అడ్డగోలుగా కాంగ్రెస్ విభజించి వెతలు మిగిల్చితే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి ఏర్పాటు చేసి పూర్తి చేస్తున్నారని, దాంతో రాబోవు తరాలకు వరంగా మిగులుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధితోపాటు వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలోని వ్యవసాయాన్ని పటిష్టం చేయుటకు ప్రధాన నదులను అనుసంధానం చేయటం ఎంతో అవసరమని ఈ సత్యాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వైకాపా హయాంలో ప్రాజెక్టుల పేరుతో కాలయాపన చేయగా నేడు కూటమి ప్రభుత్వం 'మాటల ప్రభుత్వం కాదు. చేతల ప్రభుత్వమని నిరూపించిందని' వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం అభివృద్ధికి కేంద్ర అమలు చేస్తున్న 'ప్రసాద్ పథకం' ద్వారా ప్రత్యేక నిధులు సాధించి అభివృద్ధి పరుస్తామని సిఎం రమేష్ వివరించారు. ఈ సమావేశంలో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, బిజెపి జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.




శ్రీకాళహస్తిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రమేష్

# శ్రీవారి సన్నిధిలో గోమాతకు విశిష్ట స్థానం

### గోశాలలో గోకులాష్టమి గోపూజ

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** హిందు సంప్రదాయం ప్రకారం టిటిడి గోమాతలకు విశిష్ట స్థానం కల్పించింది. గోసంరక్షణకు టిటిడి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వర గోసంరక్షణ శాలలో శుక్రవారం ఉదయం గోపూజ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి ఇఓ ముద్దాడ రవిచంద్ర గోశాలలోని వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ గోమాత, దూడలకు నూతన వస్త్రాలు,పుష్పమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతలకు ప్రదక్షిణలు చేసి హారతి సమర్పించారు. స్వయంగా ఇఓ రవిచంద్ర గోమాత పాలను స్వయంగా పితికి, పవిత్రమైన ఆ పాలను ఆలయ అర్చకులకు అందించారు.

**7 కోట్ల సార్లు ఓం నమో వేంకటేశాయ":** ఈ సందర్భంగా అక్కడే "ఓం నమో వేంకటేశాయ" మహామంత్రాన్ని 7 కోట్ల సార్లు జపించిన జప పుస్తకాలను స్వామివారికి సమర్పించే కార్యక్రమాన్ని ఇఓ సందర్శించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపను కోరారు. గోమాత పూజ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన సంప్రదాయమని, గోమాతలో సమస్త దేవతా స్వరూపాలను దర్శించే గొప్ప ఆధ్యాత్మిక విశ్వాసం మన సంప్రదాయంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి, జెఇఓ ప్రభల గోపీనాథ్, గోశాల డైరెక్టర్ శివకుమార్, విఎస్ఓ గిరిధర్, ఇన్‌ఛార్జి డిఎల్ఓ జస్టిస్ వెంకట సుబ్బానాయుడు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి ఇతర అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# ఒక్క అధికారికి మూడు బాధ్యతలు

### పనిభారంతో ఇబ్బందులు

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో పదవీవిరమణతో ఖాళీలవుతున్న ఉద్యోగాలు భర్తీకాకపోగా ఉన్న అధికారులు, ఉద్యోగులపైనే అదనపు భారం పడుతోంది. ఇప్పటికే కొన్ని కీలకమైన విభాగాల్లో అధికారులు, ఉద్యోగుల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇదే సమయంలో టిటిడిలో విద్యుత్‌విభాగం కూడా కీలకమే. తిరుమలలో విద్యుత్‌విభాగంలో ఈస్ట్, సౌత్ ఏరియాలు విద్యుత్ సరఫరా, లైట్ల వెలుగులు మీద నిత్యం పర్యవేక్షణ విధులు ఒక అధికారియే చేయాల్సి వస్తుండటం తలకుమించిన భారంగా మారింది. ఒక అధికారి మూడు బాధ్యతలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తిరుమలలో విద్యుత్ విభాగం అవసరం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక డిప్యూటీ ఇఇ అధికారి రెండు ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా, మరమ్మతులు బాధ్యతలు చూడాల్సి వస్తోంది. ఇప్పుడు రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమయంలో ఏర్పాటుచేసే విద్యుత్‌దీపకాంతులు, రకరకాల విద్యుత్ కటౌట్లు కాంతులు సెట్టింగ్ ఏర్పాటులో తలమునకలై పనులు సాగించడంలో దృష్టి సారించాల్సి వస్తోంది. ఈ కీలక బాధ్యతలతో బాటు తిరుమలలో మరో ముఖ్యమైన బ్రాడ్ కాస్టింగ్ విభాగంకు కూడా డిప్యూటీ ఇఇకే బాధ్యత అప్పగించారు. దీంతో ఆ అధికారి పరిస్థితి,బాధ్యతలు ఏంటో టిటిడి వర్గాల్లో పెద్ద చర్చ మొదలైంది.తిరుమలలో భక్తుల అవసరాలకు సంబంధించి ప్రసారం చేయడానికి పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం చక్కగా నిర్వహిస్తున్నారు. రోజువారీ తిరుమలలో జరిగే ఆధ్యాత్మిక, ధార్మిక భక్తి కార్యక్రమాలు ప్రసారం కేంద్రం ద్వారా ప్రసారం అవుతుంది. మైక్ సెట్లు, ఎల్ఇడి స్క్రీన్ లోపాలు ,మరమత్తులు చేయడానికి నిరంతరం ఏర్పాటు చేసిన ప్రాంతాలు శ్రీవారి మెట్టు, అలిపిరి, తిరుమల టౌన్ షిప్ గాకుండా పాపవినాశనం వరకు పర్యవేక్షణ చేయాల్సి వస్తోంది. తీరా ఆ అధికారికి సిబ్బంది అక్కడి విభాగం డ్యూటీ రాకపోకలకు వాహనం లేకపోవడం గమనార్హం, రానున్న బ్రహ్మోత్సవాలు కోసం తక్షణం రెండు ఆడియో, రెండు టీవీ నాలుగు విధులు నిర్వహించే ఎఇని బ్రాడ్ కాస్టింగ్ ఇన్ ఛార్జ్ గా నియమిస్తే సులభంగా ఉంటుందని టిటిడి వర్గాల వాదన.




# గోకులాష్టమిన కాళీయమర్ధనుడికి అభిషేకాలు

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** గోకులాష్టమి పర్వదినాన్ని శుక్రవారం ఉద యం తిరుమలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గోగర్భం డ్యామ్ చెంతన కాళీయమర్ధనుడు అయిన శ్రీకృష్ణునికి ఉదయం పంచాభిషేకాలు చేశారు. అనంతరం అక్కడ ఉట్లోత్సం నిర్వ హించారు. ఆ తరువాత ప్రసాద వితరణ జరిగింది. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలిలో రాత్రి 8 నుండి 9గంటల నడుమ ఉగ్ర శ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి , శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం వేడుకగా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వైదికులు నివేదించారు. ఈ వేడుకల్లో టిటిడి ఇఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఓ భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ,అర్చకులు పాల్గొన్నారు.

**నేడు ఉట్లోత్సవం:** కృష్ణజన్మాష్టమి సందర్భంగా నేటి సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల మధ్య తిరుమలలో అత్యంత వైభవంగా ఉట్లోత్సవం జగరనుంది. మలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ ఈ ఉట్లోత్సవాన్ని తిలకిస్తారు. ఈ కారణంగా ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.



## కోటి కుటుంబాల చెంతకు ఇంటింటికి టిడిపి

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో తెలుగుదేశం పార్టీ గొప్ప మైలురాయి సాధించిందని టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు టిడిపి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. "ఇంటింటికీ తెలుగుదేశం 2026" కార్యక్రమం విజయవంతంగా కోటికి పైగా ఇళ్లకు తీసుకెళ్లిన కార్యకర్తలు, నేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఇంటింటి పర్యటనల్లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలను కలిసి వివరించిన తీరు చాలా బాగుంది. కోటి ఇళ్లు సందర్శించడమే కాకుండా ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తెలుగుదేశం కుటుంబానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

## బస్సు బుగ్గి..ప్రయాణికులు సురక్షితం

**అనంతపురం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు సమీపంలోని 44 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయింది. అయితే అదృష్టవశాత్తు డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న 33 మంది ప్రయాణీకులు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా క్షేమంగా బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుండి హైదరాబాద్‌కు వెళుతున్న ఇంటర్సిటీ సర్వీసెస్‌కు చెందిన టిజి13టి1985 బస్సు మిడుతూరు గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ సిద్దయ్యస్వామి వెంటనే బస్సును నిలిపివేశాడు. భయాందోళనలో ఉన్న ప్రయాణికులు వెంటనే బస్సును దిగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో డ్రైవర్‌తో పాటు అతని అసిస్టెంట్లు ముగ్గురు, 33 మంది ప్రయాణీకులు క్షేమంగా ఎలాంటి ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాద సంఘటన తెలుసుకున్న గుంతకల్లు డిఎస్‌పి శ్రీనివాస్, పెద్దవడుగూరు సిఐ నరేందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు పరిశీలిస్తున్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

## తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ
### సిల్వర్ జూబ్లీపై తపాలకవర్




**తిరుపతి,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ 25 సంవత్సరాల ఆధ్యాత్మికతకు గుర్తుగా తపాల శాఖ తిరుపతిలో ప్రత్యేక తపాల కవర్ ఆవిష్కరించింది. దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా వినాయక చవితి పండుగను సామూహిక నిమజ్జన మహోత్సవాన్ని ఏటా క్రమశిక్షణతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంది. గత 25 సంవత్సరాలుగా తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ చేస్తున్న కృషికి తపాలశాఖ ప్రత్యేక గుర్తింపు నిచ్చింది. మన పండుగలు మన సంస్కృతి ఆదర్శంగా నిలుస్తున్నదని వక్తలు తెలిపారు. 25వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా తపాలా శాఖ సహకారంతో ప్రత్యేక పోస్టల్ కవర్లు ఆవిష్కరించుకోవడం గొప్ప అనుభూతినిస్తోందని కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ తెలిపారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలు సవాల్‌గా...
### తిరుమల శ్రీవారి ఆలయడిప్యూటీ ఇఓగా భాస్కర్

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** అనుభవం,అర్హత పరమావధిగా అంకితభావసేవలకు నిదర్శనంగా విధులు నిర్వహిస్తున్న టిటిడి తిరుమలలోని వసతికల్పనవిభాగం డిప్యూటీ ఇఓ (ఆర్1)లో బాధ్యతలు నిర్వహిస్తున్న భయ్యాల భాస్కర్‌ను ఆలయ డిప్యూటీ ఇఓగా టిటిడి నియమించింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆయన పూర్తిస్థాయిలో అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదివరకు శ్రీవారి ఆలయ పూర్వ డిప్యూటీ ఇఓగా ఉన్న లోకనాథంను ఎసిబి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ చేయడంతో ఆ స్థానంలో భాస్కర్‌కు అవకాశం కల్పించింది. దీంతో ముఖ్యమైన బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయ పరిపాలన పరమైన సేవలకు, భక్తుల సేవల నిర్వహణకు ఎలాంటి అంతరాయం కలగకుండా టిటిడి అధికారులు అప్రమత్తమయ్యారు. కొండపై వసతి కల్పన విభాగంలో మంచి అనుభవం ఉన్న భాస్కర్‌ను తక్షణమే ఆలయ అదనపు బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలిచ్చింది. ఈయన పరిధిలోకి లడ్డూల తయారీ కేంద్రం (పోటు), ఆలయం లోపల జరిగే అర్జిత సేవలు, శ్రీవారి హుండీ పరకామణి వంటి అత్యంత కీలకమైన విభాగాలు వస్తాయి. ఆలయ డిప్యూటీ ఇఓగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టడం భాస్కర్‌కు ఒక పెద్ద సవాల్ కానుంది.

## అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యానికి కేంద్రం
## శేషాచలంలో రాతి నీటి వంతెన
### ఆధునిక ఇంజనీర్లకు మచ్చుతునక



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శేషాచలం దట్టమైన అడవులు చిత్తూరు-తిరుపతి, కడప-అన్నమయ్య జిల్లాల సరిహద్దు ఎర్రచందనానికి ఆధ్యాత్మికతకే కాదు. మన పూర్వీకుల అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యానికి కూడా నిలువెత్తు నిదర్శనంగానే నిలిచింది. 16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య కాలంలో శ్రీకృష్ణదేవరాయల పాలనలో తిరుమల అటవీ ప్రాంతంలో నీటి ఎద్దడిని నివారించడానికి నిర్మించిన అరుదైన నీటి నిర్వహణ వ్యవస్థలు నేటికీ చెక్కుచెదరకుండా ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ ఇంజనీరింగ్ నైపుణ్యం అప్పట్లోనే ఎలా సాధ్యమైందనేది ఆధునిక ఇంజనీర్లే ఆశ్చర్యపోతున్నారు. చిన్న చిన్న కనుమ మార్గాల ద్వారా అనుసంధానంతో కొండలపై కురిసే ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసిపట్టాలనే దూరదృష్టితో నిటారైన కొండ రాళ్ళను సుత్తిపారలతో తొలిచి కిలోమీటర్ల కొద్దీ ప్రవాహ మార్గాలను నిర్మించారు. అడవుల్లోని ఎత్తైన లోయల నుండి నీరు ప్రవహిస్తూ కింద ఉన్న దిగువ చెరువులు, దిగుడు బావులు, జలాశయాలు, ఆలయ కోనేరులను చేరుకునేలా నీటితో పాటు కొండరాళ్ల ఊట నీరు కూడా వృథా కాకుండా ఈ రాతి కాల్వల్లోకి చేరేలా చిన్న చిన్న కనుమ మార్గాలను కూడా అనుసంధానించడం విజయనగర కాలపు జల నిర్వహణ నైపుణ్యానికి తార్కాణం. రాళ్ళు కిందకు కొట్టుకురాకుండా నేటి ఆధునిక కాలంలో వాడుతున్న శాటిలైట్ మ్యాపింగ్, లేజర్ సర్వే పరికరాలు లెవలింగ్ సాధనాలు ఏవీ లేని ఆ రోజుల్లోనే కొండల సహజమైన వాలును అంగుళం కూడా తేడా లేకుండా అంచనా వేసి ఈ నిర్మాణాలు చేపట్టిన తీరు అత్యంత ప్రతిష్టాత్మకం. కొండ రాళ్ల మధ్య నీటి ప్రవాహ వేగాన్ని క్రమబద్ధీకరిస్తూ, వర్షపు నీటితో పాటు వచ్చే ఒండ్రు మట్టి గానీ రాళ్లు కిందకి కొట్టుకురాకుండా సహజ వడపోత జరిగేలా నిర్మించిన ఈ కాలువల నిర్మాణం నేటి సివిల్ ఇంజనీర్లను సైతం ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. రాతి కాలువల మధ్యలో నీరు లీక్ కాకుండా ఉండేందుకు రాళ్ళను కలుపుతూ ప్రత్యేకమైన సాంప్రదాయ కారాన మిశ్రమాన్ని వాడేవారు. సున్నం, బెల్లం, కరక్కాయ, జిగురు, గుడ్డు తెల్లసొన వంటి పదార్థాల కలయికతో తయారుచేసిన ఈ లేపనం శతాబ్దాల పాటు నీటిలో ఉన్నా పాడవకుండా, నీరు లీకవకుండా చూస్తోంది. శతాబ్దాలు గడిచినా శేషాచలం దట్టమైన అడవుల్లో ప్రాచీన రాతి శిథిలాల మధ్య దాగి ఉన్న ఈ రాయల కాలపు రాతి కాలువలు మన పూర్వీకుల దూరదృష్టికి, వర్షపు నీటి సంరక్షణ ప్రణాళికకు, అద్భుత శిల్పకళా నైపుణ్యానికి తార్కాణంగా నిలుస్తున్నాయి.

5-9pg7exHMNWJQE:5-9pg7exHMNWJQE.qxd 9/5/2026 12:11 AM Page 1



# ఘనంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడి జన్మదిన వేడుకలు

## రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన ఎంపి విజయ్



**విశాఖపట్నం,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి 70వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి లో రిబ్బన్ కట్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీ విజయ్ స్వయంగా మొదటిగా రక్తదానం చేసి తన సేవానిరతిని చాటుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య ఆయన యువతకు ఆదర్శంగా నిలిచి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీ చింతకాయల విజయ్ మాట్లాడుతూ.. 1994లో అయ్యన్నపాత్రుడు ఆర్అండ్‌బి మంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన ఓ విశిష్టమైన పిలుపును గుర్తుచేశారు. ఆ రోజుల్లో ఇంటర్నెట్, సెల్‌ఫోన్లు లేకపోయినా, తన పుట్టినరోజుకు శుభాకాంక్షలు చెప్పే బదులు రక్తదానం చేయాలని ఆయన కోరారని విజయ్ తెలిపారు. అప్పట్లో కృష్ణా బజార్, ఒకటో వార్డుకు చెందిన అయ్యన్న యూత్ సభ్యులు ప్రారంభించిన ఆ రక్తదాన స్ఫూర్తి, నేటి ఆధునిక కాలంలోనూ ఏకధాటిగా కొనసాగడం ఎంతో సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నేటి తరం (జెన్‌జి) యువత కూడా సుమారు 70 శాతం మేర ముందుకు వచ్చి రక్తదానం చేస్తుండటం అభినందనీయమని ఎంపీ విజయ్ కొనియాడారు. అయ్యన్నపాత్రుడి పుట్టినరోజు సందర్భంగా అందిస్తున్న బ్లడ్ బ్యాంక్ సేవల ద్వారా ఇప్పటివరకు 45 వేల పైచిలుకు ప్రాణాలు కాపాడబడ్డాయని ఆయన వివరించారు. యువతను చూసి స్ఫూర్తి పొందిన తాను కూడా ఈరోజు గర్వంగా రక్తదానం చేశానని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, తన కుమారుడు శివన్ పాత్రుడి జన్మదినం కూడా నేడే కావడం తనకు విశేష ఆనందాన్నిస్తోందని ఎంపీ చింతకాయల విజయ్ సంతోషం వ్యక్తం చేశారు.

# సాగునీటి ప్రాజెక్టుల పేరు ఎత్తే అర్హత జగన్‌కు లేదు

## ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ మొదలుకుని ఉత్తరాంధ్ర వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రతిసారీ రాష్ట్రంలో సాగునీటి రంగానికి కొత్త కళ, కొత్త వెలుగులు వస్తాయి. నిలిచిపోయిన ప్రాజెక్టులను పరుగులు పెట్టించే సమర్థత, సంకల్పం ఆయనకే సొంతం. ఎందరో ముఖ్యమంత్రులను చూశాం కానీ, ప్రాజెక్టులపై ఇంతటి అంకితభావం ఉన్న నాయకుడు మరొకరు లేరు. రాయలసీమకు అదనపు జలాలు తీసుకురావాలని సంకల్పించిన మహనీయుడు నందమూరి తారక రామారావు ఆ మహానుభావుడి ఆశయాలను, ఆకాంక్షలను నేడు క్షేత్రస్థాయిలో నిజం చేసి చూపిస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడు గారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల దాహార్తిని, సాగునీటి కష్టాలను తీర్చే జీవనాడి హంద్రీ నీవా ప్రాజెక్టు. 2024లో అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలోనే దాదాపు ..8,000 కోట్లు ఖర్చు పెట్టి పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. 20142019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసమే ..12,484 కోట్లు ఖర్చు చేశాం. ఆ తర్వాత వచ్చిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తిగా గాలికొదిలేసి, ఐదేళ్లలో కేవలం ..2,000 కోట్లు మాత్రమే విదిల్చింది. సీమ ప్రజల ప్రయోజనాలను వైఎస్సార్సీపీ తుంగలో తొక్కింది. రాయలసీమను సస్యశ్యామలం చేసి, కరవును శాశ్వతంగా తరిమికొట్టేందుకు చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా (నేటి మార్కాపురం ప్రాంతం) ప్రజల 30 ఏళ్ల చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ కృష్ణా జలాలను అందించిన ఘనత, అలాగే ఉత్తరాంధ్ర ప్రజల దాహార్తి, సాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి జలాలను అక్కడికి తరలించిన తొలి నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారేనని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శతాబ్దాలుగా కరువుతో అల్లాడుతూ, కనీసం తాగడానికి గుక్కెడు నీరు లేక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు పవిత్ర గోదావరి, కృష్ణా జలాలను మళ్లించి ఆయా ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి చంద్రబాబు గారు బాటలు వేశారు. మొన్న వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభించి కృష్ణా జలాలు విడుదల చేస్తే, నిన్న పోలవరం నుంచి గోదావరి నీళ్లను ఉత్తరాంధ్రకు తరలిస్తే... ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి అండ్ కో విషం జిమ్ముతోంది. తామేదో చేసేశామని, చంద్రబాబు గారు క్రెడిట్ చోరీ చేస్తున్నారని అవాకులు చవాకులు పేలడం హాస్యాస్పదం. ఈ రాష్ట్రంలో రాయలసీమ అయినా, కోస్తా అయినా, ఉత్తరాంధ్ర అయినా సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత, నైతిక హక్కు ఒక్క చంద్రబాబు నాయుడు గారికి మాత్రమే ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి పాలనలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పడకేశాయి. ఏ ఒక్క ప్రాజెక్టుకూ సరైన నిధులు విడుదల చేయకుండా, పనులను స్తంభింపజేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. 1996లో వెలుగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేసింది చంద్రబాబు నాయుడు గారే. మళ్లీ 2026లో ఆయన చేతుల మీదుగానే ఉమ్మడి ప్రకాశం/మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు విడుదలయ్యాయి. చంద్రబాబు గారి హయాంలో మొత్తం రూ. 5,233 కోట్లు వెచ్చించింది. 1996 నుంచి 2004 వరకు: రూ. 430 కోట్లు, 2014 నుంచి 2019 మధ్య: రూ. 1,814 కోట్లు, 2024 నుంచి ఇప్పటివరకు: రూ. 2,989 కోట్లు ఖర్చుపెట్టారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ. 1,126 కోట్లు, ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి హయాంలో కేవలం రూ. 841 కోట్లు విదిల్చింది. రూ. 5,233 కోట్లు ఖర్చు పెట్టి, ప్రాజెక్టును రాత్రింబవళ్లు పరుగులు పెట్టించి, రైతులకు, ప్రజలకు కృష్ణా జలాలు అందించిన చంద్రబాబు నాయుడు గారు గొప్పా? లేక తన ఐదేళ్ల పాలనలో కేవలం రూ. 841 కోట్లు ఖర్చు చేసి, పనులు పూర్తి కాకుండానే ఏదో జాతికి అంకితం చేశామని కల్లబొల్లి మాటలు చెప్పిన జగన్మోహన్ రెడ్డి గొప్పా? ఇందులో అసలైన "క్రెడిట్ చోరీ" ఎవరిదో ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రాజెక్టుల విధాత చంద్రబాబు నాయుడు గారిపై బురదజల్లే కుట్రలను ప్రజలు ఎప్పటికీ నమ్మబోరని కాలవ శ్రీనివాసులు తేల్చిచెప్పారు

# యూట్యూబ్ ఛానెల్ రిపోర్టర్ రిమాండ్‌కు తరలింపు



**కోవూరు (నెల్లూరు), సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** ఫోర్త్ ఎస్టేట్ ఛానెల్ సీఈవో శ్రావణ్‌కుమార్ ఇటీవల కోవూరులో సిమెంట్ రోడ్డు వేస్తున్న టవి కుమార్ అనే కాంట్రాక్టర్‌ను రూ. 5 లక్షలు ఇవ్వాలని బెదిరించిన కేసులో శుక్రవారం శ్రావణ్‌ను కోవూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి న్యాయవాది ముందు హాజరు పరచగా రిమాండ్‌కు తరలిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కోవూరు పోలీస్‌స్టేషన్ ముందు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ స్టేషన్‌లోకి వెళ్లి శ్రావణ్‌కుమార్‌కు ధైర్యం చెప్పి వచ్చారు. అనంతరం శ్రావణ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు.

# స్వచ్ఛ గోదావరి లక్ష్యం!

- సంపూర్ణ కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతేక కార్యాచరణ
- అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాల్లు థీమ్‌తో గోదావరి పుష్కరాలకు సిద్ధమవుతున్న వేళ గోదావరి నదిని సంపూర్ణ కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గోదావరిలో డ్రెయిన్ల ద్వారా కలుస్తున్న కాలుష్య కారక వ్యర్థాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నాటికి గోదావరి పవిత్రత ఉట్టిపడేలా, భక్తులు స్వచ్ఛమైన జలాల్లో స్నానమాచరించే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రాజమహేంద్రవరం నుంచి అంతర్వేది వరకు, గోదావరి నదిలో కలుస్తున్న అన్ని ప్రధాన, ఉప డ్రెయిన్లపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో దాదాపు 15 ప్రధాన డ్రెయిన్లు, 45 వరకు మైనర్ డ్రెయిన్లు గోదావరి నదిలో కలుస్తున్నాయని, వాటి ద్వారా చేరుతున్న మురుగు, పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర కాలుష్య కారకాలపై శాస్త్రీయ విశ్లేషణ జరగాలని సూచించారు. యనమదుర్రు వంటి డ్రెయిన్లు పారిశ్రామిక ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థ జలాలను వెంట తీసుకుని వశిష్ట గోదావరిలో కలుస్తున్నాయని, అలాగే రామచంద్రపురం పరిసర ప్రాంతాల మురుగు టేకి మేజర్ డ్రెయిన్ ద్వారా, అమలాపురం ప్రాంత వ్యర్థాలు కుమ్మర కాలువ ద్వారా, ధవళేశ్వరం సమీపంలోని వ్యర్థాలు గోరింకల డ్రెయిన్ ద్వారా గోదావరిలోకి చేరుతున్న విషయాన్ని ప్రస్తావించారు. పట్టణ ప్రాంతాల మురుగుతోపాటు గోదావరి తీరం వెంబడి ఉన్న 262 గ్రామ పంచాయతీల నుంచి వెలువడే మురుగుకు కూడా గోదావరి నదే అంతిమ గమ్యస్థానంగా మారడం ఆందోళనకర అంశమన్నారు. ప్రతి డ్రెయిన్‌లో క్రమం తప్పకుండా నీటి నమూనాలు సేకరించి కాలుష్య స్థాయిలను నిర్ధారించాలని, జీవ రసాయన ఆక్సిజన్ (బీవోడీ), రసాయన ఆక్సిజన్ , ఘన వ్యర్థాలు, భారీ లోహాలు, హానికరక రసాయనాల వంటి అంశాలపై విశ్లేషణ చేపట్టాలని ఆదేశించారు. పారిశ్రామిక వ్యర్థాలు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయబడుతున్నాయా లేదా అనే అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలని, డ్రెయిన్ల నుంచి వ్యర్థ జలాలు గోదావరిలో కలిసే ముందు శుద్ధి కావాలని స్పష్టం చేశారు. డ్రెయిన్ల ద్వారా గోదావరిలో కలుస్తున్న వ్యర్థాల స్వరూపం, కాలుష్య స్థాయిలు, కాలుష్యానికి కారణమవుతున్న వనరులు, ప్రస్తుతం అమలులో ఉన్న శుద్ధి చర్యల ప్రభావం వంటి అంశాలపై నిరంతరం అధ్యయనం చేపట్టాలని, పరిమితికి మించి కాలుష్యాన్ని గుర్తించిన సందర్భాల్లో తక్షణం నియంత్రణ చర్యలు చేపట్టాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. గోదావరి కాలుష్య నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని తెలిపారు. అవసరమైతే కాలుష్య నియంత్రణ చర్యల కోసం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి విడుదల చేసిన రూ.100 కోట్ల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ సమన్వయకర్తగా, పురపాలక, పంచాయతీరాజ్ . గ్రామీణాభివృద్ధి, పరిశ్రమల శాఖ, వ్యవసాయ, మత్స్యశాఖల కమిషనర్లు, జలవనరులు, గ్రామీణ నీటి సరఫరా శాఖల చీఫ్ ఇంజినీర్లు, గోదావరి పరివాహకంలోని ఆరు జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉండే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కాలుష్య నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలను నిరంతరం సమీక్షించాలని దిశా నిర్దేశం చేశారు. గోదావరి తీరప్రాంత గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే జీరో లిక్విడ్ డిశ్చార్జ్ లక్ష్యంతో చర్యలు ప్రారంభించినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. పుష్కరాల నాటికి ఈ గ్రామాలను "మోడల్ పుష్కర పంచాయతీలు"గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ప్రాంతంలోనూ శుద్ధి చేయని మురుగు నీరు గోదావరిలో కలవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గోదావరి నది ప్రక్షాళనను అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా తీసుకున్నామని, స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు" అనే థీమ్‌తో సమగ్ర కార్యాచరణ కొనసాగుతుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. గోదావరి ప్రక్షాళన విజయవంతంగా పూర్తైన అనంతరం కృష్ణా నదితో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నదులను కూడా కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెప్పారు. భవిష్యత్తులో జరిగే కృష్ణా పుష్కరాలను కూడా ఇదే థీమ్‌తో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

# డోకిపర్రు మహాక్షేత్రంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన వ్రత పూజ సుమారు రెండు గంటలకు పైగా జరిగింది. పూజలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధ, నిర్వాహకులు కె. బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, కుటుంబసభ్యులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన మహిళా భక్తులు వేల మంది పాలు పంచుకున్నారు. వరలక్ష్మీ ౖ పూజను పురస్కరించుకుని డోకిపర్రు మహాక్షేత్రాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ పూజా సామాగ్రి, ద్రవ్యాలను ఆలయ ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఉచితంగా అందించారు.పూజలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు వరుసల్లో కూర్చొని ఆచరించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ మండపం, వెయ్యి కాళ్ళ మండపం నిం డిపోవటంతో ఆరు బయట ఉన్న ఖాళీ స్థలంలో మహిళా భక్తులు పలు వరుసల్లో కూర్చొని పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మి వ్రత ప్రాశస్త్యాన్ని వేద పండితులు సోదాహరణంగా వివరించారు. స్త్రీలు సకల సౌభాగ్యాలతో ఉండాలని వారు ఆశీర్వదించారు. మహిళలకు స్త్రీమూర్తి ఐనటు వంటి విష్ణు వక్షస్థల నివాసి, శ్రావణ మాస లక్ష్మీ ఐన వరలక్ష్మికి ప్రతి ఏడాది శ్రావణ మాసం నాలుగో శుక్రవారం డోకిపర్రు మహాక్షేత్రంలో పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. తమ కోరికలు నెరవేరటంతో పాటు పుత్ర, పౌత్రాభివృద్ధి కోరుకుంటూ, సుమంగళిగా ఉండాలని మహిళలు ఈ విశేష పూజలు చేయటం జరుగుతుంది. శ్రావణ మాసంలోని నాలుగు శుక్రవారాల్లో తొలి మూడు శుక్రవారాలు ఏవైనా అవాంతరాల వల్ల వరలక్ష్మి పూజల్లో పాల్గొనలేని స్త్రీలు నాలుగో శుక్రవారం నాడు ఆలయంలో జరిగే పూజల్లో పాల్గొంటే మళ్లీ వచ్చే శ్రావణ మాసం వరకూ పూజలు చేసినంత పుణ్యం లభిస్తుందని ఆలయ వేద పండితులు వివరించారు. సాధారణంగా మనం ఇంట్లో ఒకసారి పూజచేస్తే అప్పటికి మాత్రమే ఫలం సిద్ధిస్తుంది. నిత్యం పూజలు జరిగే ఆలయంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతంలో ఒకసారి పాల్గొన్నా, ఆ చుట్టుపక్కల ఉన్నా అనంతమైనన్ని విడతలు పూజలో పాల్గొన్న ఫలం లభిస్తుంది. వరలక్షి ౖ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం ఉదయం లక్ష్మీ యాగం, మహాశాంతి హెమం నిర్వహించారు. పూజ అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. కృష్ణాష్టమి వేడుకలు.. మహాక్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఉత్సాహంగానిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. యువతీ యువకులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల



డోకిపర్రు ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు

# మెగా డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

- కర్నూలు జిల్లాలో అర్హత లేని అభ్యర్థికి ఎస్‌జిటి పోస్టు ఎలా ఇచ్చారు?
- జిఒ నంబర్-4 ఆధారంగా జరిగిన నియామకాలన్నింటినీ సిబిఐకి అప్పగించాలి
- డిఎస్సీ నుంచి ఎపిపిఎస్సీ వరకు అక్రమాల విధానం పాకిందని వైఎస్ జగన్ ఆరోపణ

**కర్నూలు, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** మెగా డిఎస్సీ నియామకాల్లో అర్హత లేని అభ్యర్థులకు ఉద్యోగాలు కట్టబెట్టారంటూ సాక్ష్యాలు బయటకు వస్తున్నప్పటికీ ఈ వ్యవహారంపై సిబిఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని వైఎస్సార్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర దర్యాప్తు జరిపించి, నిజాయితీపరులైన ఉద్యోగార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి ప్రశ్నలు సంధించారు. కర్నూలు అభ్యర్థి వ్యవహారంపై ప్రశ్నలు కర్నూలు జిల్లాలో ఒక అభ్యర్థికి అతని కేటగిరీ ప్రకారం టెట్‌లో 75 మార్కులు రావాల్సి ఉండగా 65 మార్కులు మాత్రమే వచ్చినప్పటికీ స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జిటి పోస్టు ఎలా ఇచ్చారని జగన్ ప్రశ్నించారు. సదరు అభ్యర్థికి వన్-టు-వన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించిన తర్వాత కూడా అర్హత లేదని తెలిసి ఉద్యోగం ఎలా కల్పించారని నిలదీశారు. దరఖాస్తు దశలోనే తిరస్కరణకు గురికావాల్సిన అభ్యర్థి.. ఆ తర్వాతి దశలను దాటి ఉద్యోగం పొందడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అధికారులతో ఈ వ్యవహారం చేయించిన 'అదృశ్య శక్తి' ఎవరో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో డిఎస్సీ-2025 నియామకాల్లో ఇలాంటి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పనిచేసే అధికారులతో నిర్వహించే విచారణలు నిజాయితీగా, స్వతంత్రంగా ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు ఆయన కింద పనిచేసే అధికారులు స్వతంత్రంగా విచారణ చేయగలరా అని నిలదీశారు.

**విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి:** డిఎస్సీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయించాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. అధికార బలంతో, అబద్ధాలు చెబుతూ, ప్రచార కార్యక్రమాలతో కుమారుడిని కాపాడే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. అక్రమాల విధానాన్ని డిఎస్సీ నుంచి ఎపిపిఎస్సీకి కూడా ప్రభుత్వం పాకించిందని జగన్ ఆరోపించారు. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నందునే ప్రభుత్వం సిబిఐ విచారణకు అంగీకరించడం లేదని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారాల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ ఉన్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. డిఎస్సీ లీకేజీ వ్యవహారం నుంచి స్పోర్ట్స్ కోటా వరకు, టెట్ అర్హతల నుంచి పోస్టింగ్ ఆర్డర్ల వరకు మొత్తం మెగా డిఎస్సీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిఒ నంబర్-4 ఆధారంగా జరిగిన నియామకాలన్నింటినీ కూడా సిబిఐ పరిధిలోకి తీసుకువచ్చి దర్యాప్తు చేయించాలని జగన్ మరోసారి డిమాండ్ చేశారు. నిజాయితీపరులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆడండి..గెలవండి..ప్రపంచాన్ని చూడండి

- క్రీడాకారులకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపు క్రీడల్లో ప్రతిభ చూపితే ప్రపంచ స్థాయికి ఎదిగే అవకాశాలు
- చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



**అల్లూరు (నెల్లూరు), సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** నెల్లూరు, అల్లూరులో శుక్రవారం ఏపి 12వ సీనియర్ల మహిళలు, పురుషుల అంతర్ జిల్లాల బాల్ బాట్‌మెంటన్ ఛాంపియన్‌షిప్ -2026 ప్రారంభోత్సవంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మూడు రోజులు పాటు రామక్రిష్ణ జూనియర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎంపి ప్రారంభించారు. యరబోలు మురళీక్రిష్ణరెడ్డి జ్ఞాపకార్థంగా చాంపియన్‌షిప్‌ను అల్లూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏంపి వేమిరెడ్డి ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో క్రీడలను ప్రోత్సహించేందుకు పిఎం నరేంద్రమోడీ, క్రీడల శాఖామంత్రి శ్రీమన్‌సుఖ్ మాండవీయు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు, యువత తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్కూల్‌గేమ్స్‌లో బాల్‌బ్యాట్‌మెంటన్‌ను తొలగించడం భాదాకరమని ఎంపి తెలిపారు. క్రీడాకారులు కోరిక మేరకు ఈ క్రీడను నేషనల్ గేమ్స్‌లో చేర్చేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. తాను చిన్నవయసులో ఏపి తరపున అండర్-19 క్రికెట్ ఆడినట్లు ఎంపి గుర్తుచేసుకున్నారు. ప్రతి విద్యార్థిని ప్రముఖ బ్యాట్‌మెంటన్ పివి.సింధును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె కూడా తమ స్థాయినుంచే ప్రారంభించి ప్రపంచస్థాయి క్రీడాకారిణిగా ఎదిగారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఎంపి సూచించారు. ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న అన్ని జిల్లాల క్రీడాకారులకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఏ క్రీడాకారులైన ఓడినా, గెలిచినా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్థానిక సుబ్బయ్య జడ్పిహైస్కూల్‌ను సందర్శించారు.

# ఇంటింటికి తెలుగుదేశం

## కోటి ఇల్లును సందర్శించిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు: పల్లా శ్రీనివాసరావు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమ్మ్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల పట్టుదలతో కేవలం 40 రోజుల్లోనే కోటి ఇళ్లను సందర్శించి రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనను, ప్రజలకు అందిన సంక్షేమ వివరాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతోపాటు సూపర్ సిక్స్ హామీ అమలు తీరును ప్రజలకు వివరించారు. పార్టీ కేడర్ ప్రజలతో మమేకం కావాలనే సంకల్పానికి ఈ కోటి ఇళ్ల సందర్శన మైలు రాయి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి రోజూ లక్షలాది కుటుంబాలను నేరుగా కలుస్తూ, ప్రజలతో మమేకం అవుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, రెండేళ్ల కూటమి పాలన విజయాలను వివరించడంతోపాటు ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ వారి సమస్యల పరిష్కార దిశగా పార్టీ శ్రేణులు కృషి చేశారు. ఈ మైలురాయి చేరుకోవడం పార్టీ నాయకులు, కార్యకర్తలదే క్రెడిట్. కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుండి నడిపిస్తున్న కార్యకర్తలకు అభినందనలు. ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనం. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.

# సంప్రదాయ క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

## కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని అందిస్తాయని, బిజీబిజీ జీవితంలో క్రీడలను భాగస్వామ్యం చేసుకోవడం అత్యంత అవసరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం ప్రగడ పుట్టుగ గ్రామంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు, ఎంపీ కప్-2026 వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, ఉలవల బస్తా ఎత్తే పోటీలు, ఉట్టి కొట్టే పోటీల్లో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక వ్యాయామంతో పాటు మానసిక ప్రశాంతత, ఉల్లాసం లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అంతరించిపోతున్న సాంప్రదాయ క్రీడలను పరిరక్షి ంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన ఉట్టి కొట్టే పోటీలు, బస్తా ఎత్తే పోటీలు వంటి గ్రామీణ క్రీడలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రగడ పుట్టుగ గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి సందేశాలు, విలువలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, తప్పెటగుళ్లు, కోలాటం, అంజి ఆటలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. బెందాళం అశోక్, ఇచ్ఛాపురం జనసేన ఇంచార్జ్ దాసరి రాజు, వంశధార ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, కూటమి శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కృతజ్ఞతలు

**విజయవాడ, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డి ఏ లు, ఐ ఆర్, పిఆర్సి కమిషన్ మరియు రెవెన్యూ శాఖ లో పనిచేస్తున్న రెవిన్యూ ఉద్యోగుల సమస్యల గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. శుక్రవారం ఆయన శుక్రవారం విజయవాడ రాష్ట్ర సచివాలయంలో మంత్రి అనగానిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి శనివారం ఉదయం 11 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీసులో ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి కి, ఈ మీటింగ్ ఏర్పాటు చేయడానికి కృషి చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు శ్రీ అనగాని సత్యప్రసాద్ గారికి కృతజ్ఞతలు, ధన్యవాదాలను భూపతిరాజు తెలిపారు. యజేసిన ఆంధ్ర ప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు. ఉద్యోగ సంఘాలతో జరిగే చర్చలు మంచి సానుకూల వాతావరణంలో ఉద్యోగులకు మేలు చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నిర్ణయం తీసుకోవాలని కోరిన ఆంధ్ర ప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్. భూపతిరాజు రవీంద్ర రాజు. ఏదో ఒక ఉద్యోగ సంఘం నాయకుడు అతిగా వ్యవహరించి కావాలని కూటమి ప్రభుత్వంపై మీ పై మీ కుటుంబ సభ్యులు పై వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యల గురించి మనసులో పెట్టుకోకుండా వారిని క్షమించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరినీ మీ, ప్రభుత్వంలో భాగస్వాములుగా,మీ కుటుంబ సభ్యులుగా భావించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ న్యాయం చేస్తారని ఒక సీనియర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీ మీద మాకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని భూపతిరాజు రవీంద్ర రాజు స్పష్టం చేశారు.

# లక్షమందికిపైగా ఉద్యోగులకు వోక్స్‌వ్యాగన్ ఉద్వాసన





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్ వ్యాగన్ భారీగా ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తొలగించేందుకు నిర్ణయిం చినట్లుగా ప్రకటిం చింది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుందని వెల్లడించారు. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం, కా ర్మిక సంఘాలు ఒక అంగీకారానికి వ చ్చాయని పేర్కొం ది. ఇందులో ఇప్పటికే 50 వేల ఉద్యోగాల కోతకు అంగీకరించగా తాజాగా మరో 50 వేల పోస్టులను తొలగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పింది. కంపెనీ చరిత్రలోనే కాకుండా ప్రపంచ ఆటోమొబైల్ రంగంలోనే ఇది అతిపెద్ద పునర్వ్యవస్థీకరణగా నిలవనుంది. కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగినట్లుగా ఉద్యోగుల సంఖ్యను క్రమబద్ధీకరించడం తప్పనిసరని ఫోక్స్‌వ్యాగన్ కంపెనీ పేర్కొంది. అమెరికా సుంకాలు, ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్‌లో హెచ్చుతగ్గులు, ముఖ్యంగా చైనాకు చెందిన సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ కారణంగా యూరప్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే లేఆఫ్స్‌కు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఫోక్స్‌వ్యాగన్ కంపెనీలో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోని దాదాపు 43 శాతం మంది విధులు నిర్వహిస్తున్నారు. ఆ కంపెనీ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతానికి సమానం అన్నమాట. ఈ ఉద్యోగాల కోతను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లుగా గతంలో వార్తలు వచ్చాయి. తాజా ప్రకటనలో మాత్రం కార్మిక సంఘాలు కూడా అంగీకరించినట్లు తెలపడం గమనార్హం. హ్యానోవర్, ఎమ్డెన్, జ్వికావ్, నెకార్సుల్మ్‌లోని నాలుగు జర్మన్ ప్లాంట్ల దీర్ఘకాలిక భవిష్యత్తుపై స్పష్టత లేదని కంపెనీ తెలిపింది. ఈ ప్లాంట్లకు ప్రత్యామ్నాయ వినియోగ మార్గాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. పూర్తి స్థాయి ప్లాంట్లను జర్మనీలో మూసివేయడం వోక్స్‌వ్యాగన్‌కు ఇదే తొలిసారి కానుందని కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్లాంట్ల మూసివేతపై ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఐజీ మెటల్ యూనియన్ స్పష్టం చేసింది. కార్మికులు, లోయర్ సాక్సనీ రాష్ట్రంతో కలిసి చర్చల ద్వారా రాజీ కుదిరిందని తెలిపింది.

5-9pg10:5-9pg10.qxd 9/5/2026 12:08 AM Page 1



# మహిళల టి20.. నేడే హై ఓల్టేజ్ మ్యాచ్





## చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ ఢీ

**దుబాయ్:** 2026 మహిళల ఆసియా కప్‌లో సెమీ ఫైనల్ స్థానాన్ని ఇప్పటికే ఖరారు చేసుకున్న ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ జట్టుకు, తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో నేడు హై ఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాక్‌తో జరిగే గ్రూప్ ఎ చివరి పోరులో తమ విధానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని టీమిండియా చూస్తోంది. దుబాయ్‌లోని నెమ్మదైన పిచ్‌లపై అసోసియేట్ జట్లు మరోసారి ఆ బలహీనతలను బయటపెట్టడంతో, భారత మిడిల్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం అనే అంశం పరిశీలనకు గురైనప్పటికీ, హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు పాకిస్థాన్‌పై గెలవడానికి స్పష్టమైన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆమె ఓపెనింగ్ భాగస్వామి షఫాలీ వర్మ, వరుసగా హాంకాంగ్ చైనా, థాయ్‌లాండ్‌లపై 124 మరియు 64 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌లో ఈ మ్యాచ్‌లోకి వస్తున్నారు. ముఖ్యంగా స్మృతి, గురువారం రాత్రి పలు రికార్డులు సృష్టించిన తర్వాత బరిలోకి దిగుతోంది. బౌలింగ్ విభాగంలో, పేసర్ నందినీ శర్మ క్రాంతి గౌడ్‌తో కలిసి వికెట్లు తీస్తూ ఆశాజనకంగా కనిపిస్తుండగా, దీప్తి శర్మ వికెట్ల వర్షం కురిపిస్తూనే ఉంది.

ఇదిలా ఉండగా, థాయ్‌లాండ్‌పై తొలి విజయం సాధించడంతో పాకిస్తాన్ సెమీఫైనల్స్ రేసులో నిలిచింది. కానీ వారి బ్యాటింగ్ బలహీనతలు ప్రధాన ఆందోళనగా మిగిలిపోయాయి. ఆట వేగాన్ని నిర్దేశించడానికి పాకిస్థాన్ ఇప్పటికీ టాప్ ఆర్డర్ వికెట్ కీపర్‌బ్యాటర్ మునీబా అలీ, కెప్టెన్ ఫాతిమా సనాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. కానీ, మరింత పటిష్టమైన భారత జట్టుతో పోటీపడాలంటే పాకిస్థాన్ తమ బ్యాటింగ్‌లో గణనీయమైన మెరుగుదల సాధించాల్సి ఉంటుంది. భారత్ జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), జి కమలిని (వికెట్‌కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని గవాల్, ప్రరంతి గవాల్ శర్మ, పాకిస్థాన్ జట్టులో ఫాతిమా సనా (కెప్టెన్), అయేషా జాఫర్, ఎమాన్ నసీర్, ఈమాన్ ఫాతిమా, గుల్ ఫిరోజా, మొమినా రియాసత్, మునీబా అలీ సిద్ధిఖీ (వికెట్‌కీపర్), సదాఫ్ షమాస్, నష్రా సుంధు, సాదియా ఇక్బాల్, సైరా జబీన్, షావాల్ జుల్ఫికర్, ఉమ్మహస్సాని, తుబాహసానా హస్సాన్ ఉన్నారు.





## క్రికెట్ చరిత్రలో తొలిసారి జపాన్‌తో టీమిండియా టి20

**న్యూఢిల్లీ:** ఏషియన్ గేమ్స్-2026 ప్రారంభానికి ముందే భారత్ క్రికెట్ జట్టు చారిత్రాత్మక మ్యాచ్ ఆడనుంది. భారత్, జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభానికి గుర్తుగా, భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెల 22న జపాన్‌తో తమ మొట్టమొదటి టి20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జపాన్‌తో ఏకైక టి20లో టీమిండియా తలపడనుంది. భారత్, జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడంలో భాగంగా ఈ ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ప్రకటించింది. జపాన్ ప్రధాని సనాయె తకైచి, భారత్ ప్రధాని నరేంద్రమోడీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇండియా, జపాన్ మధ్య క్రీడల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడమే దీని లక్ష్యమని బిసిసిఐ ఆ ప్రకటనలో తెలిపింది. కాగా జపాన్‌తో ఆడే భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ, సంజు సామ్సన్, జస్ప్రిత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లతో పాటు, వైభవ్ సూర్యవంశీ తదితరులు ఈ మ్యాచ్‌లో ఆడనున్నారు.

## ఇండొనేసియా మాస్టర్స్.. సెమీస్‌కు అన్మోల్

### అశ్మిత ఓటమి



**పాంటియానాక్:** ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీస్‌కు భారత్ షట్లర్ అన్మోల్ ఖర్బ్ చేరుకోగా, ప్రపంచ 81వ ర్యాంకర్‌తో అశ్మితా చలిహా ఓటమిపాలైంది. శుక్రవారం నాడు కాలిమంటన్‌లోని పొంటియానాక్‌లో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీఫైనల్స్‌కు చేరుకోవడానికి, మూడవ సీడ్ అన్మోల్ ఖర్బ్, చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ చింగ్ పింగ్‌తో మూడు గేమ్‌ల తేడాతో పోరాడి, చివరికి 21-121, 121-14 గెలుపొందింది. అన్మోల్, హువాంగ్‌ల మధ్య జరిగిన తొలి గేమ్ హోరాహోరీగా సాగింది. సగం గేమ్ పూర్తయ్యేసరికి ఆ ఇద్దరు షట్లర్ల మధ్య కేవలం ఒక్క పాయింట్ తేడా మాత్రమే ఉంది. ఆ తర్వాత అన్మోల్, తర్వాతి 14 పాయింట్లలో 10 పాయింట్లు గెలుచుకుని, గేమ్‌ను 21-14 తేడాతో కైవసం చేసుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గేమ్ 2 కూడా ప్రారంభంలో అదే రీతిలో సాగింది. కానీ ఈసారి విరామం తర్వాత హువాంగ్ పట్టు సాధించి మ్యాచ్‌ను 1-1తో సమం చేసింది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్, టాప్ సీడ్ అయిన అష్మిత చలిహాను 21-10, 21-18 తేడాతో ఓడించిన చైనాకు చెందిన ప్రపంచ 81వ ర్యాంకర్ జు వెన్ జింగ్‌తో అన్మోల్ తలపడనుంది.



ఆట




### చైనా మాస్టర్స్.. శ్రీకాంత్ నిష్క్రమణ

## సెమీ ఫైనల్స్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

**షెన్‌జెన్ (చైనా):** మాజీ ప్రపంచ నంబర్ 1, భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్, హాంకాంగ్‌కు చెందిన లీ చెక్ యియు చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోవడంతో, శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్‌లో అతని చైనా మాస్టర్స్ సూపర్ 750 ప్రయాణం ముగిసింది. మరోపక్క భారత్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి విజయంతో సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. శ్రీకాంత్ గట్టిగా పోరాడినా 16-21, 16-21 తేడాతో ఓడిపోవడంతో, ఈ టోర్నమెంట్‌లో భారత్ సింగిల్స్ ప్రస్థానం ముగిసింది. లీతో జరిగిన మ్యాచ్‌లో, శ్రీకాంత్ దూకుడుగా ప్రారంభించినప్పటికీ, ప్రత్యర్థిని ఎదుర్కొలేకపోయాడు. దీంతో లీ తొలి గేమ్‌పై పట్టు సాధించి, 21-16 తేడాతో ముగించాడు. రెండవ గేమ్ మరింత హోరాహోరీగా సాగింది, శ్రీకాంత్ గెలుపుకు చేరువలోనే నిలిచినా ఆట ముగింపు దశలో లీ 14-14తో స్కోరును సమం చేశారు. ఆ తర్వాత జరిగిన తొమ్మిది పాయింట్లలో ఏడింటిని హాంగ్ కాంగ్ షట్లర్ గెలుచుకోవడంతో, శ్రీకాంత్ కేవలం మరో రెండు పాయింట్లు మాత్రమే సాధించగలిగాడు. ఇక భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి శుక్రవారం డెన్మార్క్‌కు చెందిన కిమ్ ఆస్ట్రాప్-ఆండర్స్ స్కారుప్ రాస్ముస్సెన్‌లోకి 21-13, 16-21, 21-21, ప్రవేశించారు. ఆట ప్రారంభమైన మొదటి ఐదు నిమిషాల్లోనే ఇండియన్స్ 11-4తో ఏడు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించారు. ఆట రెండవ భాగంలో డేన్స్ కొంత ప్రతిఘటన చూపి, తమ స్కోరును రెండంకెల సంఖ్యకు పెంచుకున్నప్పటికీ వాటిని అధిగమించి భారత్ జోడీ 16 నిమిషాల్లోనే ఆటను ముగించారు.

## యుఎస్ ఓపెన్.. ముందంజలో జ్వెరెవ్



**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ మరో కఠినమైన ఐదు సెట్ల పోరులో ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటిన్ హాలిస్‌ను 6-4, 4-6, 7-6(3), 6-7(3), 6-3 తేడాతో ఓడించి, ఆర్థర్ ఆషే స్టేడియంలో మూడవ రౌండ్‌కు చేరుకున్నాడు. తన తొలి రౌండ్ విజయంలో నాలుగు గంటల 53 నిమిషాల పాటు కోర్టులో గడిపిన కేవలం రెండు రోజుల తర్వాత, నాలుగు గంటల 33 నిమిషాల పాటు సాగిన మరో అర్ధరాత్రి ఉత్కంఠభరితమైన పోరులో జ్వెరెవ్ మళ్లీ తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ప్రపంచ 52వ ర్యాంకర్ అయిన హాలిస్‌తో తలపడటానికి జర్మన్ ఆటగాడు కుదురుకోవడానికి సమయం తీసుకున్నాడు. కీలకమైన క్షణాల్లో జ్వెరెవ్ తన ఆట స్థాయిని పెంచుకోగా, హాలిస్ మాత్రం ఆ సందర్భాన్ని ఎదుర్కోవడంలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. 28 యేళ్ల జ్వెరెవ్ తదుపరి ప్రత్యర్థి చిలీకి చెందిన 25వ సీడ్ అలెజాండ్రో టబిలో. గత ఏడాది జరిగిన యూఎస్ ఓపెన్‌లో జ్వెరెవ్ మొదటి రౌండ్‌లో టబిలోను ఓడించాడు. ఎటిపి హెడ్‌టుహెడ్ రికార్డులో 2-0 ఆధిక్యంలో ఉన్నాడు. జ్వెరెవ్ ఈ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం, ఫ్రెంచ్ ఓపెన్ గెలవడం, వింబుల్డన్ ఫైనల్‌కు దూసుకెళ్లడం వంటివి చేశాడు. హాలిస్‌పై సాధించిన విజయంతో, ఈ ఏడాది 20 గ్రాండ్ స్లామ్ మ్యాచ్ విజయాలు నమోదు చేసిన తొలి పురుష ఆటగాడిగా నిలిచాడు. దీంతో 2026లో అతని మేజర్ రికార్డ్ 202కు చేరింది.



## ఆల్‌టైమ్ గరిష్ఠానికి భారత్ ఫారెక్స్ నిల్వలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు ఆగస్టు 28తో ముగిసిన వారంలో 11.475 బిలియన్ డాలర్లు పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠం 740.803 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. శుక్రవారం ఆర్బీఐ వెల్లడించిన వివరాలప్రకారం అంతకుముందు వారంలోనూ ఫారెక్స్ నిల్వలు 12.422 బిలియన్ డాలర్లు పెరిగి 729.328 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదే అప్పటివరకు రికార్డు గరిష్ఠంగా ఉంది. అంతకుముందు అత్యధికంగా 728.494 బిలియన్ డాలర్లు ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో నమోదయ్యాయి. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ప్రారంభం కావడానికి ముందు ఈ రికార్డు నమోదైన తర్వాత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా రూపాయి విలువపై ఒత్తిడి పెరగడంతో పాటు, రూపాయిని స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ల విక్రయాలు చేపట్టింది. దీంతో వరుసగా కొన్ని వారాల పాటు దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు తగ్గాయి. దేశీయ కరెన్సీపై తీవ్ర ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో జూన్‌లో ఆర్‌బీఐ రాయితీతో కూడిన ఫారెక్స్ స్వాప్ చర్యలను ప్రకటించిన తర్వాత నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ చర్యల ద్వారా 132 బిలియన్ డాలర్లకు పైగా కొత్త నిధుల ప్రవాహం వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 28తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన ఫారెక్స్ కరెన్సీ ఆస్తులు 9.337 బిలియన్ డాలర్లు పెరిగి 600.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్లలో లెక్కించిన ఫారెక్స్ కరెన్సీ ఆస్తుల విలువలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికా డాలర్‌యేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల, తగ్గుదల ప్రభావాలు కూడా ఉంటాయి. ఇదే సమయంలో దేశ బంగారం నిల్వల విలువ 2.191 బిలియన్ డాలర్లు పెరిగి 116.409 బిలియన్ డాలర్లకు చేరుకుంది. మరోవైపు, ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు అంటే ఎస్డీఆర్‌లు 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిదిసంస్థ ఐఎంఎఫ్‌లో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 11 మిలియన్ డాలర్లు తగ్గి 4.914 బిలియన్ డాల ర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.

## అడోబ్ సిఇఒగా అనిల్ చక్రవర్తి



**ముంబయి, సెప్టెంబరు 4:** టెక్ దిగ్గజం అడోబ్‌కు కొత్త సీఈవో రానున్నారు. భారత సంతతికి చెందిన అనిల్ చక్రవర్తి సంస్థ అధ్యక్షుడు, సీఈవోగా బాధ్య తలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో శంతను నారాయణ్ 18 ఏళ్ల తర్వాత పదవి నుంచి తప్పుకోనున్నారు. డిసెంబర్ 1న అనిల్ చక్రవర్తి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. అదే సమయంలో అడోబ్ బోర్డులోనూ చేరనున్నారు. శంతను నారాయణ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. మార్పిడి ప్రక్రియలో అనిల్ చక్రవర్తితో కలిసి పనిచేయనున్నారు. అనిల్ చక్రవర్తి అనుభవజ్ఞుడైన నాయకుడని, విలువలు, నిజాయతీతో పనిచేస్తారని శంతను నారాయణ్ ప్రశంసించారు. అడోబ్ వ్యాపారంపై ఆయనకు లోతైన అవగాహన ఉందని తెలిపారు. అనిల్ చక్రవర్తి 2020జనవరిలో అడోబ్‌లో చేరారు. అంతకు ముందు 2015 నుంచి 2020 వరకు ఇన్ఫర్మాటికా సీఈవోగా పనిచేశారు. అడోబ్‌లో చేరిన తర్వాత డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆర్కెస్ట్రేషన్, వరల్డ్‌వైడ్ ఫీల్డ్ ఆపరేషన్స్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. అనిల్ చక్రవర్తి ఐఐటీ బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. అనంతరంఅమెరికాలోని ఎంఐటీ నుంచిఎంఎస్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. సిమాంటెక్, వెరిసైన్,మెకిన్సీ వంటి సంస్థల్లోనూ బాధ్యతలు నిర్వహించారు.

## రూ.40వేల కోట్లమేరకు జియో ఐపిఒ

వాణిజ్యం





**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓకు రంగం సిద్ధమవుతోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్, టెలికాం విభాగం రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ భారీ పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు చేస్తోంది. నవరాత్రి, దీపావళి పండుగల సీజన్‌లో సుమారు రూ.37,000-40,000 కోటు విలువైన మెగా ఐపీఓను తీసుకురావాలని కంపెనీ భావిస్తున్నది. ఇప్పటికే సెబీ నుంచి డ్రాఫ్ట్ పేపర్లకు అనుమతి లభించడంతో జియో ప్లాట్‌ఫామ్స్ తుది తేదీలను ఖరారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. తర్వాత దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు భారీ స్థాయిలో రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ ఐపీఓ పూర్తయితే ఇప్పటి వరకు భారత్‌లో లిస్ట్ అయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఇక జియో ఐపీఓను అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ తొలి వారంలో తీసుకురావచ్చని మార్కెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నవరాత్రి పండుగ రోజుల్లోనే ఐపీఓను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ ఆ సమయంలో సాధ్యం కాకపోతే దీపావళి పండుగను టార్గెట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. జియో ప్లాట్‌ఫామ్స్ ముందుగా అంతర్జాతీయ రోడ్‌షోలు, ఆ తర్వాత దేశీయ రోడ్‌షోలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దాదాపు మూడు వారాల పాటు విదేశాల్లో, రెండు వారాల పాటు దేశీయంగా రోడ్‌షోలు నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ద్వారా సుమారు రూ.37,800 కోట్లు సమీకరించే అవకాశం ఉందని బ్యాంకర్లు అంచనా వేస్తున్నారు. భారత ప్రైమరీ మార్కెట్‌లో సరికొత్త రికార్డుగా నిలవనుందని చెబుతున్నారు. ప్రస్తుతం హ్యుందాయ్ మోటార్ ఇండియా 2024లో తీసుకొచ్చిన సుమారు రూ.27,000 కోట్ల ఐపీఓ దేశంలో పూర్తయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఉంది. అంతకంటే పెద్దగా జియో ఐపీఓ నిలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపీఓ విలువ కంటే కూడా జియో ఇష్యూ పెద్దదిగా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ 270 మిలియన్ల వరకు కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని ప్రతిపాదించింది. ఇవి ఐపీఓ అనంతరం కంపెనీ ఈక్విటీ క్యాపిటల్‌లో సుమారు 2.9 శాతం వాటాను సూచిస్తాయి. ఈ ప్రతిపాదిత ఐపీఓలో ఆఫర్ ఫర్ సేల్ ఉండదని సమాచారం. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రిలయన్స్ గ్రూప్ నుంచి వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం మరో ప్రత్యేకత. జియో ఐపీఓ తో వచ్చే నిధుల్లో కొంత మొత్తాన్ని దాని ఆపరేటింగ్ సబ్సిడియరీ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాన్ని ముందుగానే తీర్చేందుకు వినియోగించనున్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో రూ.27,500 కోట్ల వరకు రుణాన్ని చెల్లించి మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియో గించనున్నట్లు తెలుస్తోంది. రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్‌లో ఇప్పటికే పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. పెద్ద ఇన్వెస్టర్ల వద్ద కలిపి సుమారు 30.9 శాతం వాటా ఉన్నట్లు సమాచారం. మెటా ప్లాట్‌ఫామ్స్‌కు చెందిన జాదూ హోల్డింగ్స్ వద్ద సుమారు 9.98 శాతం, గూగుల్ ఇంటర్నేషనల్ వద్ద 7.73 శాతం వాటా ఉన్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, సిల్వర్ లేక్, విస్టా ఈక్విటీ, జనరల్ అట్లాంటిక్, కెకెఆర్ అనుబంధ సంస్థలు, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి చెందిన సంస్థలు కూడా జియోలో పెట్టుబడిదారులుగా ఉన్నాయి.

## ప్రైమరీ మార్కెట్‌కు ఆరు ఐపిఒలు




**ముంబయి,సెప్టెంబరు 4:** భారత ప్రైమరీ మార్కెట్లో కొత్త ఉత్సాహం నెలకొంది. అమెరికాఇరాన్ యుద్ధ పరిణామాల కారణంగా 2026 ప్రారంభంలో నెమ్మదించిన నిధుల సేకరణ ప్రక్రియ మళ్లీ వేగం పుంజుకుంది. ఈనెల 9న ఒకే రోజున రికార్డు స్థాయిలో ఆరు ఐపీఓలు మార్కెట్లో ప్రారంభం కానున్నాయి. ఫర్నీచర్ రెంటల్ వేదిక రెంట్ ఒమోజో, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా), మణిపాల్ పేమెంట్ ఐడెంటిటీ సొల్యూషన్స్ వంటి ప్రముఖ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఆరు కంపెనీలు కలిపి సుమారు 45.11 బిలియన్ రూపాయలు (477.46 మిలియన్ డాలర్లు) సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వచ్చే వారంలోనే మరికొన్ని ఇతర కంపెనీలతో కలిపి కనీసం 11 ఐపీఓలు మార్కెట్లోకి అడుగుపెడుతుండటంతో ఈ ఏడాదిలోనే ఇది అత్యంత రద్దీగా ఉండే వారంగా నిలవనుంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అంచనాల ప్రకారం సెప్టెంబర్ నెలలో మొత్తం మీద దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువైన ఐపీఓలు రానున్నాయి. ఆటోమోటివ్ టెక్నాలజీ సంస్థ హీరో మోటార్స్, ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఇలతో పాటు ముకేష్ అంబానీ మద్దతు ఉన్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కూడా త్వరలోనే రాబోతోంది. అధిక వృద్ధి అవకాశాలు ఉన్న కంపెనీలకు భారత మార్కెట్లో మంచి డిమాండ్ కనిపిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 26 నాటికి భారత్‌లో 165 ఐపీఓల ద్వారా 8.61 బిలియన్ డాలర్లు సమీకృతమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ నిధుల సేకరణలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. మార్కెట్ నియంత్రణ సంస్థ ఇచ్చే ఐపీఓ అనుమతుల గడువు ఈనెల 30తో ముగియనుండటంతో కంపెనీలు మార్కెట్లోకి వచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. గడిచిన ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో సగటున 24.5 రెట్లు ఉన్న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్లు, జూలై ఆగస్టు నాటికి 59.1 రెట్లకు పెరిగాయి. అలాగే లిస్టింగ్ లాభాలు కూడా 5.7 శాతం నుంచి 19.5 శాతానికి పైగా పుంజుకున్నాయి. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారులు ప్రతి ఐపీఓలోనూ కాకుండా నాణ్యమైన, మంచి వృద్ధి సామర్థ్యం ఉన్న కంపెనీల్లో మాత్రమే జాగ్రత్తగా పెట్టుబడులు పెడుతున్నారు.

## వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలు



**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ ఈ వారాంతం లాభాల్లో ముగిసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 362 పాయింట్లు పెరగగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 24 పాయింట్లు పెరిగింది. దీంతో నాలుగు రోజులుగా సాగిన నష్టాలకు శుక్రవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 531.88 పాయింట్ల పెరుగుదలతో 76,684.74 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ 78.25 పాయింట్ల పెరుగుదలతో 23,951.70 వద్ద ప్రారంభమైంది. చివరకు సెన్సెక్స్ 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద, నిఫ్టీ 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 విలువ 0.25 శాతం నష్టపోగా, నిఫ్టీ మైక్రోక్యాప్ 250 కూడా 0.67 శాతం నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ ఇండెక్స్ 0.90 శాతం పడిపోగా, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.07 శాతం పెరిగింది. 30 షేర్ బీఎస్ఈ ఇండెక్స్‌లో రిలయన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, మారుతి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 95.18 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 4,472 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.45 వద్ద ఉంది. అలాగే బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.01శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.24శాతం ఎరిగింది. మార్కెట్లపరంగా ఎన్ఎస్ఇలో 2016 షేర్లుపెరిగితే 1517 షేర్లు క్షీణించగా మరో 115 షేర్లుస్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో అక్టోబరునాటి ఫ్యూచర్ పసిడి ధరలు పదినరగాములకు రూ.1,56,837గా కొనసాగాయి. లిస్టింగ్ అయిన షేర్లలో ఇఎస్‌డిఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ రూ.895.55 చొప్పున ముగిసింది. 108.75శాతం ప్రీమియంతో కొనసాగింది. ప్రయారిటీ జ్యూయెల్స్ 234.45 వద్ద కొనసాగింది. ఇష్యూ ధర కంటే బిఎస్ఇలో 12.6 శాతం ఈ సంస్థ షేర్‌ధరలు కొనసాగాయి.

## 11న ఎన్ఎస్ఇ ఐపిఒ ఇష్యూ ధరల ప్రకటన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారీ ఐపిఒకు సంబంధించి కీలక ప్రకటనకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 11న ఐపిఒ ధరల శ్రేణిని ప్రకటించే అవకాశం ఉందని, సెప్టెంబర్ మూడో వారంలో ఎఎస్ఇ షేర్లను లిస్ట్ చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఎన్ఎస్ఇ ఐపిఒకు ఆగస్టు 2026లోనే నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ లభించింది. సెప్టెంబర్ 2026లో ఎన్ఎస్ఇ షేర్లు బీఎస్ఈలో లిస్టయ్యే అవకాశం ఉందని జులైలోనే వెల్లడి అయింది. ప్రపంచంలో ట్రేడింగ్ పరిమాణం పరంగా అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌గా ఉన్న ఎన్ఎస్ఇ ఐపిఒ కోసం జూన్ 17న సెబీకి డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. స్ట్రీట్ అంచనాల ప్రకారం ఐపిఒ విలువ రూ.30వేల కోట్లకు పైగా ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే భారత స్టాక్ మార్కెట్‌లో ఇప్పటివరకు వచ్చిన అతిపెద్దఐపిఒగా నిలుస్తుంది. ప్రస్తుతం ఈ రికార్డు హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్లఐపిఒ పేరిట ఉంది. ఎన్ఎస్ఇ ఐపిఒద్వారా గరిష్ఠంగా రూ.5.26 లక్షల కోట్ల విలువను సంస్థ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. డిఆర్‌హెచ్‌పి ప్రకారం, ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంటుంది. ఇందులో ప్రస్తుత వాటాదారులు సుమారు 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఇవి ఎన్ఎస్ఇ చెల్లించిన ఈక్విటీ మూలధనంలో దాదాపు 6 శాతానికి సమానం. ఐపిఒ ప్రక్రియ కోసం ఎన్ఎస్ఇ మొత్తం 20 బ్యాంకులను నియమించింది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, జేఎం ఫైనాన్షియల్, మోర్గాన్ స్టాన్లీ, హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్, సిటీగ్రూప్ తదితర ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వార్త, శనివారం 5, సెప్టెంబరు 2026



ఫ్యాషన్ ఫ్యాషన్

# గళ్ల కోక- పట్టు రైక !



అమ్మమ్మల నాటిజ్ఞాపకాలు మళ్లీ కళ్ల ముందు మెదలుతున్నాయి. గళ్ల కోకలు మీకు తెలుసా.. అలా చూడగానే ఇట్టే ఆకర్షణ కనపడుతుంది. అమ్మమ్మ నడిగితే బట్టల మధ్యలోకం చూపిస్తుంది కదే! అప్పుడప్పుడూ తీసి చూస్తూ, తడుముతూ అనుబంధాలను గుర్తుకు తెచ్చుకుంటారు. అందరికీ ఆ అవకాశం ఉండదు. ఫొటోలోనో... లేదంటే లీలగా మెదడు పొరల్లో దాక్కునో గుర్తు చేస్తుంది. ఆ అందమే వేరు అనిపిస్తూ ఉంటుంది. ఆ చీరతో ముడిపడిన జ్ఞాపకం, వారసత్వం, ప్రేమ ఎవరికి వారికే ప్రత్యేకం! కాకపోతే ఫ్యాషన్ ప్రపంచమే వేరు. దానికెప్పుడూ పాత అన్న ముద్ర ఉండదు. అందుకే అప్పుడప్పుడూ వెనక్కెళ్లి... జ్ఞాపకాలను సరికొత్తగా తెస్తుంది. అలా ఇప్పుడు ట్రెండ్ అవుతున్నాయి... 'వింటేజ్ చీరలు'. అందునా గళ్ల చీరలకు మరీ క్రేజ్ పెరుగుతోంది. కాబట్టే, పట్టు ఏదన్న తేడా లేకుండా ఆనాటి రంగులు, చిన్నా పెద్ద గళ్లతో చీరలు మార్కెట్లో సందడి చేస్తున్నాయి. నోస్టాల్జియా అంటూ తమ ఊహల్లో నిక్షిప్తమైన వాటిని తెచ్చేసుకుంటున్





## పని సులువుగా..

ఇంట్లోనైనా, పనిచేసే ఆఫీసులోనైనా సుళువు తెలుసుకుంటే అంతా సజావుగానే నడుస్తుంది. పద్ధతిగా. చేస్తే ఉన్న ఆనందం ఆఫీసులో ఒబ్బిడిగా చేసుకునే వర్క్ రెండింటికీ మెళకువలు తెలుసుకుంటే మేలు. ఆలోచించండి. లేదంటే పనిని ఆస్వాదించడం మానేసి, ఒత్తిడిగా భావిస్తారు. ఒకదాని తర్వాత మరొకటి చేసుకుంటూ వెళ్లిపోవడం కాకుండా మీపనిని విభజించుకోండి. అరగంటలోపు పూర్తయ్యేవి చిన్నవి. అంతకన్నా ఎక్కువ సమయం పట్టేవి పెద్దవి. ముందు పెద్దవి చేసేస్తే చిన్నవేముంది. చకచకా చేసు కుంటూ వెళ్లొచ్చు అని పిస్తుంది కదా! కానీ చిన్నవే తొలుత పూర్తిచేయండి. ఏముందిలే అనుకుంటాం కానీ వీటినే త్వరగా మర్చిపోతాం. మన ఆడవాళ్ల పరిస్థితే విచిత్రం. ఆఫీసులో పని చేయాలి. ఇంటి బాధ్యతలనూ ఓ కంట కనిపెట్టుకోవాలి. ఆ రోజు భర్త, పిల్లలకు గుర్తు చేయాల్సినవి ఏమైనా ఉన్నాయా? ఇంట్లో గమనించుకోవల్సిన విషయాలు, పిల్లలు పూర్తిచేయాల్సిన హోంవర్క్‌లు వంటివి ఏమైనా ఉంటే ముందుగానే వాళ్లకో మెసేజ్ పెట్టే యండి. పని మీద నుంచి దృష్టి పక్కకు మళ్లదు.



ఆఫీసులో కొన్ని మీరే పూర్తి చేయాలి. వాటితో సమస్య ఉండదు. మరి కొన్ని ఇతర విభాగాలతో కలిసి చేసేవి ఉంటాయి. ఇలాంటి వాటి విషయంలో వాళ్లతో ఎలా చేయాలన్నది ముందుగానే మాట్లా డండి. ఆఖరి నిమిషంలో హడావుడి, పొరపాట్లకు తావుండదు. మర్చిపోతా మని జాబితాగా రాసుకుని పెట్టుకోవడం చాలామందికి అలవాటే! మంచిదే కానీ అది కళ్ల ముందు కనిపిస్తోంటే తెలియకుండానే ఒత్తిడి పెరుగుతుందట. కాబట్టి, పక్కన పెట్టేయండి.

## బెల్లంతో భలే !

శీతలంలో బెల్లానికి మించిన దివ్యౌషధం మరొకటి ఉండదు! వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండే ఈ కాలంలో బెల్లం వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది. శ్వాసకోశ ఇబ్బందులు రాకుండా ఉండేందుకూ ఉపకరిస్తుంది.

★ బెల్లం శరీరంలోని వ్యర్థాలను బయటకు నెట్టేస్తుంది. కాలేయంపై భారం పడకుండా చేస్తుంది. అందుకే భోజనం తర్వాత ఒక చిన్నబెల్లం ముక్క తింటే మంచిదనేది. ★. జలుబు దగ్గువంటివి చికాకు పెట్టే రోజులివి. ఆ సమస్య నుంచి ఉపశమన పొందాలంటే టీలో పంచదారకు బదులు బెల్లాన్ని వాడి చూడండి. ★.. బెల్లానికి రక్తాన్ని శుద్ధి చేసే గుణం ఉంది. రోజూ ఓ చిన్నముక్క తింటే రక్తంలోని దోషాలు తొలగిపోతాయి. బిపిని అదుపులో ఉంచుతుంది. ★.. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రక్తహీనతను తగ్గించి, ఇన్‌ఫెక్షన్లను దరిచేరకుండా చూస్తాయి. కీళ్లనొప్పులు రాకుండా ఉంటాయి. ★.. ఫ్యాక్టరీలు, కాలుష్యం ఎక్కువగా ఉండే చోట్ల పనిచేసేవాళ్లు బెల్లాన్ని తింటే ఊపిరితిత్తుల్లో ఉన్న వ్యర్థాలు బయటకు పోయి శరీరానికి మేలు జరుగుతుంది. ★.. నెలసరి రోజుల్లో తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేవారు రోజూ బెల్లం తింటే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

## ట్యూబర్‌క్యులస్ ఆర్థరైటిస్

ఇది 2 విధాలుగా ఉంటుంది.

**మొదటి విధానం :** 1. కేషియస్ ఎక్స్‌డేటివ్ టైప్: ఈ టైప్‌లో ఎముక ఎక్కువగా డామేజ్ అవుతుంది. దీని వల్ల వాపు ఎక్కువై అబ్సెస్ తయారవుతుంది. దీనివల్ల వెన్నెముక వంగిపోవడం వల్ల ప్రక్క నున్న పొరలు ముడుచుకొని పోతాయి. చీముగడ్డలు పగిలి సైనస్ ఏర్పడుతుంది. వీటిలో ద్రవం (ఎక్స్‌డేషన్) ఎక్కువగా ఉండి రసి కారుతుంటుంది. ఇది పిల్లల్లో ఎక్కువగా కన్పిస్తుంది.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**రెండవ విధానం :** 2. గ్రాన్యులార్ టైప్ : ఈ టైప్‌లో బోన్ ఎక్కువగా డామేజ్ కాదు. ఇది పెద్దవారిలో ఎక్కువ. మెల్లగా ఏర్పడుతుంది. ఎక్స్‌డేషన్ (ద్రవం) ఉండదు. క్లాసిక్ సిక్కా భుజంలో ఎక్కువగా కన్పిస్తుంది. కాబట్టి ఇది డ్రై (పొడిగా) ఉంటుంది. ఇవే గాకుండా తుంటి ఎముక ఎఫెక్ట్ అయినప్పుడు ఎముకలోని గ్రేటర్ ట్రోకంటర్ ఎఫెక్ట్ అవుతుంది. ఇది 6-15 సంవత్సరాల వారిలో ఎక్కువ. జాయింట్ క్యాప్స్యూల్ దెబ్బతిని బిరుసెక్కి ముడుచుకొని పోతుంది. కదిలించిన నొప్పి ఉండి అన్ని వైపులా కదలలేరు. తుంటి ఎముక జారినట్లుండి కుంటుతూ నడుస్తారు. ఎక్కువగా కుడివైపు నొప్పి సాయంత్రం పూట ఉంటుంది. మోకాలుకు టిబి రక్తం ద్వారా వ్యాపిస్తుంది. జాయింట్స్ మధ్య, సైనోవియమ్, ఆర్టిక్యులార్ మార్జిన్స దెబ్బ తింటుంది. దీని వల్ల సైనోవియల్ మెంబ్రెన్ ఎర్రగా ఉబ్బి చిన్న చిన్న ట్యూబర్‌క్యులస్‌గా ఉండి ఫైబ్రినస్ ఫ్లెక్స్‌తో ఉంటుంది. ఇది నెలల తరబడి ఉంటుంది. ఆస్టియో ఆర్టికుల్యర్‌గా ఉండి బోన్‌ని తినేస్తుంది. రాను రాను మొత్తం జాయింట్ గ్రాన్యులేషన్ టిస్యూతో నిండి మోకాలు ప్రక్కకు తొలగినట్టుంటుంది.

**వ్యాధి లక్షణాలు :** వ్యాధి లక్షణాలు నిదానంగా ప్రారంభమవుతాయి. ఒక్కోసారి ఉన్నట్టుండి తీవ్రంగా వస్తుంది. ఇది రోగి వ్యాధి నిరోధక శక్తి తక్కువగా వున్నవారిలో ఎక్కువ. ఒక బోన్ లేదా జాయింట్ మాత్రమే ఎఫెక్ట్ అవుతుంది. మధ్యాహ్నం పూట జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, రాత్రిళ్ళు చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అనేమియా, నిస్సత్తువ, వళ్ళునొప్పులుంటాయి. లోకల్‌గా నొప్పి, వాపు, స్టిఫ్‌నెస్, పట్టేసినట్టుంటుంది. కదిలిన నొప్పి, కండరాల క్షీణత, లింఫ్ గ్రంథుల వాపు ఉంటుంది. ఎముక క్షీణించడం వల్ల మనిషి వంగిపోతాడు. ఛాతీ, మెడ, తొడ భాగంలో ఎక్కువగా కోల్డ్ అబ్సెస్ తయారవుతాయి. ముసలి వారిలో బోన్ (ఎముక) చివరి భాగం ఎఫెక్ట్ అవుతుంది. వీపు కండరాల్లో స్పాజమ్ వల్ల రోగి గూని వచ్చినట్లు వంగిపోవడం వుంటుంది. రోగం నయమైపోయినప్పటికి వ్యాధి లక్షణాలన్ని తగ్గిపోయిన కైఫోసిస్ (గూని) మాత్రం అలాగే ఉంటుంది. కాని ఇన్ఫెక్షన్ వుండడం వల్ల ఇఎస్ఆర్ ఎక్కువగా ఉంటుంది.

**నిర్ధారణ పరీక్షలు :** ఎక్స్‌రేలో ఎముక డామేజ్ అయి ఉంటుంది. టిష్యూ వాపు, బోన్‌లో రీ కాల్సిఫికేషన్, ఎముక పై భాగం మందంగా, క్రొత్త ఎముక తయారీ ఉంటుంది. కార్టిలేజినస్ టిష్యూ మాత్రం డామేజ్ కాదు. జాయింట్ స్పెస్ తగ్గుతుంది. మార్జిన్స ఇరెగ్యులర్‌గా, హెజీ నెస్‌గా ఉంటుంది. పెరి అర్టిక్యులార్ ఆస్టియో ఫోరోసిస్ అంటుంది. రక్తం, టి.బి. పరీక్ష, కల్చర్, స్కానింగ్ సిటి, ఎంఆర్ఐ, బయాప్సీ, బోన్‌స్కాన్ ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు.

**చికిత్స :** బెడ్ రెస్ట్, మంచి పోషకాహారం తీసుకోవాలి. ట్రాక్షన్, మొబలైజేషన్, కీమ్‌థిరపీ, టిబి చికిత్స, కాలీపర్స్ క్రచ్చర్స్ సపోర్ట్ కోసం వాడాలి. వైద్య పర్యవేక్షణలో చికిత్స అవసరం.

## 'చకోర లూనార్ లవ్ బర్డ్' టీజర్ విడుదల



శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగానటిస్తున్న సినిమా 'చకోర లూనార్ లవ్ బర్డ్'. ఈ చిత్రాన్ని వీఐపీ వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ సారథ్యంలో హై జాయ్ కమర్షియల్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ డా.చింతాడ హేమారావు నిర్మిస్తున్నారు. "చకోర లూనార్ లవ్ బర్డ్" సినిమాతో ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన మంగా శ్రీనివాస్ నూతన దర్శకుడిగా పరిచయ మవుతున్నారు. అక్టోబర్ 8న ఈ సినిమా గ్రాండ్ థియేటర్ రిలీజ్‌కి రాబోతోంది. ఈ రోజు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా "చకోర లూనార్ లవ్ బర్డ్' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ బాగుందంటూ ప్రశంసించిన రామ్మోహన్ నాయుడు చిత్ర దర్శక నిర్మాతలకు, ఇతర బృందానికి తన బెస్ట్ విశెస్ అందించారు. "చకోర లూనార్ లవ్ బర్డ్" సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే అందమైన వైజాగ్ నేపథ్యంలో సాగే సరికొత్త ప్రేమ కథతో ఈ సినిమా రూపొందినట్లు టీజర్ తో తెలుస్తోంది. ఇది మామూలు ప్రేమ కథ కాదు, అమ్మ చెప్పిన ప్రేమ కథ, అమ్మ చెప్పిన ప్రేమ కథే కాదు అబ్బాయి ప్రేమ కథ, అబ్బాయి ప్రేమ కథే కాదు అమ్మాయి ప్రేమ కథ కూడా , ఇది మామూలు ప్రేమ కాదు. ఇది చకోర ప్రేమ కథ అంటూ వచ్చే వాయిస్ ఓవర్ తో ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. జాబిల్లి చేరేందుకు ప్రయత్నించే చకోర పక్షిని సింబాలిక్ గా చెబుతూ హీరో క్యారెక్టరైజేషన్‌ను డిజైన్ చేయడం కొత్తగా అనిపిస్తోంది. చకోర పక్షి ఒక యూనిక్ బర్డ్.. తన దాహాన్ని తీర్చుకునే ప్రాసెస్‌లో స్వచ్ఛమైన వాన చినుకులనే త్రాగుతుంది తప్ప ఏది బడితే అది త్రాగదు...

ఆ వర్షపు చినుకుల కోసం అప్పటివరకూ నిరీక్షిస్తూ ఉంటుంది... ఈ కథలో హీరో కూడా అంత

## 'చంద్రయాన్' సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్



త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న హిలేరియస్ అడ్వెంచర్ మూవీ రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో 'చంద్రయాన్' టైటిల్‌తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్ పై ప్రవీణ్ మొలక నిర్మిస్తు న్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన 'చంద్రయాన్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. మంద మర్రి అనే ఊరిలోని ముగ్గురు యువకులు బైక్ టైర్లు, కుక్కర్, డంబెల్..ఇలా తమకు దొరికిన వస్తువులతో సొంతంగా మా ఊరి రాకెట్ తయారు చేసుకుని చందమామ దగ్గరకు వెళ్లడం ఈ మోషన్ పోస్టర్ లో ఆసక్తి కలిగిస్తోంది. ముగ్గురు యువకుల చంద్రయాన్ యాత్రను ఎందుకు చేపట్టారు. ఈ సాహసం చేయడం వెనక కారణాలు ఏంటి, శాస్త్రవేత్తలకే సవాలు విసిరే చంద్రయాన్ లో ఈ ముగ్గురు యువకులు విజయం సాధించారా లేదా వంటి అంశాలతో మోషన్ పోస్టర్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ మోషన్ పోస్టర్ కు హర్ష ప్రవీణ్ కంపోజిషన్ లో శ్రీనాథ్ చంద్రశేఖర్ సాహిత్యాన్ని అందించగా కనకవ్వ, శ్రీనిజ భదూరి, లాస్య పాడిన రామ రామ రామ ఉయ్యాలో పాట మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. మనవైన కథలు టాలీవుడ్ బాక్సాఫీస్ మీద జెండా ఎగరేస్తున్న ప్రస్తుత ట్రెండ్ లో మరో లోకల్ కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు చంద్రయాన్ సినిమా రెడీ అవుతోంది.

## తెర

## 'కాకా' సెప్టెంబర్ 7 నుంచి షెడ్యూల్ ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీ కాకా. వెంకట్ కే నారాయణ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ని భారీ స్థాయిలో నిర్మిస్తు న్నారు. మెగాస్టార్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచిందిప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో 'కాకా' నెక్స్ట్ భారీ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ లెన్తీ షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన వర్కింగ్ స్టిల్‌లో మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి షూటింగ్ లొకేషన్ లో డిస్కస్ చేస్తూ కనిపించారు. ఈ బిహైండ్ ద సీన్ పిక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు థమన్ ఎస్. సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్, ఆంటోనీ ఎల్. రూబెన్ ఎడిటింగ్. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి అడిషనల్ స్క్రీన్ ప్లే రైటర్స్‌గా పనిచేస్తున్నారు. భానునందు డైలాగ్స్ రాస్తున్నారు. 2027 జనవరి 13న సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల

## 'డెలులు' చిత్రం టీజర్ లాంచ్

'చిరంజీవి నన్ను హీరోగా నమ్ముతున్నప్పుడు నేను కూడా నన్ను నమ్మాలి' డెలులు చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విజయ రాజ్ కుమార్.. క్రియేటివ్ లాంచ్ పాడ్ బ్యానర్ పై



ప్రీతం కస్తూరి దర్శకత్వం లో సంకీర్త్ కొండ నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం డెలులు. విజయ రాజ్ కుమార్, వేణి రావు, సాయి ప్రసన్న, అఖిల్ జాక్సన్, శ్రీరామ మండవ కీలక పాత్రలు పోషించారు. రేష్మిత్ ఎస్ కౌశిక రచించిన ఈ కథకు విజయ రాజ్ కుమార్ డైలాగులు అందించగా జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ చేశారు. ఈ సందర్భంగా సినిమా టోగ్రాఫర్ జై రాజ్ నాయుడు మాట్లాడుతూ... నాకు అవకాశం ఇచ్చి సపోర్ట్ గా నిలిచిన మా డైరెక్టర్‌కి థాంక్స్. ఎడిటర్ హరికృష్ణ మాట్లాడుతూ... "కొత్తవారు అందరూ కలిసి ఈ సినిమా చేశాం. సంగీత దర్శకుడు ఆది చేబ్రోలు మాట్లాడుతూ... "డెలులు అనే పదం జెన్ జి నుండి వచ్చింది. నటుడు అఖిల్ జాక్సన్ మాట్లాడుతూ... "మొదటిసారి ఇలా స్టేజ్ పై మాట్లాడు తున్నాను. నేను ఈ స్థాయిలో ఉన్నాను అంటే దానికి కారణం మా అమ్మ. నాకు అవకాశం ఇచ్చిన సినీ బృందానికి థాంక్స్. హీరోయిన్స్ వేణి రావు, సాయి ప్రసన్న మాట్లాడుతూ... "ఈ కార్య క్రమానికి వచ్చి మాకు సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్. చిత్ర దర్శకుడు ప్రీతం మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి హాజరైన మీడియా మిత్రులకు, ముఖ్య అతిథులకు ధన్యవాదాలు. సినిమా అనేది ఒక్కరి కృషితో సాధ్యం కాదు, మొత్తం టీమ్ సమష్టి కృషి వల్లే సినిమా పూర్తవుతుంది. జిగిరీస్ చిత్ర నటుడు కృష్ణ మాట్లాడుతూ."ఈ సినిమాను సపోర్ట్ చేస్తూ ఇక్కడికి వచ్చిన అందరికీ థాంక్స్.

## 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్ విడుదల



సోషల్ మీడియాలో లాంచ్ చేసిన బ్రహ్మాజీ భక్తిరస చిత్రంలో మార్కండే యుడిగా బ్రహ్మాజీ శరవేగంగా షూటింగ్ జరుపు కుంటున్న 'కృష్ణంభజే' మూవీ జయశ్రీ మీడియా సమర్ప ణలో తెరకెక్కుతున్న భక్తిరస చిత్రం'కృష్ణంభజే' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కలాల్ శ్రీనివాస్ నిర్మాణంలో నాగరాజ్ కొట్టే దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మాజీ మార్కండేయ పాత్రను పోషి స్తున్నారు. కృష్ణాష్టమి కానుకగా బ్రహ్మాజీ కృష్ణంభజే ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో లాంచ్ చేశారు. పోస్టర్ లో బ్రహ్మాజీ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బ్రహ్మాజీ మార్కండే యుడి గెటప్‌లో సంప్ర దాయ ఆధ్యాత్మిక రూపం లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాషాయ వస్త్రధారణ, రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి, చేతిలో ఆయుధంతో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతిబింబంగా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. పౌరాణిక, భక్తిరస అంశాలను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగరాజ్ కొట్టే రచనతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథకు అనుగుణంగా ప్రత్యేకమైన పాత్రలు, ఆసక్తికరమైన సన్నివేశాలతో సినిమాను రూపొంది స్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ప్రదీప్, హీరోయిన్‌గా వంగమయి పటేల్ నటిస్తున్నారు.

## పోలీస్ పవర్-3 షూటింగ్ ప్రారంభం



శివ ఫిలిం ప్యాక్టరి బెనరుపై నిర్మిస్తున్న 'పోలీస్‌పవర్ 3' చిత్రం గురువారం ఫీలిం చాంబర్‌లో ప్రముఖుల చేతుల మీదుగా చిత్రం షూటింగ్ ప్రారంభించటం జరిగింది. హీరో, డైరక్టర్ నిర్మాత శిజొన్నలగడ్డ స్వీయ నిర్మాణంలో జరుగుతుంది. శివ జొన్నగడ్డ మాట్లాడుతూ 'పోలీస్ పవర్-1, చిత్రాన్ని పోలీస్ పవర్-2 ప్రేక్షక దేవుళ్ళు ఎంతగానో ఆదరించారు. అలాగే ఈ రెండు చిత్రాలు కూడా యథార్థ సంఘటనల ఆదారంగా తీసాము. అలాగే ఈ పోలీస్ పవర్-3, చిత్రం కూడ మూడు యథార్థ సంఘటనల ఆధారంతో తెరకెక్కిస్తుం న్నాము అని తెలిపారు. మొదటి షెడ్యూల్ వారం పదిరోజుల్లో మొదలవుతుంది. తారగణం : శివజొన్న లగడ్డ మరియు ఐదుగుహిరోలు, ఐదుగురు హిరోయిన్స్ నటిస్తారు. అలాగే ముఖ్యమైన పాత్రల్లో సినియర్ నటి, నటులు నటిస్తారు.

# బంగ్లా నా దేశం .. అక్కడికే వెళ్తా

## మీడియా ఇంటర్వ్యూల్లో మాజీ ప్రధాని షేక్ హసీనా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** ఏదాది చివరి నాటికి బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లాలన్న నిర్ణయం తన మాతృదేశం పట్ల ఉన్న బాధ్యత పరంగా తీసుకున్న నిర్ణయమని హసీనా చెప్పారు. బంగ్లాదేశ్ నా దేశం. నా రాజకీయ జీవితమంతా బంగ్లాదేశ్ ప్రజలతోనే గడిపాను. నా తల్లి, నా సోదరులు, నా కుటుంబంలోని చాలా మంది సభ్యులు బంగ్లాదేశ్ గడ్డపైనే హత్యకు గురయ్యారు. నా రాజకీయ జీవితమంతా ఆ దేశానికి సేవ చేస్తూనే గడిపాను. నా మూలాలు అక్కడే ఉన్నాయి. నా ప్రజలు అక్కడే ఉన్నారు. నా బాధ్యత కూడా అక్కడే ఉంది అని ఆమె గుర్తు చేశారు. తాను ఎదుర్కొన్న జైలు జీవితం, వేధింపులు, హత్యా యత్నాలు, పదేపదే వచ్చిన బెదిరింపులను గుర్తుచేసుకున్న హసీనా దేశం తీవ్ర ఉన్న సమయంలో దూరంగా ఉండేందుకు తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు. తన తిరుగు ప్రయాణం అధికారాన్ని తిరిగి దక్కించుకోవడం కోసం కాదని, తన బాధ్యతను నెరవేర్చడం, ప్రజలతో నిలబడటం, చట్టాన్ని ఎదుర్కోవడం, తనపై తీర్పును బంగ్లాదేశ్ ప్రజలకే వదిలేయడమేనని హసీనా తెలిపారు. తనను బంగ్లాదేశ్‌కు అప్పగించే విషయంలో భారత ప్రభుత్వం వైఖరిపై తాను వ్యాఖ్యానించబోనని హసీనా చెప్పారు. భారత్ సార్వభౌమ దేశం. భారత ప్రభుత్వం తరఫున నేను మాట్లాడను. నా అవగాహన ప్రకారం భారత్ అప్పగింత అంశాన్ని చట్టపరమైన వ్యవహారంగా చూస్తోంది. తన సొంత న్యాయ, న్యాయవ్యవస్థ ప్రక్రియల ద్వారా దీనిని పరిష్కరిస్తోంది. దాన్ని భారత్ చూసుకుంటుందని అన్నారు. భారత్‌బంగ్లాదేశ్ స్నేహ సంబంధాలకు తాను ఎప్పుడూ విలువ ఇస్తానని చెప్పారు. బంగ్లాదేశ్ తిరిగి రావడంలో ఉన్న ప్రమాదాలను హసీనా అంగీకరించారు. అయితే భయం తన బాధ్యతను నిర్ణయించలేదని చెప్పారు. తనపై 19 సార్లు హత్యాయత్నాలు జరిగాయని ఆరోపించారు. తన కుటుంబ సభ్యుల హత్యలను గుర్తుచేసిన హసీనా 2004 ఆగస్టులో జరిగిన గ్రెనేడ్ దాడి తనను, అవామీ లీగ్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నదని పేర్కొన్నారు. నేను జైలు జీవితం, సైనిక పాలన, రాజకీయ వేధింపులు, పదేపదే వచ్చిన బెదిరింపులను ఎదుర్కొన్నాను. కాబట్టి ప్రమాదం ఏంటో నాకు తెలుసు. కానీ రాజకీయ జీవితంలో వ్యక్తిగత భద్రత ఒక్కటే పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం కాదు. నా ప్రజలకు దూరంగా జీవించడం కంటే నా దేశానికి తిరిగి వెళ్లి ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికే నేను సిద్ధంగా ఉన్నానని హసీనా అన్నారు. తనపై నమోదైన కేసుల్లో ఒకదానిలో విధించిన మరణ శిక్షపైనా హసీనా స్పందించారు. తన ప్రాణం గురించి తాను ఆందోళన చెందడం లేదని, న్యాయ వ్యవస్థ దన్నదే తన ఆందోళన అని చెప్పారు. కోర్టులు, చట్టాలు, ప్రభుత్వ సంస్థలను రాజకీయ ప్రతీకారం కోసం ఉప యోగిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రేరేపిత ప్రక్రియ ద్వారా విధించిన మరణశిక్షను సత్యంపై తుది తీర్పుగా పరిగ ణించ లేం. సాధారణ, నిష్పక్షపాత, విశ్వసనీయ న్యాయ ప్రక్రియలో నన్ను నేను సమర్థించుకునే నిజమైన అవకాశం నాకు లభించలేదు. నిందితుడి పూర్తి భాగస్వామ్యం లేకుండా, సరైన న్యాయ రణ లేకుండా, రాజకీయ ఒత్తిడిలో వెలువడిన తీర్పు న్యాయం కాదు అని ఆమె పేర్కొన్నారు. నేను కోర్టు ముందు హాజరయ్యే అవకాశం ఇవ్వండి. సాక్ష్యాలను సమర్పించనివ్వండి.

నా న్యాయ వాదులు నా తరఫున వాదించనివ్వండి. సాక్షు లను ప్రశ్నించనివ్వండి. వారినిమాట్లాడ నివ్వం దని విజ్ఞప్తి చేశారు. 2024 ఆగస్టు 5 తర్వాత బంగ్లాదేశ్లో శాంతి, భద్రత, అభివృద్ధి, ప్రజల హక్కులు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపిం చారు. ప్రజల హక్కులను పునరుద్ధరించే విస్తృత ప్రయత్నంలో భాగంగానే తన స్వదేశానికి తిరిగి రావాలనుకుంటున్నట్లు చెప్పారు. 2024 ఆగస్టు నుంచి అవామీ లీగ్ నేతలు, కార్యకర్తలు, సాధారణ మద్దతుదారులపై అరెస్టులు, తప్పుడు కేసులు, ఉద్యోగాల నుంచి తొలగింపులు, దాడులు, బెదిరింపులు, హింస చోటు చేసుకున్నాయని హసీనా ఆరోపించారు. చాలామంది తమ ఇళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చిందని, మరికొందరు దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

వారిని నేరస్థులుగా కాకుండా రాజకీయ వేధింపులకు గురైన బాధితులుగా చూడాలని ఆమె అన్నారు. లక్షలాది మంది అవామీ లీగ్ మద్దతుదారులు, సాధారణ పౌరులు తమ సొంత దేశంలోనే తమకు ఎలాంటి చట్టబద్ధమైన స్థానం లేనట్లుగా వ్యవహరించబడుతున్నారని ఆరోపించారు. అయితే అవామీ లీగ్ బంగ్లాదేశ్ను, ఆ దేశ ప్రజలను వదిలిపెట్టబోదని ఆమె స్పష్టం చేశారు

# నియోనేటల్‌కేర్ వార్డులో అగ్నిప్రమాదం!

## నవజాత శిశువులను వెంటనే తరలించిన యాజమాన్యం

**ముంబయి, సెప్టెంబరు 4:** ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం సంభవించింది. నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో చికిత్స పొందుతున్న 9 మంది నవజాత శిశువులను వెంటనే అక్కడి నుంచి మరో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి అదుపులోనే ఉన్నదని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఆ హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జల్నా రోడ్ ప్రాంతంలో ఉన్న ఏషియన్ హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఎన్ఐసీయూలోని ఒక ఏసీ నుంచి పొగలు రావడాన్ని సిబ్బంది గమనించారు. అక్కడ ప్రత్యేక చికిత్స పొందుతున్న 9 మంది నవజాత శిశువులను వెంటనే బయటకు తరలించారు. పక్కనే ఉన్న జనరల్ వార్డులోని రోగులను కూడా ఖాళీ చేయించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది కూడా ఆ హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. ఇది చిన్న సంఘటన అని, ఎలాంటి అవాంఛనీయం జరుగలేదని, ఎవరికీ గాయాలు కాలేదని ఆ ఆసుపత్రిని నిర్వహిస్తున్న డాక్టర్ షోయబ్ హాష్మి తెలిపారు. ముందు జాగ్రత్తగా తమ బృందం పక్కనే ఉన్న జనరల్ వార్డులోని రోగులతో పాటు నవజాత శిశువులను కూడా ఖాళీ చేయించినట్లు చెప్పారు. ఆసుపత్రి బృందం తక్షణ చర్యలు తీసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చిందని వివరించారు. మరోవైపు జనరల్ వార్డు రోగులను తరువాత తిరిగి తీసుకువచ్చినట్లు డాక్టర్ షోయబ్ హాష్మి తెలిపారు. కుటుంబాల అంగీకారంతో నవజాత శిశువులను ఇతర ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు. ఆసుపత్రిని శుభ్రపరిచి, యధావిధిగా పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# యుపి మాజీ సిఎం అఖిలేష్‌తో సిజెపి జాతీయ సహాకన్వీనర్ రహస్యభేటీ



**లక్నో, సెప్టెంబరు 4:** ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయంగా ఏదో పెద్దగా జరగబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో కాక్రోక్ జనతా పార్టీ జాతీయ సహ కన్వీనర్ ఆశుతోష్ రాంకా లక్నోలో రహస్యంగా కలిశారు. దాదాపుగా ఇద్దరు 90 నిమిషాల పాటు భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తిగా మారింది. తాము ప్రెజర్ గ్రూపుగా ఉంటామని, రాజకీయాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన సీజేపీ ఇప్పుడు అఖిలేష్‌తో భేటీ కావడం, అది కూడా యూపీ ఎన్నికల ముందు భేటీ కావడం కీలకంగా మారింది. ఎస్పీ ప్రధాన కార్యాలయం సమీపంలోని జనేశ్వర్ మిశ్రా ట్రస్ట్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఈ భేటీపై అటు ఎస్పీ, ఇటు సీజేపీ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల సీజేపీ ప్రభుత్వ పాఠశాలల్ని బాగు చేయాలని ఫిక్స్ ది స్కూల్ కార్యక్రమాన్ని చేపట్టింది. పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు అనుమతి లేకుండా ప్రవేశించవద్దని యూపీ, రాజస్థాన్ ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. ఈ నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. నిజానికి సీజేపీ కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే స్కూళ్లలోని సమస్యల్ని ఎత్తిచూపుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఇప్పుడు రాజస్థాన్, మహారాష్ట్ర తర్వాత యూపీని సీజేపీ టార్గెట్ చేసిందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పేపర్ లీక్, విద్యా వ్యవస్థ సమస్యల్ని లేవనెత్తాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# కొర్వి కృష్ణ స్వామి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : మంత్రులు పొన్నం, వాకిటి



సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద నగర తొలి మేయర్ కొర్వి క్రిష్ణ స్వామికి నివాళులర్పిస్తున్న మంత్రులు,పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర తొలి మేయర్, విద్యావేత్త, జర్నలిస్టు కొర్వి క్రిష్ణ స్వామి ముదిరాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర రవాణా,బిసీ సంక్షేమ శాఖల మంత్రి, రాష్ట్ర పొన్నం ప్రభాకర్,పశుసంవర్ధక,క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు తెలిపారు.

నగర తొలి మేయర్ కొర్వి క్రిష్ణ స్వామి 133వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ముదిరాజ్‌లు ఐక్యతతో తమ హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. హైదరాబాద్‌ను మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేశారన్నారు. కుల సంఘాల ఏర్పాటుకు నాంది పలికి చాటి చెప్పిన మహనీయుడని పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌లు మాట్లాడుతూ కొర్వి క్రిష్ణ స్వామి జయంతి,వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్నారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. కొర్విక్రిష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నాగేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినకర్ బాబు,ముదిరాజ్ సంఘం నేతలు చొప్పరి శంకర్, ఆగం పాండు, వేణుగోపాల్,పిట్ల సురేశ్, అశోక్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నవీముంబయిలో మూడేళ్ల చిన్నారిపై వ్యాన్ డ్రైవర్ అత్యాచారం

**నవీముంబయి, సెప్టెంబరు 4:** మహారాష్ట్ర, నవీ ముంబైలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అది కూడా స్కూల్ వ్యాన్‌లోనే లైంగిక దాడికి దిగాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. నవీ ముంబైలో ఒక మూడేళ్ల చిన్నారి రోజూ స్కూల్ వ్యాన్‌లో పాఠశాలకు వెళ్లి వస్తుండేది. ఆ వ్యాన్‌లో స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే చివరి చిన్నారి ఆ పాపే. వ్యాన్‌లోని మిగతా వాళ్లు ముందే దిగిపోయేవారు. ఆ మూడేళ్ల పాప అందరికంటే చివరి స్టాప్‌లో దిగాలి. దీంతో మిగతావాళ్లు దిగిన తర్వాత వ్యాన్‌లో ఒంటరిగానే ఉండేది. ఈ క్రమంలో వ్యాన్ డ్రైవర్ పాపపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర కడుపు నొప్పితో బాధపడింది. ఈ కడుపు నొప్పి గురించి పాపను తల్లిదండ్రులు ఆరా తీయగా స్కూల్ వ్యాన్ డ్రైవర్ తనతో ఎలా ప్రవర్తించింది చెప్పింది. పాప అత్యాచారానికి గురైనట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసి షాక్ తిన్న తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. లాస్ట్ స్టాప్ వరకు వ్యాన్‌లో ఎవరూ లేకపోవడం, పాప ఒక్కర్తే ఉండటం వల్ల ఈ అత్యాచార ఘటన జరిగింది. డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. అయితే, ఇలాంటి ఘటనలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పిల్లలు ప్రయాణించే స్కూల్ బస్సుల విషయంలో ప్రభుత్వం కొన్ని రూల్స్ రూపొందించింది. స్కూల్ బస్సులో తప్పనిసరిగా ఒక మహిళా సిబ్బంది ఉండాలి. చివరి విద్యార్థి దిగేవరకు ఆ వ్యక్తి బస్సులోనే ఉంటూ, వారి రక్షణ బాధ్యతలు చూసుకోవాలి.


# వరదలు ముంచెత్తిన తొమ్మిదిరోజులకు సొరంగం నుంచి ఇద్దరి వెలికితీత



**ఖాట్మండు, సెప్టెంబరు 4:** నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన మహా విషాదంలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. వరదలు ముంచెత్తిన తొమ్మిది రోజుల తర్వాత, బురద, శిథిలాలతో పూర్తిగా కూరుకుపోయిన ఒక జల విద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం నుంచి ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది సజీవంగా బయటకు తీశారు. ఈ ఘటనతో ఇంకా అనేక సొరంగాల్లో చిక్కుకుపోయిన వందలాది మంది కార్మికులు కూడా ప్రాణాలతో బయటపడతారనే ఆశలు బలపడ్డాయి. నేపాల్‌లోని త్రిశూలి జల విద్యుత్ ప్రాజెక్టులో గతనెల 26న సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇద్దరిని ప్రాణాలతో కాపాడటం అక్కడివారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బురదతో నిండిపోయిన కార్మికులను సహాయక సిబ్బంది తమ భుజాలపై మోసుకుని బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు స్థానిక టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వీడియోలో, కార్మికుడిని సొరంగం నుంచి బయటకు తీయగానే సహాయక సిబ్బంది ఆనందంతో కేరింతలు కొట్టడం కనిపించింది. మరో చిత్రంలో, బురదలో కూరుకుపోయిన మరో వ్యక్తిని స్ట్రెచర్‌పై తరలిస్తుండగా, అతను చేతులు జోడించి నమస్కరించడం హృదయాలను కదిలించింది. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందంటే.. సహాయక చర్యల్లో ప్రాణాలతో బయటపడిన వారిని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (ఎన్ఈఏ) మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ షా (30), త్రిశూలి3 ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్ (45)గా నేపాల్ హోం మంత్రి సుదాన్ గురుంగ్ గుర్తించారు. సంజయ్ షా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో అతన్ని వెంటనే హెలికాప్టర్‌లో రాజధాని ఖాట్మండుకు సమీపంలోని బత్తర్‌కు తరలించారు. మరోవైపు, కబీర్ మహర్జన్ స్పృహలోనే ఉన్నాడని, అతన్ని ఖాట్మండులోని చౌనీ మిలటరీ ఆసుపత్రికి తరలిస్తున్నామని అతని భార్య తెలిపారు. "చాలా సంతోషంగా ఉంది, నా గుండెపై భారం తగ్గింది" అని కబీర్ సోదరుడు అమీర్ మహర్జన్ ఆనందం వ్యక్తం చేశారు. హిమనీనదం కూలిపోవడం వల్ల సంభవించిన ఈ జల ప్రళయంలో నేపాల్‌లోని మూడు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 1,259 మంది మరణించగా, 5,000 మందికి పైగా గల్లంతయ్యారన్నారు.

# బాలుని కడుపులో బ్లేడ్‌లు

**- గాయం కాకుండా బయటకు తీసిన ఉస్మానియా వైద్యులు - పదహారేళ్ల బాలుని కాపాడిన వైనం**



బాలుని కడుపు నుంచి బయటకు తీసిన బ్లేడ్‌లు

**అఫ్జల్‌గంజ్,సెప్టెంబర్ 4ప్రభాతవార్త:** మానసిక రోగి ఐనా ఓ 16 ఏళ్ల బాలుడు మింగిన రేజర్ బ్లేడ్‌లను ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ఎండోస్కోపి పద్ధతిలో తొలగించి ప్రాణాలు కాపాడి మరోసాటి తమకు సాటి లేరని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు నిరూపించుకున్నారు.సాదారణంగా బ్లేడ్ ఏ భాగంలో తగిలినా రక్తంవస్తుంది. కాని మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్,డాక్టర్ బి.రమేష్‌కుమార్ ఎంతో నైపుణ్యంతో,చాక,చాక్యంతో బాలుడి కడుపులో ప్రమాదకరంగా ఉన్న బ్లేడ్‌లను శరీర లోపలి బాగంలోఎంటు వంటి ప్రమాదం లేకుండా మింగిన బ్లేడ్‌లను బయటకు తీసి బాలుడి ప్రాణాలను కాపాడారు. ఈ చికిత్స విజయవంతంగా నిర్వహించిన మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతితో పాటు వైద్యులను ఉస్మానియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సహాయ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా ఉస్మానియా ఆసుపత్రి మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.రమేష్‌కుమార్ వివరాలను వెల్లడించారు. తాండూరు ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ మహబూబ్‌అలీ కుమారుడు మహమ్మద్ ముజీబుర్ రహ్మాన్(16)గత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు.కాగా ఈనెల3వ తేదిన తెల్లవారు జామున రెండు గంటల సమయంలో రేజర్‌బ్లేడ్‌లను మింగాడు.తక్షణమే గమనించిన తండ్రి మహబూబ్‌అలీ తన కుమారున్ని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.అక్కడ వైద్యులు పరీక్షించి జనరల్ సర్జరీ విభాగంలో అడ్మిట్ చేసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇదిలా ఉండగా బాలుడికి ఎక్స్‌రే తీయగా కడుపులో రేజర్ బ్లేడ్ ముక్కలు ఉన్నట్లు గుర్తించారు.మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రిఫర్ చేయడంతో ఆ బాలునికి వివిధ పరీక్షలు నిర్వహించిన డాక్టర్ రమేష్‌కుమార్ ఎండోస్కోపి నిర్వహించి,సెడషన్ ఇచ్చి ఎండోస్కోపిక్ పద్ధతిలో బ్లేడ్ ముక్కలను తొలగించడానికి ప్రణాళిక రూపొందించారు. కడుపులో విరిగిన రేజర్ బ్లేడ్‌ల అనేక ముక్కలు ప్రమాదంగా ఉన్నట్లు భావించారు.అపారమైన అనుభవం నైపుణ్యం కలిగిన హెచ్ఓడి డాక్టర్ బి.రమేష్‌కుమార్ ఎంతో సునాయసంగా ఎండోస్కోపి పద్ధతిలో నిర్వహించి విరిగిన బ్లేడ్ ముక్కలను తొలగించారు.రోగి కొలువడానికి ఎటువంటి అటంకాలు లేకుండా ఎండోస్కోపి చికిత్సను సాఫీగా, విజయవంతంగా నిర్వహించడంతో ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఎండోస్కోపి ప్రక్రియలో మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగధిపతితోపాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.సాహిత్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.అశికా,సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సయ్యద్‌నదీమ్,పోస్టుగ్రాడుయ్యేట్ డాక్టర్ షేక్‌మహ్మద్ ఖాసీంతోపాటు అనస్థీషియా వైద్యుల బృందం,నర్సింగ్ సిబ్బంది భారతి,ముత్యాలు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి వేగం పెంచండి

### పోలవరం ముంపు పై కేంద్రం స్పందించే వరకు పోరాటం: మంత్రి పొంగులేటి

**భద్రాచలం, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)** దక్షి ణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులకు వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆలయ అభివృద్ధి పనులపై కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణలతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ఇప్పటివరకు కేవలం 25 శాతం మాత్రమే పూర్తవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహిస్తూ 24 గంటలూ నిర్మాణం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షి ంచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో ఆలయ నిర్మాణంలో నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడవద్దని సూచించారు.నిర్మాణానికి వినియోగించే రాళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అత్యుత్తమ నాణ్యత కలిగిన వాటినే ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు, అదనపు అవసరాలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐటీడీఏ పీవో రాహుల్ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షి ంచాలని ఆదేశించారు.ప్రభుత్వ అనుమతులు, నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపిస్తే తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భద్రాచలం ఆలయ పునర్నిర్మాణం కేవలం నిర్మాణ పనులు కాదని, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన పవిత్ర బాధ్యత అని పేర్కొన్నారు. రామయ్య

# మూడేళ్లుగా సిడిపి నిధులకు బ్రేక్

## పేరుకుపోతున్న నియోజకవర్గ సమస్యలు - రూ.10 కోట్లతో మొదలు.. రూ.5 కోట్లకు కుదింపు

**యాదాద్రి భువనగిరి బ్యూరో ,ప్రభాతవార్త:** నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేల వద్ద ఉండాల్సిన నిధులకు ప్రభుత్వం 'కత్తెర్త వేసిందా? సీడీపీకి దాదాపు తలుపులు మూసి.. ఎస్‌డీఎఫ్ పేరుతో విడతల వారీగా నిధులు విడుదల చేస్తున్న విధానం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం.. రెండో విడతకు వచ్చేసరికి కేవలం రూ.5 కోట్లకే పరిమితం చేసింది. అదీ రాష్ట్రంలోని 76 నియోజకవర్గాలకే.. మరోవైపు గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల సమస్యలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో నిధులు లేక అభివృద్ధి ఆగిందా? అన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది. సీడీపీ నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడం.. దాని స్థానంలో ఎస్‌డీఎఫ్ నిధులను ప్రత్యామ్నాయంగా వినియోగించడం.. నిధుల కేటాయింపులోనూ కోతలు పడటం.. వెరసి నియోజకవర్గ అభివృద్ధి నిధుల వ్యవస్థ గందరగోళంగా మారిందన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఎమ్మెల్యేలు ప్రజలకు ఇచ్చిన హామీలు, స్థానికంగా వచ్చిన అభివృద్ధి వినతులు, అత్యవసర మౌలిక వసతుల పనులకు నిధులు సమకూర్చడంలో పరిమితులు ఎదురవుతున్నాయన్న వాదనలు బలంగా వినిపిస్తు న్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న తర్వాత సీడీపీ నిధులను నేరుగా విడుదల చేయకుండా ఎస్‌డీఎఫ్ పేరుతో నియోజకవర్గాలకు నిధులు కేటాయించే విధానాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 2024 నవంబర్ 25న జీవో ఆర్‌టీ నంబర్ 299 ద్వారా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కదానికి రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.1,190 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులను 2024-25 హెచ్‌డీఎఫ్ గ్రాంట్ కింద విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే రూ.10 కోట్ల నిధులకు కూడా వినియోగ పరిమితులు విధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2 కోట్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.కోటి వెచ్చించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో నియోజకవర్గంలో అత్యవసరంగా ఉన్న ఇతర పనులకు ఎమ్మెల్యేలు తమ ప్రాధాన్యత మేరకు నిధులు కేటాయించే అవకాశం ఉందన్నది ప్రశ్నగా మారింది. మొదటి విడతతో పోలిస్తే రెండో విడతలో నిధుల కేటాయింపు భారీగా తగ్గింది. 2025 నవంబర్ 1న జీవో ఆర్‌టీ నంబర్ 251 ద్వారా రాష్ట్రంలోని కేవలం 76 నియోజకవర్గాలకు మాత్రమే ఒక్కొక్కదానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. అంటే తొలి విడతలో రూ.10 కోట్లు అందుకున్న నియోజకవర్గాలకు రెండో విడతలో సగం నిధులతోనే సరిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# హల్ద్వానీ శుద్ధీకరణ కార్యక్రమంపై జీరో ఎఫ్ఐఆర్

**బెంగళూరు,సెప్టెంబరు 4:** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన శుద్ధీకరణ కార్యక్రమంపై బెంగళూరులోని విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అదే వేదికపై ర్యాలీలో ప్రసంగించిన కొన్ని రోజుల తర్వాత ఈ 'శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఉత్తరాఖండ్ బీజేపీకి చెందిన సభ్యులతో పాటు మరికొందరి పేర్లు ఉన్నాయి. ఘటనపై భారత జాతీయ కాంగ్రెస్ ఎస్టీ విభాగం (ఆదివాసీ కాంగ్రెస్) మాజీ వైస్ చైర్మన్ టీఆర్ రామప్ప ఫిర్యాదు చేశారు. ఖర్గే హాజరైన కారణంగా రామ్‌లీలా మైదానం 'అపవిత్రమైందనే కులవివక్ష సందేశాన్ని పంపే ఉద్దేశంతో శుద్ధీకరణ నిర్వహించారని ఆరోపించారు. ఈ కేసులో ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ పేరును కూడా ఫిర్యాదుదారు ప్రస్తావించారు. శుద్ధీకరణ కార్యక్రమంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేసిన అనంతరం భట్ మీడియా ముందు దాని ని సమర్థించి, సమర్థించుకునే ప్రయత్నం చేశారని రామప్ప ఆరోపించారు. కేసును ఎస్సీ/ ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1995, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల కింద నమోదు చేశారు.



# కూకట్‌పల్లి జెఎన్టీయూలో విద్యార్థుల ఘర్షణ

## పలువురికి గాయాలు.. పోలీసుల అదుపులో స్టూడెంట్స్

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం అర్ధరాత్రి తీజ్ వేడుకల సందర్భంగా విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదం ముదిరి.. గౌతమి, మంజీరా హాస్టళ్ల విద్యార్థులు పరస్పరం దాడులకు దిగారు. రెండు వర్గాలుగా విడిపోయి కర్రలతో దాడులు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. గురువారం జేఎన్‌టీయూ హాస్టల్‌లో తీజ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిపై పలువురు దాడి చేయడంతో వివాదం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అనంతరం రెండు వర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో గౌతమి, మంజీరా హాస్టళ్ల విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు విచక్షణారహితంగా దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని హాస్టల్ సిబ్బంది, యాజమాన్యం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు.ఈ గొడవ విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు వెంటనే జేఎన్‌టీయూ క్యాంపస్‌కు చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి విద్యార్థులను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా క్యాంపస్‌లో భద్రతా చర్యలు చేపట్టారు. ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, దాడిలో పాల్గొన్న విద్యార్థుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మరోవైపు విద్యార్థుల మధ్య ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా యూనివర్సిటీ యాజమాన్యం కూడా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. క్యాంపస్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. కూకట్‌పల్లి జేఎన్టీయూ హాస్టల్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 8 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నామని డీసీపీ రితిరాజ్ వెల్లడించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఘర్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలో డీసీపీ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..గురువారం జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిందన్నారు.ఈ నేపథ్యంలో డయల్ 100కి ఫోన్ రావడంతో పోలీసులు వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారని అన్నారు. మళ్లీ అర్ధరాత్రి 2:30కి రెండు వర్గాల విద్యార్థులు ఘర్షణకు దిగారని వివరించారు. దాంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. తొలుత ఓ అమ్మాయికి సమస్య వస్తే.. ఆమె తన స్నేహితుడికి ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న సమయంలో గొడవ పెరిగి గ్రూప్ తగాదాగా మారిందని డీసీపీ రితిరాజ్ చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై కాలేజీ ప్రిన్సిపాల్, వార్డెన్‌తో మాట్లాడతామని అన్నారు.